
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒకపూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-3-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 43 పేజీలు: 10+4 వెల: 8.00



ఉత్తమ లెజిస్లేటర్‌కు యేటా అవార్డు! 2లో

214 మంది పాక్ సైనికులను చంపేశాం: బిఎల్ఎ 5లో


# స్వచ్ఛాంధ్ర కోసం కదలండి


శనివారం తణుకు స్వచ్ఛాంధ్ర సభలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఎం చంద్రబాబు

### అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుకు..

### రెండేళ్లలో మురుగునీటిని శుభ్రం చేసి వ్యవసాయానికి వాడతాం

### 85% రోడ్లకు గుంతలు లేకుండా చేశాం

### తణుకులో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

**తణుకు,మార్చి 15,ప్రభాతవార్త:** స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి. ఇళ్లతోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రూ.10లక్షలకోట్ల అప్పుభారం ప్రజలపై మోపారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని, ప్రజల సహకారంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. 1978, మార్చి 15వ తేదీ 45 ఏళ్ల క్రితం ఇదే రోజు నేను మొదటి సారి అసెంబ్లీలో అడు గుపెట్టాను. ఈ రాష్ట్రంలో ఎవరికీ దక్కని అసాధారణ గౌరవం నాకు దక్కింది. తెలుగు ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం. పాలనలో సంస్కరణలు తెస్తున్నాం. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికను ప్రజలు ఆశీర్వదించారు. కేంద్ర సహకారంతో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టింది. స్వర్ణాంధ్ర 2047 పేరుతో ఒక స్పష్టమైన విధానం తీసు కొచ్చాం. గత పాలకులు ఏనాడైనా ప్రజల్లో తిరిగారా ? పరదాలు కట్టుకుని తిరిగారు. గాల్లో వస్తుంటే నేలపై చెట్లు నరికించారు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేకుండా చేశారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని లూటీ చేసి రూ. 10లక్షల కోట్ల అప్పులు ప్రజలపై మోపారు. అసలు, వడ్డీ కడుతున్నాం. గత పాలకులు చెత్తపైనా పన్ను వేశారు. మీ పట్టాదారు పుస్తకాలపై వారి బొమ్మలు వేశారు. రాజముద్రతో పట్టాదారు పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ తెచ్చి లక్షల భూములు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రైవేటు భూములు 22ఏ కింద పెట్టేశారు. తప్పులు చేసి కప్పిపుచ్చుకునేందుకు రాజ >>2



# 41 దేశాలపై అమెరికా ట్రావెల్ బ్యాన్!

### ఆయా దేశాలు మూడు కేటగిరీలుగా ఎంపిక

**వాషింగ్టన్, మార్చి 15:** ఉద్యోగాల్లో కోతలు, ప్రపంచదేశాలపై ప్రతీకార సుంకాలతో దూకుడుగా వ్యవహరిస్తున్న డొనాల్డ్‌ట్రంప్ కొత్తగా మరో సంచలన నిర్ణయం తీసుకన్నారు. పదులకొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించాలని నిర్ణయించారు. ఇదే విషయమై ఆయన సర్కారు యంత్రాంగం సమగ్ర పరిశీలన చేస్తోంది. 41దేశాలపై ఈ ట్రావెల్‌బ్యాన్ విధించాలని కొన్నింటిపై ఆంక్షలు పెంచాలని ట్రంప్ యోచనగా ఉంది. ఇందుకోసం ముందుగా ఒక అంతర్గత మెమో ఒకటి బయటికి లీక్ అయింది. మొత్తం 41 దేశాలను మూడు గ్రూపులుగా విభజించారు. పదిదేశాలతో ఉన్న మొదటిగ్రూప్‌లో ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తర కొరియా దేశాలున్నాయి. ఈ దేశాల పౌరులకు వీసాలు పూర్తిగా నిలిపివేస్తారు. ఇక రెండోగ్రూప్‌లో ఎరిత్రియా, హైతీ, లావోస్, మైన్మార్,దక్షిణ సూడాన్ >>2

# చేసింది, చేసేది చెప్పండి

### ప్రతి పథకాన్ని అధ్యయనం చేయండి

### మధ్యతరగతి కుటుంబాలను ఆదుకునే బాధ్యత తీసుకొన్నా..

### మంత్రులు, ప్రజాప్రతినిధులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పథకాలపై కచ్చితంగా ప్రజలకు అవగాహన కలిగించే దిశలో మంత్రులు ప్రజాప్రతినిధులు వాటిని పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ప్రభుత్వం పథకాలపై మెరిట్స్‌ను గురించి వివరించడంతో పాటు వారి నుంచి సద్విమర్శలు స్వీకరించాలన్నారు.శనివారం ఉండవల్లిలో అందుబాటులో ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు మట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోడానికి రేయింబవళ్లు పనిచేస్తామన్నారు.మనం అధికారం చేపట్టిన వెంటనే అనేక పథకాలను అమలులోకి తీసుకుని వచ్చామన్నారు.మనం జనం మధ్యలోకి వెళ్ళడానికి,వారికి మన ప్రభుత్వ చిత్తశుద్ధిని వివరించడానికి గర్వపడాలన్నారు. మనం అన్ని వర్గాలకు మంచి చేసామన్నారు.మధ్యతరగతి కుటుంబాలను ఆదుకునే బాధ్యత తీసుకుంటామన్నారు.వారిని దృష్టిలో ఉంచుకుని పథకాలను సిద్ధం చేస్తున్నాం.అర్చకులకు రూ. 10 వేల నుంచి 15 వేలకు జీతాలు పెంచాం. దూప, దీప నైవేధ్యాల కింద ఆలయాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇస్తున్నాం. దేవాలయాల పవిత్రత కాపాడతాం. తిరుమల ప్రసాదంలో నాశిరకం ప్రసాదంపై సీబీఐ విచారణ జరుగుతోంది. ఎక్కడా అపవిత్రతతకు చోటివ్వం.గత ప్రభుత్వంలో రాముని తల తీసేశారు. ప్రశ్నించిన మాపై కేసులు పెట్టారు. అంతర్వేదిలో రథం కాలిపోతే లెక్కలేని విధంగా ప్రవర్తించారు. హనుమంతుని చేయి విరిగితే బొమ్మేగా అని అవహేళన చేశారు. ప్రార్థనాలయాల జోలికి రావాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయి బ్రాహ్మణుల జీతాలు రూ. 15 వేల నుంచి రూ. 25 వేలకు పెంచాం. ఇమాములు, మౌజములకు గౌరవ వేతనం రూ. 15 వేలు చేశామన్నారుజ. గత ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనారిటీలకు రూ.2 వేల కోట్లు ఇచ్చేందుకు మనసు రాలేదు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క వ్యక్తికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి జాగా, పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తాం. ఇప్పటికే లక్షా 14 వేల ఇళ్లు నిర్మించాం. ఈ ఏడాది జూన్ 12 నాటికి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుంది. మన ఎన్నికల వాగ్దానాలను అనుసరించే రూ. 3000 వేలు పింఛను 4000 వేలు చేశాం. 8 లక్షల 8 వేల 570 మంది దివ్యాంగులకు గత ఐదేళ్లలో ఒక్క పైసా కూడా పింఛను పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రూ. 3 వేల నుంచి 6 వేలు చేశాం. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. మన దేశంలో ఒక్క పెన్షన్ల కింద ప్రతి ఏటా 64 లక్షల మందికి రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోంది ఏపీ ప్రభుత్వమే. సేవాభావంతోనే ప్రతి నెలా ఒకటో తేదీ పింఛను ఇస్తున్నాం. గత ఐదేళ్లలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి . ఎన్డీఏ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తోంది. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను గత ప్రభుత్వం నిలిపేసింది. 204 అన్నాక్యాంటీన్లు పునరుద్ధరించాం. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దీపం పథకం కింద పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాము. 48 గంటల్లో లబ్ధిదారులకు కట్టిన డబ్బు రీ పే చేస్తున్నాం. ఇందుకోసం రూ. 2,684 కోట్లు వెచ్చిస్తున్నాం. దీపం పథకం కింద కోటి మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా 93 లక్షల మందికి గ్యాస్ సిలిండర్లు అందించాం. సమైక్యాంధ్రలో నేను దీపం పథకం తెచ్చాను. ఆడ బిడ్డలకు ఇబ్బందిలేకుండా వంటగ్యాస్ ఇస్తున్నాం. డీఎస్సీ ఇప్పటికే ప్రకటించాం.రానున్న విద్యా సంవత్సరం 16,354 టీచర్ పోస్టులు భర్తీచేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుడతాము. ఎంతమంది పిల్లలు ఉంటే >>2




# మార్చిలోనే మండుతున్న ఎండలు

### 42.8°కు చేరిన రెంటచింతల

### కోస్తా జిల్లాల్లోనూ పెరుగుతున్న భుగభుగలు

**విజయవాడ మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వేసవి ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఎండల తీవ్రత గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రకృతి విపత్తుల నియంత్రణశాఖాధికారులు హెచ్చరిస్తున్నారు.సాధ్యమైనంత వరకు ఎండపోడ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. సాధారణంకన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వచ్చే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఉదయం ఏడుగంటలు దాటితేనే ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉష్ణోగ్రతలు మరింత పెరిగినట్లుగా >>2






### పుంగనూరులో టిడిపి

# కార్యకర్త దారుణ హత్య


హత్యకు గురైన రామకృష్ణ(ఫైల్)

### వేటకొడవలితో దాడి చేసి చంపిన ప్రత్యర్థులు

**పుంగనూరు,మార్చి 15,ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురంలో శనివారం ఉదయం రామకృష్ణ అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామకృష్ణ శనివారం ఉదయం గ్రామంలో తన పనుల నిమిత్తం వెడుతుండగా అదే గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త హఠాత్తుగా అతనిపై వేట కొడవలితో దాడి చేశాడు. ఈ దాడిలో రామకృష్ణ అక్కడికక్కడే కూలిపోగా బంధువులు అతనిని వైద్య చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించేలోపున మార్గమధ్యంలో రామకృష్ణ మృతి చెందాడు. అయితే, హతుడు రామకృష్ణ కొన్ని రోజుల క్రితం తనకు ప్రాణహాని ఉందని, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సోషియల్ మీడియాలో మొర పెట్టుకున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తన కుటుంబం కేక్‌కట్ చేసుకుని సంబరాలు చేసుకుంటున్న తరుణంలో తనపై, తన కుటుంబసభ్యులపై ప్రత్యక్ష దాడి >>2


తిరుమల ఆలయం వెలుపల క్యూలైన్ల నిర్వహణను పరిశీలిస్తున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

### రద్దీ పెరిగితే భక్తుల నియంత్రణ

# ఎలా చేస్తున్నారు?

### వెలుపల క్యూలైన్లలోకి ఎక్కడ నుండి అనుమతినిస్తున్నారు

### కంపార్టుమెంట్లలో సౌకర్యాలు, భక్తుల క్యూలైన్లపై జస్టిస్ సత్యనారాయణమూర్తి స్వయంగా పరిశీలన

**తిరుమల,మార్చి 15 ప్రభాతవార్తప్రతినిధి:** రోజుకు సరాసరి 70వేలమంది భక్తులకు దేవదేవుని దర్శనం చేయిస్తున్న విధానం, భక్తుల రద్దీ పెరిగితే క్యూలైన్ల నిర్వహణలో పాటిస్తున్న జాగ్రత్తలు, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి అంశాలపై న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ ,హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్‌సత్యనారాయణమూర్తి నిశితంగా పరిశీలించారు. వెలుపల క్యూలైన్లలో భక్తులను దర్శనాలకు అనుమతిస్తున్న విధానం, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలోకి చేరుకునే విషయం,నిరీక్షిస్తున్న భక్తులకు మెరుగైన సేవలందిస్తున్న సేవకుల పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. తిరుమల >>2

### బుడుమూరు జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

# నలుగురు దుర్మరణం

2లో



శనివారం తణుకులో రోడ్లను శుభ్రపరిచి చెత్తను ఎత్తుతున్న సిఎం చంద్రబాబు

# స్వచ్ఛాంధ్ర కోసం కదలండి

>> తోనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 64 లక్షల మందికి ఏడాదికి రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోంది ఏపీ ప్రభుత్వమే. గత ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ పింఛన్లు ఇచ్చారు. రూ. 200 పింఛన్ని రూ. 2 వేలు చేసింది నేనే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3,000 పింఛను రూ.4000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమ్కైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నాం. మే నెల నుంచి ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం అందిస్తున్నాం. ప్రజ లు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తెచ్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్యతరగతి కుటుంబాలకు బీమా కల్పిస్తున్నాం. రైతు భరోసా కింద రూ. 20వేలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నాం. గత ఐదేళ్లలో ఎక్కడ చూసినా గుంతలే. నూటికి 85 శాతం రోడ్లలో గుంతలు లేకుండా చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే. గతంలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా నేను చేసిన పనుల వల్ల దేశంలో అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గత ఐదేళ్లు అభివృద్ధి అన్న మాట లేకపోవడంతో దక్షణ భారతదేశంలో తక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా ఏపీ నిలిచింది.

**స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలి:** గత పాలకుడు ఐదేళ్లలో కనీసం మట్టి కూడా తీయలేదు. 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మనకు వారసత్వంగా ఇచ్చారు. స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమం చేయాలి. తణుకులో కూరగాయల మార్కెట్ చూశాను. మిగిలిన కూరగాయలు అక్కడే ఉంచడంతో కుళ్లి పోయి పరిసరాలు కలుషితం అవుతున్నాయి. వేస్ట్ టూ ఎనర్జీ కింద కంపోస్ట్ తయారు చేసే టెక్నాలజీ వచ్చింది. రోజుకు ఒక టన్ను చెత్త వేస్తే కంపోస్టు తయారవుతుంది. నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. సమాజం కోసం పనిచేయండి. మన ఆరోగ్యం కాపాడే మున్సిపల్ కార్మికులను నా పక్కన కూర్చోబెట్టుకున్నాను. వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. మన్సిపల్ కార్మికులను ఆదుకునే బాధ్యత మేము తీసుకుంటాము. ఇంట్లో చెత్త బయట వేసి పరిసరాలు కలుషితం చేయొద్దు. పొడి చెత్త, తడి చెత్త రెంటినీ వేరు చేస్తే ఎంతో ఉపయోగపడతాయి. గుర్రపు డెక్క నుంచి కూడా బ్యాగులు, ఎరువులు తయారు చేసే పరిస్థితికి వచ్చాం. బ్యాగులు కూడా తయారుచేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం కార్యక్రమంపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు ముందుకొచ్చిన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ప్లాస్టిక్ పెను భూతం. ప్రకృతిని నాశనం చేస్తోంది. ప్లాస్టిక్ తినడంతో శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్లు వస్తున్నాయి. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రం దేశానికి అన్నం పెట్టింది. కానీ వారు పండించే పంటకు రసాయన ఎరువులు కొట్టడంతో అవి తింటున్న ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. నేడు ప్రతి రోజూ పంజాబ్ నుంచి ఢిల్లీకి క్యాన్సర్ రోగులతో ఒక ట్రైన్ వస్తోందంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు. మా అత్తగారు క్యాన్సర్ తో చనిపోయారు. ఆవిడ పేరుతో బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పి వైద్య సేవలు అందిస్తున్నాము.క్యాన్సర్ నివారణపై ప్రభుత్వానికి సలహాలుఇచ్చేందుకు ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు నోరి దత్తాత్రేయుణ్ణి సలహాదారుగా నియమించాం.

**అక్టోబర్ 2 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తా:** మళ్లీ 95 నాటి ముఖ్యమంత్రిని చూస్తారు. అక్టోబర్ 2 తర్వాత రాష్ట్రమంతటా ఆకస్మిక తనిఖీలు చేస్తాను. మీ ఊరికి వచ్చే విషయం కేవలం రెండు, మూడు గంటల ముందే తెలుస్తుంది. ఎమ్మెల్యేలు పరుగెత్తాల్సి వస్తుంది. సమైక్యాంధ్రలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం దేశంలోనే మొదటిసారిగా నేను ప్రారంభించాను. . ప్రధాని మోదీ ఆదేశాల ప్రకారం స్వచ్ఛ భారత్ నివేదిక ఇచ్చాను. నా ఆశయం ఒకటే స్వచ్ఛమైన ఏపీ తయారుచేయాలి. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర మా లక్ష్యం.విశాఖ ,గుంటూరులో 30మెగావాట్ల రెండు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు నెల్లూరు, రాజమండ్రిలో రూ.700 కోట్లతో 22 మెగావాట్ల విద్యుత్ తయారుచేసే ప్లాంట్లు పెడుతున్నాం. రాష్ట్రంలో 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్త రోడ్లపై ఉంది. అందులో 51 లక్షల చెత్త తొలగింపు పూర్తయింది. అక్టోబర్ 2 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేసేందుకు మంత్రి నారాయణ పనిచేస్తున్నారు. 2027 నాటికి 100 శాతం మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వాడుతాం. ఒకప్పుడు మరుగుదొడ్లు ఉండేవి కాదు. మహిళల ఆత్మ గౌరవం పేరుతో కొత్తవి నిర్మించాం. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4లక్షల 60వేల మరుగుదొడ్లు మంజూరు చేశాం. అందులో 72 వేల మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పట్టణాలు, మండల హెడ్క్వార్టర్స్ లో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మిస్తాం.

**ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి విభాగానికి పెర్మామెన్స్ ఇండికేటర్ ర్యాంకింగ్స్ తయారుచేశాం. మున్సిపల్ శాఖకు 20 పాయింట్లు , పంచాయతీ రాజ్ కు 28 పాయింట్లు, ఎడ్యుకేషన్ కు 14 పాయింట్లు, టూరిజంకు 11 పాయింట్లు, ఇండస్ట్రీస్కు 13 పాయింట్లు, హాస్టల్స్ కు 11 పాయింట్లు , ఎండోమెంట్ కు 11 పాయింట్లు , ఆస్పత్రులకు 9 పాయింట్లు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కు 5 పాయింట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లకు 7 పాయింట్లు, మార్కెట్స్ కు 9 పాయింట్లు, హైవేస్ కు 3 పాయింట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు 7 పాయింట్లు చొప్పున ఇచ్చాం. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లో జిల్లాల ప్రోగ్రస్ గమనిస్తే.... ఎన్టీఆర్ జిల్లా 134 పాయింట్లు, అనాకపల్లి జిల్లా 131 పాయింట్లు , తిరుపతి 128 పాయింట్లు, విశాఖ 127 పాయింట్లు, అనంతపురం 123 పాయింట్లు, కాకినాడ 121 పాయింట్లు, గుంటూరు 119 పాయింట్లు, ఈస్ట్ గోదావరి 118 పాయింట్లు, పల్నాడు 117 పాయింట్లు, అన్నమయ్య 115 పాయింట్లు, అంబేద్కర్ కోనసీమ 115 పాయింట్లు, శ్రీకాకుళం 113 పాయింట్లు, వైఎస్సార్ 113 పాయింట్లు, బాపట్ల 111 పాయింట్లు, ఏలూరు 108 పాయింట్లు, కర్నూలు 104 పాయింట్లు, నంద్యాల 102 పాయింట్లు, సత్యసాయి 102 పాయింట్లు, పార్వతీపురం 100 పాయింట్లు, పొట్టి శ్రీరాములు 100 పాయింట్లు, విజయనగరం 100 పాయింట్లు, కృష్ణా 99 పాయింట్లు, ప్రకాశం 99 పాయింట్లు, వెస్ట్ గోదావరి 97 పాయింట్లు , చిత్తూరు 91 పాయింట్లు, అల్లూరు సీతారామరాజు 68 పాయింట్లు వచ్చాయి. ఐవీఆర్ఎస్ ద్వారా అందరి పనితనాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటాను. జపాన్ వంటి దేశాల్లో రోడ్డుపై చెత్త వేయరు. మనకూ అలాంటి అలవాట్లు రావాలి. మున్సిపల్ శాఖలో వివిధ పనుల నిమిత్తం...పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా రూ. 150 కోట్లు గ్రాంట్ గా అందబోతున్నాయి

**తణుకులో పలు అభివృద్ధి కార్యక్రమాలు:** తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ డైనమిక్ లీడర్. తణుకులో పలు అభివృద్ధి పనులకు నిధులు కావాలని అడిగారు. తప్పకుండా మంజూరు చేస్తాం. ఇక తణుకు అనగానే ప్రముఖ పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ గారిని మనం గుర్తుచేసుకోవాలి. ఆయన తణుకు మున్సిపాలిటీకి ఎన్నో సేవలు చేశారు. ఈ నియోజకవర్గ ప్రజలు టీడీపీకి ఎక్కువ సార్లు పట్టం కట్టారు. అయితే....తణుకు అనగానే టీడీఆర్ బ్రాండ్లు గుర్తొస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. అంతకుముందు తణుకు కూరగాయల హోల్ సేల్ మార్కెట్ ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వ్యాపారం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులతో కలిసి ఎన్టీఆర్ పార్కులో చెత్తను ఊడ్చారు.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.



తణుకులో పారిశుద్ధ్యకార్మికులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



అదుపు తప్పి స్కూటీని ఢీ కొట్టిన కారు

## బుడుమూరు జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

# నలుగురు దుర్మరణం

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మార్చి 15ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలంలోని బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు అతివేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న స్కూటీని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. పాతపట్నంలో వివాహ కార్యక్ర మానికి హాజరై తిరిగి కారులో విశాఖపట్నం వస్తుండగా కారు అదుపు తప్పి ఆగి ఉన్న స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాతపట్నం మండలం పెద్దలోడి గ్రామం ఒకే కుటుంబానికి చెందిన దువ్వారి మీనమ్మ (50), దువ్వారి లక్ష్మీపతి (31), ఉగ్రపల్లి భాస్కరరావు (47) అలాగే స్కూటీపై ఆగి ఉన్న వ్యక్తి విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలోని మద్దూరుశంకరపేట గ్రామానికి చెందిన తోలాపి శంకరరావు (43) అక్కడికక్కడే మృతి చెందారు. ఈప్రమాదంలో మృతిరాలు మీనమ్మ భర్త దువ్వారి కాళిదాసు, అల్లుడైన మృతుడు ఉగ్ర పల్లి భాస్కరరావు కుమార్తె ఉగ్రపల్లి కుసుమ తీవ్రంగా గాయపడ్డారు.

మృతుడు తోలాపి శంకరరావు రణ స్థలం మండలంలోని బంటుపల్లి యుబి పరిశ్ర మలో పనిచేస్తున్నాడు. ఇటీవలే ఇతని కుమారుడు కూడా చనిపోయాడు. లావేరు ఎస్ఐ జి లక్ష్మణరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## మార్చిలోనే మండుతున్న ఎండలు

>> వాతావరణ కేంద్రం తెలిపింది. పల్నాడు జిల్లాలోని రెంటచింతలలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రెంటచింతల ప్రాంతంలో సాధారణంలో మార్చి నెలలో 35 డిగ్రీల వరకు ఎండ ఉంటుంది. ఈసారి మాత్రం మార్చి మధ్యలోనే 42 డిగ్రీలు దాటిపోయింది. దాంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలాం ఉంటుందోనని అక్కడి జనం ఆందోళన చెందుతున్నారు. కోస్తాలోని కొన్ని జిల్లాల్లో వాతావరణ అనూహ్యంగా మారుతోంది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండ తీవ్రంగా పడుతోంది. మార్చిలోనే భానుడు తన ప్రతాపంతో టాప్ లేపేస్తున్నాడు. మరోవైపు వేడి తీవ్రత అధికంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ తలనొప్పి నీరసం గుండెపోటు ప్రమాదాలు పెరుగుతాయి అంటున్నారు వైద్య నిపుణులు, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని రాష్ట్రంలో సాధారణం కంటే 4నుంచి 5 డిగ్రీలు అధికంగా టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉంది.

## రూ.22.86 లక్షల జీఎస్టీ చెల్లించాలని

# నిరుపేద కూలీకి నోటీసులు

**విజయవాడ మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రూ.22 లక్షలకు పైగా జీఎస్టీ చెల్లించాలంటూ నిరుపేద కూలీకి విజయవాడ వాణిజ్యపన్నుల అధికారులు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిలాకు చెందిన జానపాటి వెంకటేశ్వర్లు రూ. 22, 86014 జీఎస్టీ చెల్లించాలని విజయవాడ కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. 2022 లో భాగ్యలక్ష్మి ఎంటర్ప్రైజెస్ పేరిట రూ1 కోటి మేర గ్రానైట్ వ్యాపారం చేశారని అందుకు సంబంధించిన పన్ను చెల్లించలేదని అందులో ప్రస్తావించారు. దీంతో ఆయన ఒక్కసారి కంగుతిన్నారు.ఈ నెల 4న నోటీసు అందుకున్న వెంకటేశ్వర్లు విజయవాడలోని సదరు చిరునామాకు వెళ్ళారు.అయితే అక్కడ భాగ్యలక్ష్మి ఎంటర్ప్రైజెస్ పేరిట ఎటువంటి కార్యాలయం లేదని తెలిసింది. తనకు తెలియకుండా వ్యాపార లైసెన్స్ ఎలా వచ్చిందో అర్థం కావట్లేదని సదరు వ్యక్తి వాపోయారు. విజయవాడ వాణిజ్యపన్నుల అధికారులు ఎటువంటి వ్యాఖ్యానం చేయలేదు. పరిస్థితిని సమీక్షించే దిశలో అధికారులున్నట్లు సమాచారం.

# 41 దేశాలపై అమెరికా ట్రావెల్ బ్యాన్!

>> దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆమెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యాటక, విద్యార్థి వీసాల వంటివిజారీచేయకూడదని భావిస్తున్నారు. వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. ఇక మూడోగ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్‌తోపాటు 26 దేశాలున్నాయి. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ లోపాలుపరిష్కరించుకునే ప్రయత్నాలుచేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యుఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. విదేశాంగమంత్రి మార్కో రుబియో ఆమోదం తర్వాత అధికార ప్రకటన జారీచేస్తారని తెలుస్తోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజార్టీదేశాల ప్రయాణీకులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈనిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక 2023లోనూ ట్రంప్ ఈప్రణాళికలు గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్ లిబియా, సోమాలియా, సిరియా,యెమెన్ వంటిదేశాలనుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని చెప్పారు. దేశభద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ అనుమతించబోమని ఆయన అన్నారు.

# చేసింది, చేసేది చెప్పండి

>> అందరికీ పథకం వర్తింపజేస్తామన్నారు. రైతు భరోసా కింద కేంద్రం ఇచ్చే రూ. 6000కు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ. 14,000 కలిపి మూడు వాయిదాల్లో ప్రతి రైతుకు రూ. 20 వేలు ఇస్తాం. వేట నిషేధ సమయంలో మత్స్య కారులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం కార్యక్ర మాన్ని అమలు చేస్తాం. అభివృద్ధి చేయాలి. సంపద సృష్టించాలి. తద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. దాన్ని సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేయాలి. సంపద సృష్టించకుండా అప్పులు తెచ్చి ఖర్చు చేయడం సరికాదు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకుపోతున్నాం. 2047 నాటికి 42 వేల యూఎస్ డాలర్స్ పర్ క్యాపిటల్ ఆదాయం సాధించాలి. ఏపీలో 2047కి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం తీసుకురావాలన్నది లక్ష్యం. తతఇది సాకారం కావాలంటే 15 శాతం వృద్ధి రేటు ఉండాలి. 2014 19లో వృద్ధి రేటు 13.5ఉంది. వైసీపీ హయాంలో 10 శాతానికి పడిపోయింది. మోదీ నాయకత్వంలో 2047నాటికి దేశం నంబర్ వన్‌గా నిలుస్తుంది. అప్పటికి ఏపీని నెంబర్ వన్ చేయాలన్నది నా ఆలోచన. సుస్థిర ప్రభుత్వాలతో స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 టార్గెట్‌గా ముందుకెళ్తున్నాం. మనం అధికారంలోకి వచ్చి 9 నెలవుతుంది. ఇప్పటికే పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకున్నాం. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు మళ్లీ తెచ్చేందుకు సబ్ కమిటీ వేసి అధ్యయనం చేస్తున్నాం. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాము. గీత కార్మికులను ఆర్థికంగా పైకి తెచ్చేందుకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. చేనేత కార్మికులకు జీఎస్టీ ఎత్తేశాం. అదనంగా రూ.50వేలు ఇంటికి ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. గత ఐదేళ్లలో మద్యం మాఫియా నడిపారు. నాశిరకం బ్రాండ్లు తెచ్చారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రక్షాళన చేశాం. అప్పటికి 5 లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తాం. ప్రతి వ్యక్తికీ ఇల్లు, మంచినీరు , మరుగుదొడ్లు, సోలార్ పవర్ , కరెంటు కనెక్షన్, గ్యాస్ , ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తాం. పేదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం. ఉగాది రోజున పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నాం. పీ4 తో సంపద సృష్టిస్తాం. పేదరికం నిర్మూలిస్తాం. సంపద కొందరికే పరిమితం అవడంతో పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్న 73 కార్యక్రమాలు రూ. 10 వేల కోట్లతో జరుగుతున్నాయి. సర్వే రాళ్లపై రూ. 650 కోట్లు ఖర్చు చేశారు.వాటిపై బొమ్మలు వేసుకున్నారు. ఆ బొమ్మలు తీయడానికి రూ. 30కోట్లు ఖర్చయింది. ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు, గుడులకు, చెట్లకు కూడా పార్టీ రంగులు వేశారు. పట్టాదారు పాసుపుస్తకాలపైనా బొమ్మలు వేశారు.ఇవన్నీ తీసి ఎవ్వరి బొమ్మలు లేకుండా హక్కుదారుల ఫోటోలతో ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే రూ. 6 లక్షల 50 వేల కోట్ల ఎంవోయూలు చేశాం. దీని ద్వారా 5 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఎన్టీపీసీ, జెన్ కో ఆధ్వర్యంలో రూ. 2లక్షల కోట్ల గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ను ప్రధాని ప్రారంభించారు. రామాయపట్నంలో రూ. 95 వేల కోట్ల వ్యయంతో బీపీసీఎల్ రిఫైనరీ పెడుతున్నారు. నక్కపల్లి లో ఫార్మా, కృష్ణపట్నం, ఓర్వకల్లు, కొప్పర్తి, కడపలో 4 ఇండస్ట్రియల్ పార్క్ మంజూరయ్యాయి. తద్వారా ఉపాధి లభిస్తుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్ గా తయారుచేయబోతున్నాం. ఎనర్జీ సెక్టార్ లో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులతో 7 లక్షల 50 వేలమంది ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పటికప్పుడు భర్తీ చేస్తాం. వర్క్ ఫ్రమ్ హోమ్‌తెస్తాం. విశాఖలో గూగుల్ రాబోతోంది. టీసీఎస్ ద్వారా 10 వేల ఉద్యో గాలు వస్తాయి. నిరుద్యోగ యువతకు రూ. 3 వేల భృతి ఇస్తాం. మానవ వనరుల అభివృద్ధికి ప్రాధా న్యత ఇస్తున్నాం. ఫీజు రియింబర్స్ మెంట్ కింద రూ.788 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం విద్యా శాఖలో రూ. 6,500 కోట్లు బకాయిలు పెట్టింది. డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మంత్రులు పవన్ కల్యాణ్ , లోకేష్ ను అభినందిస్తున్నాను. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యామిత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి స్కూల్ కిట్స్ అందిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవకు రూ. 1770 కోట్లు కేటాయించాం. ఎన్టీఆర్ వైద్యసేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు సాయం చేస్తున్నాం. రాష్ట్రంలో ఉండే ప్రతి ఒక్కరికి రూ. 2.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తాం. ప్రీమియం చెల్లించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

# రద్దీ పెరిగితే భక్తుల నియంత్రణ ఎలా చేస్తున్నారు?

>> కొండపై వెలుపల క్యూలైన్లలోగానీ, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో తోపులాటకు తావులేకుండా భక్తులను క్రమబద్ధీకరించి అనుమతిస్తుండటాన్ని ఆయన గమనించారు. ఇక్కడ విజిలెన్స్ విభాగం సిబ్బంది విధుల నిర్వహణ, టిటిడి సిబ్బంది భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తుండటం కూడా ఆయన స్వీయపర్యవేక్షణ చేశారు. జనవరిలో తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో జనవరి 8వతేదీ రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనకు కారణాలపై న్యాయవిచారణకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి నియామకమైన విషయం విదితమే. ఆయన సారథ్యంలో బృందం ఇప్పటికే తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్‌లో ఉంటూ పలు అంశాలపై ఆధారాలు సేకరించారు. అటు టిటిడి అధికా రులు, ఇటు జిల్లా పోలీసు అధికారులు, బం దోబస్తులో పాల్గొన్న పోలీసులను,ప్రత్యక్ష సాక్షులైన క్షతగాత్రులను విచారణ చేసి,పలు విషయాలు రాబట్టారు. తొక్కిసలాటకు కారణాలను తెలుసుకున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి తుదివిడత విచారణ సోమవారం కొనసాగనుంది. దీనికి ముందుగానే శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న ఆయన సారథ్యంలోని బృందం తిరుమలలో భక్తుల క్యూలైన్ల నిర్వహణ, ఏఏ దర్శనాలకు ఎక్కడ నుండి భక్తులను అనుమతినిస్తున్నారు, ఎలా క్యూలైన్లలోకి పంపుతున్నారు, నియంత్రణ ఎలా చేస్తున్నారనే అంశాలను ఆయన పరి శీలించారు. వైకుంఠమ్ ఏవిఎస్ఒ విశ్వనాథం, విఐ సురేశ్ జడ్జితో ఉండి అవసరమైన వివరాలు తెలియజేశారు. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంకోసం లక్షమంది వరకు భక్తులు వస్తుండటం,70వేలమందికి మా త్రమే దేవుని దర్శనం చేయిస్తుండటం విష యాలను తెలుసుకున్నారు. భక్తుల రద్దీ పెరిగితే క్యూలైన్లలో భక్తుల నియంత్రణ, సౌకర్యాల కల్పన, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో నిరీక్షణ, అత్యవసరంగా వెలుపలకు వెళ్ళాలంటే మార్గాలు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలన చేశారు.

**వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లను తనిఖీ చేసిన జడ్జి:** జనవరిలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలకు సంబంధించి జారీచేసిన ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు సమయంలో భక్తులను అనుమతించిన విధానం,తిరుమలలో అమలవుతున్న విధానాన్ని ఆయన గమనించారు. క్షతగాత్రులైన భక్తులు నుండి సమాచారం రాబట్టిన విషయాల్లో తిరుమలకు భక్తులను అనుమతినిస్తే కంపార్టు మెంట్లలో, క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షిస్తామని ప్రత్యక్షసాక్షులైన భక్తులు తెలిపి నట్లు సమాచారం. ఆ అంశాలపై శనివారం దాదాపు రెండు గంటల సమయంపైగా వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌ల్లో ఉండి జడ్జి సత్య నారాయణమూర్తి పరిశీలన చేయడం విశేషం. ఇక్కడ పూర్తిగా అవసరమైన సమాచారాన్ని విజిలెన్స్ సిబ్బంది, వైకుంఠమ్ ఎఇఒలు తెలియజేశారు. అందుతున్న సేవలు కూడా గమనించడం ప్రత్యేకత. ఇంతటి వ్యవస్థ అమలుచేసి భక్తుల భద్రతకు చర్యలు తీసుకుంటున్న టిటిడి గత జనవరి 8న తిరుపతిలో తొక్కిసలాట ఘటన, ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, 51మంది వరకు తీవ్రంగా క్షతగాత్రులవడంపై తనదైన శైలిలో పరిస్థితులు అంచనావేశారు. బైరాగిపట్టెడ పద్మావతి ఉద్యానవనంలో, విష్ణునివాసంలో జనవరి 8వతేదీ రాత్రి తమిళనాడు, కర్నాటక, కేరళ,మహారాష్ట్ర, తెలుగురాష్ట్రాల నుండి వచ్చిన భక్తులకు సదుపాయాలు కల్పించలేకపోగా వారిని కట్టడిచేయడంలో విఫలం అయ్యారనేది న్యాయమూర్తిగా దర్యాప్తులో రాబట్టిన విషయాలు. భక్తుల భద్రతలో, రద్దీని నియంత్రించడంలో టిటిడి అధికారులు, బందోబస్తుకు వచ్చిన పోలీసులు, రెవెన్యూ విభాగం కూడా పూర్తిగా విఫలమైం దనేది ఆయనకు అందిన ఫిర్యాదుల్లో కీలకం. ఈ నేపథ్యంలో సోమవారం 17వతేదీ చివరి విడతగా టిటిడి ఇఒ, తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలను మరోసారి పలు కీలక ప్రశ్నలు సంధించి ఎవరిని బాధ్యుల్ని చేస్తా రనేది ఇప్పుడు అందరిలోనూ ఆందోళన నెలకొంది.

## పుంగనూరులో టిడిపి కార్యకర్త దారుణ హత్య

>> జరిగిందని వీడియోలో ఆరోపించారు. ఈ విషయమై పుంగనూరు పోలీసులకు తాను నేరుగా ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని ఆయన వీడియోలో పేర్కొన్నారు. తనను చంపడానికి ప్రయత్నిస్తున్న వారిపై ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు నిందితులైన వైకాపా వర్గం వారికి మద్దతుగా నిలిచి తనను పట్టించుకోలేదని హతుడు కొన్ని రోజుల క్రితం విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నాడు. హత్యకు గురైన రామకృష్ణ శవాన్ని పోలీసులు పంచనామా నిమిత్తం తరలించారు. పుంగనూరునియోజకవర్గంలో అత్యంత కీలకమైన చంద్రమాకులపల్లె పంచాయతీ తెలుగుదేశంపార్టీకి పెట్టని కోటగా నిలుస్తోంది.ఈ పంచాయతీలోని కృష్ణాపురంలో రామకృష్ణ శనివారంఉదయం గ్రామంనడి బొడ్డులో అత్యంత పాశవికంగా పట్టపగలే హత్య కు గురికావడం సంచలనానికి దారితీసింది. పుంగనూరులో తెలుగుదేశంపార్టీ కార్యకర్త రామ కృష్ణ దారుణహత్య పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్రమంత్రి లోకేష్ దిగ్భ్రాంతివ్యక్తం చేశారు. పుంగనూరులో జరిగిన ఈ ఘటనపై అత్యున్నత దర్యాప్తుకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. దర్యాప్తు చేసేందుకు జిల్లాపోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

## పొలం తగాదాలో బిజెపినేత హత్య

**సోనిపట్(హర్యానా), మార్చి 15:** ఒక భూవివాదంకారణంగా బిజెపి మండల అధ్యక్షుడుసరేంద్ర జవహర్‌ను ప్రత్యర్థ పట్టపగలే తుపాకీతో కాల్చి హత్యచేసాడు. ఈ దారుణఘటన ఓ షాపింగ్‌మాల్‌లో చోటుచేసుకుంది. ఈ సీసీటివి విడియోప్రస్తుతం సోషల్‌మీడియాలో తెగవైరల్ అవుతోంది. హర్యానాలోని సోనిపట్‌జిల్లాలో జరిగిన ఈ హత్యకేసు ఇపుడు సంచలనంగా మారింది. అసలు ఏంజరిగిందనే విషయాల్లోకి వెళితే నిందితుడు బిజెపినేత సురేంద్ర జవహర్‌మధ్య కొంతకాలంగా బూవివాదంకొనసాగుతోంది. తన పొరుగువారి అత్తభూమిని కొనుగోలుచేయడంతో అసలు లొల్లి మొదలయింది. ఈ క్రమంలోనే కొద్దికాలంగా వివాదం నడుస్తోంది. ఈ వాగ్వాదాలన్నీ ఇపుడు హత్య వరకూ దారితీసాయి. శుక్రవారం రాత్రి ఈ దారుణఘటనలో నిందితుడు ముందుగా బిజెపి నేతతో వాగ్వాదానికి దిగాడు.

# ఉత్తమ లెజిస్లేటర్‌కు అవార్డు!

**విజయవాడ మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంపీలకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు ఇచ్చినట్లే రాష్ట్రంలోనూ ప్రతి సంవత్సరం ఉత్తమ లెజిస్లేటర్‌ను ఎంపిక చేసి అవార్డును ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఆ దిశలో తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఏపీ శాసనసభా స్పీకరు అయ్యన్న పాత్రుడికి సీఎం చంద్రబాబు సూచించినట్లు కీలక సమాచారం ఈ బడ్జెట్ సమావేశాల నుంచి వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల వరకు సభలో సభ్యుల పనితీరును విశ్లేషించి ఉత్తమ లెజిస్లేటర్ ఎంపిక చేసే అవకాశం ఉంది. ఆ తర్వాత సంవత్సరాల్లోనూ దీనిని కొనసాగిస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల అసెంబ్లీలో స్పీకర్ కార్యాలయానికి వెళ్లి శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడితో భేటీ అయ్యారు. వివిధ అంశాలు వారి మధ్య ప్రస్తావనకు వచ్చినపుడు దాదాపు 40 ఏళ్ల కిందట వారు శాసనసభ్యులుగా అసెంబ్లీలోకి ప్రవేశించినపుడు అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవి? సభా సంప్రదాయాలకు ఎలా విలువనిచ్చేవారు? చర్చలెలా జరిగేవి వంటివి గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు కూడా సభలో చర్చల్లో ఇంకా నాణ్యత సభ్యుల భాగస్వామ్యం పెరగాలని తద్వారా సభ ప్రజావానిని వినిపించేందుకు వేదికగా నిలబడాలని వారిద్దరూ అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే ఉత్తమ లెజిస్లేటర్ అవార్డు ఇస్తే బాగుంటుందని భావించి, దాన్ని అమల్లోకి తీసుకురావడానికి సూత్రప్రాయంగా ఇద్దరూ అంగీకరించారు. ఉత్తమ లెజిస్లేటర్ ఎంపిక కోసం అసెంబ్లీలోనూ ఒక కమిటీని ఏర్పాటు చేయాలని వారు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

తేది : 16-03-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
విదియ సా.4.59
హస్త ఉ.11.44
వర్జ్యం రా.8.45-10.33
దు.సా.4.45-5.33
రాహుకాలం – సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** అనుకోని సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. శ్రమ తప్ప ఫలితం ఉండదు.

**వృషభం:** అప్పులతో ఏర్పడిన విరోధాలు పరిష్కరించుకుంటారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** అనుకోని విధంగా ధనలాభం పొందుతారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆస్తివివాదాలు పరిష్కారమై నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**తుల :** సంఘంలో గౌరవం పొందుతారు. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం.

**ధనుస్సు:** కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. రుణబాధలు ఎదురైన అధిగమిస్తారు.

**మీనం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి సాయం అందుకొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

అంగరంగ వైభవంగా వెంకటపాలెం

# శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామివారి పట్టువస్త్రాలను తీసుకుని వస్తున్న సీఎం చంద్రబాబు



## - పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం చంద్రబాబు, - కల్యాణోత్సవంలో పాల్గొన్న గవర్నర్ నజీర్

**విజయవాడ.మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెంలో టీటీడీ నిర్వహణలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీశ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా సాగింది. అనుహ్యంగా తరలి వచ్చిన భక్తులు, రాష్ట్రనేతలు, ఇతర ప్రముఖులను అలౌకికానంద పారవశ్యానికి గురి చేస్తూ శ్రీస్వామివారి కల్యాణం కొనసాగింది. ఏడు కొండలవాడు దిగి వచ్చి తమ కళ్ళెదుటనే కల్యాణం చేసుకోవడం మంగళకరంగా భావించిన భక్త జనం గోవింద నామస్మరణం చేస్తూ తమను, తాము మైమరిచిపోయారు. నారాయణను సన్నిదిలోనే నారాయణ సేవ అందుకునే భాగ్యం తమకు కలగడం పుర్వజన్మసృత మంటూ మురిసిపోయారు. శనివారం స్వామి కల్యాణాన్ని తలపెట్టాలని టీటీడీ తలంచింది. ఈ వేడుకతో అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టాలని ఏపీ ప్రభుత్వం సంకల్పించింది. నేటి సాయంత్రం 6.30 నుంచి 8.30వరకు శ్రీస్వామివారి కల్యాణ జరుగుతుందని టీటీడీ ప్రకటించింది. తిరుమల వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవానికి రాజధాని అమరావతి ప్రాంతాన్నిసర్వాంగం సుందరంగా తీర్చిదిద్దారు. రాజధాని నిర్మాణం నిరాటంకంగా సాగాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీనివాస కల్యాణం నిరాటకంగా జరిగేందుకు పలు ఏర్పాటు చేసారు. తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని తిరుమలరాయుని ఆలయం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవానికి వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేశాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తిరుమల ఆలయ ఆకృతులతో గోపురాలు, కళారూపాలు, విశాలమైన కల్యాణ వేదిక నిర్మించారు. కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. కల్యాణోత్సవానికి హాజరైన 25 వేల మందికి పైగా భక్తులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అందరూ శ్రీవారి కల్యాణం వీక్షించేలా ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో అమరావతి రైతులు హాజరయ్యారు. ఈ మేరకు రాజధాని ప్రాంతంలోని ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు పంపించారు. ఐకాస నేతలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యే కంగా ఆహ్వానించారు. రాజధాని వాసులు కళ్యాణ వేదిక వద్దకు వచ్చేందుకు 300 ఆర్టీసీ బస్సులు నడిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి లడ్డు, అన్నప్రసా దాలు, మజ్జిగ, తాగునీరు అందించ ందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. కల్యాణోత్సవానికి తరలివస్తున్న భక్తుల కోసం ఏడు ద్వారాలు ఏర్పాటు చేశారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం జరుప ుతున్నారు. అనుకున్న సమయా నికి జరిగిన ఈ కల్యాణ ఉత్సవానికి హజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఆయన సతీమణి భువనేశ్వరి వెంటరాగా. స్వామివారికి పట ువస్త్రాలను సమ ర్పించారు. సీఎం చంద్రబాబు ముందుగా ఆలయం వద్దకు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి కళ్యాణ వేదిక వద్దకు చేరుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు బహూ కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె. శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అర్చక స్వాములు, వేదపండితులు వైఖానస (వైష్ణవ) సంప్రదాయ పద్దతిలో స్వామి కల్యాణాన్ని భక్తులను భక్తి పారవశ్యానికి లోను చేస్తూ నిర్వహించారు. సంప్రదాయక వస్త్రాలను ధరించి ఈ కల్యాణ ఉత్సవానికి విచ్చేసిన ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, టీటీడీ బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి తదితరులు సాధారంగా ఆహ్వానించారు. శ్రీనివాస కల్యాణానికి విచ్చేసిన ఏపీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి ఆలయం నుండి సతీసమేతంగా కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకుని వచ్చి స్వామివారికి సమర్పించిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని శిరస్సున పెట్టుకుని భక్తి భావనతో వచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పలువురు రాష్ట్రమంత్రులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న గవర్నర్, ముఖ్యమంత్రులుకు అర్చకస్వాముల వేదాశీసులు అందించారు. టీటీడీ తరపున గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్‌ను టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు, టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావులు స్వామివారి చిత్రంతో కూడిన జ్ఞాపికను అందించి సత్కరించారు.

# తిరుమల సమాచారం

## వేసవిసెలవులకు ముందే భక్తులతో తిరుమల కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,మార్చి 15 ప్రభాత వార్తప్రతినిధి:** వరుస సెలవులు...వారాంతం కావడంతో గత రెండురోజులుగా తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. శనివారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఉదయానికి కొండ జనంతో నిండిపోయింది. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు టిబిసి వరకు చేరాయి. వెలుపల లైన్లలో భక్తులు వేలాదిమంది బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం కేటాయించారు.. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఐదారుగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. భక్తజనంతో నిజంగానే కలియుగవైకుంఠం భక్తజనసంద్రంగా మారింది. వైకుంఠం కంపార్టుమెంట్లలో, క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 44వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## మొగలిచెర్ల దత్త మందిరంలో 21న మండలదీక్ష మాలధారణ

**తిరుపతి,మార్చి 15ప్రభాతవార్తప్రతినిధి:** దత్తాత్రేయ స్వామి మండల దీక్షమాలధారణ ఈనెల 21,22,23తేదీల్లో నెల్లూరు జిల్లా లింగసముద్రంమండలం మొగలిచెర్లగ్రామంలో జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. మాలధారణకు సంబంధించి మాలలు భక్తులకు ఆలయం వద్ద ఇవ్వబడుతుందని, భక్తులు స్వామిదీక్ష తీసుకుని దత్తాత్రేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. 41రోజులు దీక్షాకాలమని, దత్తాత్రేయస్వామి సిద్ధిపొందిన వైశాఖ శుద్ధ సప్తమి మేనెల 4వతేదీ మందిరం వద్ద దీక్ష విరమణ చేయాల్సి ఉంటుందన్నారు. దీక్షాసమయంలో దత్తాత్రేయ మందిరం వద్ద ఉండి అనుసరించే ప్రతి భక్తునికి మందిరంలోని అన్నదాన సత్రంలో మధ్యాహ్నం, రాత్రి భిక్ష వితరణ జరుగుతుందన్నారు. దీక్షాధారులతో దత్తాత్రేయుని జపనామస్మరణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూపకల్పన జరుగుతోందన్నారు..

ఆలయంలో ప్రతి శుక్రవారం ఉదయం బృందావనార్చనసేవ, శనివారం రాత్రి పల్లకీసేవ స్వామివారికి విశేషంగా నిర్వహించబడుతుందన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలకు, దీక్షా వివరాలకు 9908973699, 9182882632 నంబర్లకు సంప్రదించాలని ఆలయ ధర్మకర్త కోరారు.

## భక్త కన్నప్ప జన్మస్థలి ఊటుకూరు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా:

హీరో మంచు విష్ణు



భక్తకన్నప్పను దర్శించుకున్న హీరో మంచు విష్ణు

**రాజంపేట అర్బన్ మార్చి 15 ప్రభాతవార్త** ఉమ్మడి కడప జిల్లా రాజంపేట మండలం ఊటుకూరులోని భక్త కన్నప్ప ఆలయాన్ని హీరో మంచు విష్ణు దర్శించుకున్నారు. స్థానిక నాగలింగేశ్వర స్వామి ఆలయం వెలుపలే భక్తకన్నప్ప విగ్రహాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. భక్త కన్నప్ప జన్మస్థలి ఊటుకూరేనని ఓ శిలాశాసనంలో బయటపడింది. తమిళంలో ఉన్న ఈ శిలాశాసనం ద్వారా తెలుసుకున్న గ్రామస్తులు భక్తకన్నప్ప విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న భక్తకన్నప్ప హీరో మంచు విష్ణు శనివారం ఆలయాన్ని దర్శించారు. నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తకన్నప్పను దర్శించుకోవడంతో జన్మ చరితార్థమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఊటుకూరు గ్రామస్తులు భక్తకన్నప్ప ఆలయ అభివృద్ధికి పాటుపడాలని మంచు విష్ణును కోరారు. అందుకు స్పందించన విష్ణు తప్పనిసరిగా ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ పెద్దల ద్వారా ఏమేం పనులు చేయాలో అడిగి తెలుసుకున్నారు. సినిమా రిలీజ్ తర్వాత ఈ పనులను చేపడతామన్నారు. ఏప్రిల్ 25న భక్తకన్నప్ప సినిమా విడుదలవుతుందని వెల్లడించారు. ఈ తరానికి భక్తకన్నప్ప జీవిత విశేషాలు తెలిపేందుకే సినిమా తీసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు రాజంపేటకు చేరుకున్న భక్తకన్నప్ప సినిమా యూనిట్కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. హీరో మంచు విష్ణును చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. ఆయన వెంట డాక్టర్ ఎం.మారుతి కృష్ణ కూడా వచ్చారు.

## భాషా విధానంపై ఒకే మాటకు కట్టుబడి ఉన్నా

### జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** భాషా విధానంపై తానెప్పుడు ఒకే మాటకు కట్టుబడి ఉన్నానని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక భాషను బలవంతంగా రుద్దడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరికాదని పేర్కొన్నారు. భారతదేశ జాతీయ, సాంస్కృతిక ఏకీకరణ లక్ష్యాన్ని సాధించడంలో ఈ రెండు అంశాలు దోహదపడవని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. తాను ఎప్పుడూ హిందీని ఒక భాషగా వ్యతిరేకించలేదని తెలిపారు. దానిని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే వ్యతిరేకించినట్లు పవన్ గుర్తు చేశారు ఎన్ఈపీ2020 స్వయంగా హిందీని అమలు చేయలేదని పవన్ కల్యాణ్ వివరించారు. హిందీ భాష అమలు విషయంలో తన మాటలపై తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదన్నారు. ఎన్ఈపీ2020 ప్రకారం విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏవైనా రెండు భారతీయ భాషలు (మాతృ భాషతో పాటుగా) నేర్చుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. హిందీ వద్దనుకుంటే వారి మాతృ భాషతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ ఇలా ఏదైనా ఇతర భారతీయ భాషను ఎంచుకోవచ్చని ఆయన పేర్కొన్నారు విద్యార్థులకు ఎంపిక చేసుకునే సాధికారత కల్పించడం ద్వారా జాతీయ ఐక్యతను ప్రోత్సహించడం, భారతదేశ గొప్ప భాషా వైవిధ్యాన్ని కాపాడటం కోసం బహుభాషా విధానాన్ని రూపొందించారని పవన్ కల్యాణ్ తెలిపారు. దీన్ని రాజకీయ అజెండా కోసం తప్పుగా అర్థం చేసుకోవద్దన్నారు. బహు భాషా విధానంపై తాను వైఖరిని మార్చుకున్నట్లు చెప్పడం పూర్తిగా అవగాహనా రాహిత్యమే అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రతి భారతీయుడికి భాషా స్వేచ్ఛ, విద్యను ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఉండాలన్న విషయంలో జనసేన పార్టీ కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## టిడిఆర్ బాండ్ల జారీలో నిర్దిష్టమైన గడువు

### - ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీఆర్ బాండ్ల జారీలో ఆలస్యం లేకుండా నిర్దిష్టమైన గడువు విధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. టీడీఆర్ జారీలో మాన్యువల్ విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి టీడీఆర్ బాండ్ల ధరఖాస్తులు, బాండ్ల జారీ కూడా ఆన్ లైన్ లోనే చేయనున్నట్టు పురపాలక శాఖ వెల్లడించింది. మొత్తంగా దీనికోసం నోటిఫికేషన్ నుంచి జారీ వరకూ 50 రోజుల నిర్దిష్ట గడువును విధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. టీడీఆర్ బాండ్ల జారీ ప్రతిపాదనలను టౌన్ ప్లానింగ్ విభాగం నోటిఫై చేస్తుందని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల్లో జరిగే ఆలస్యాన్ని నివారించేలా ఆన్ లైన్ పోర్టల్ ద్వారా టీడీఆర్ బాండ్లు జారీ అవుతాయని పేర్కొన్నారు. ఏయే అధికారి స్థాయిలో ఎన్ని రోజుల్లో ఫైల్ క్లియర్ చేయాలనే దానిపై విధివిధానాలు జారీ చేస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ మెమో జారీ చేశారు.

## రూ.5,350 కోట్లతో 49 పురపాలక సంస్థల పరిధిలో మంచినీరు

**విజయవాడ మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా రూ.5350 కోట్లతో 49 పురపాలక సంస్థల పరిధిలో నివాశితులకు మంచినీరు అందించనున్నట్లు పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ తెలిపారు. ఏఐబీ ఆర్థిక సాయంతో ప్రస్తుతం 25 పురపాలక సంస్థల్లో ఈ ఈ ప్రాజెక్టు అమల్లో ఉండగా మరో 24 పట్టణ స్థానిక సంస్థల్లో విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో నాలు గింటిలో అమృత్ 2.0 కింద పనులు చేపట్టనున్నట్లు వివరించారు. మిగతా 20 పట్టణ స్థానిక సంస్థల్లో ఏఐబీ నేషనల్ హౌసింగ్ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం ముందుకు వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వవాటారూ.1500 కోట్లుగా పేర్కొన్నారు.

## గత ఐదేళ్లలో వీక్లీఆఫ్‌లు తెలియదు!

### - రెండు షిప్టుల డ్యూటీలతో విశ్రాంతి కరవు - తిరుపతి జిల్లా అంతా 2,600మంది పోలీసులతో సరిపెట్టేస్తున్నారు

**తిరుపతి,మార్చి 15 ప్రభాత వార్తప్రతి నిధి:** సమాజంలో ప్రజల ఆస్తుల, మాన రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో 24గంటలూ విధుల్లో ఉండే పోలీసుశాఖలో క్రిందిస్థాయి పోలీసు కానిస్టేబుళ్ళు, హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలవరకు తిరుపతి జిల్లాలో పోలీసులు వీక్లీఆఫ్‌లు ఎరుగరంటే అతిశయోక్తి లేదు. గత ఐదేళ్ళ వైసిపిప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చినా పోలీసులకు వీక్లీఆఫ్‌లు తిరుపతి జిల్లాలోనూ అమలుకాలేదు. పైగా తిరుపతి జిల్లాకేంద్రంలోనేగాక జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌లలో రెండు షిప్టుల విధానంలో విశ్రాంతి కరువైందని పోలీసు వర్గాలు ఆవేదన వెలిబుస్తున్నాయి. తిరుపతి యాత్రాస్థలంగానేగాక పుణ్యక్షేత్రంగా కూడా ఖ్యాతి చెందింది. ఇక్కడకు దేశవిదేశాల నుండి ప్రతిరోజూ 60వేలమంది వరకు యాత్రికులు వస్తుంటారు. పలు రకాల సొంత పనులపై దేశం నలుమూలల నుండి సందర్శకులు, వ్యాపారులు వస్తున్నారు. రోజూవారీగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన ప్రముఖేలగాక ఇతర రాష్ట్రాల నుండి ప్రముఖులు తిరుమల పర్యటనకు వచ్చినపుడు పోలీసు బందోబస్తు తప్పనిసరిగా మారింది. పైగా రెగ్యులర్‌డ్యూటీలతోబాటు అదనంగా బందోబస్తు డ్యూటీలు కూడా వీరితోనే చేయిస్తున్నారు. తిరుపతి జిల్లాపూర్తిగా 2,600మంది పోలీసు సిబ్బందితోనే పాలన సరిపెట్టేస్తున్నారని వాపోతున్నారు. జిల్లాలో తిరుపతి, తిరుమల, రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు ప్రాంతాల్లోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు 200మంది వరకు క్రిందిస్థాయిలో సిబ్బంది ఉండాల్సిన అవసరం ఉన్నా స్టేషన్‌కు 60మందివరకు సరిపెట్టేసి ఎప్పుడో పాతకాలం నాటి సిబ్బంది సంఖ్యనే కొనసాగిస్తుండటంతో రెగ్యులర్ విధులతోబాటు అదనంగా ప్రముఖుల బందోబస్తు, ఇతరత్రా ధర్నాలు, నిరసనలు, భద్రత విదులు స్టేషన్ సిబ్బందితోనే అదనపు భారం మోపుతున్నారని అంతర్మధనం చెందుతున్నారు. తిరుపతి జిల్లా మూడేళ్ళక్రిందట ఏర్పాటుతో పాకాల, యర్రావారిపాళెం, నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, ఉమ్మడి చిత్తూరుజిల్లాలో వడమాలపేట, పుత్తూరువరకు పోలీసుస్టేషన్‌లో జిల్లాకు చేరాయి. ఇవన్నీ కలుపుకుంటే తిరుపతి, చంద్రగిరి, క్రైమ్, ట్రాఫిక్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, పుత్తూరు, నగరి, తిరుమల శాంతిభద్రతలు, ట్రాఫిక్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి. వీటిక్రింద దాదాపు 24సర్కిళ్ళ వరకు ఉన్నాయి. ఈ సర్కిళ్ళ పరిధిలో పోలీసుసిబ్బంది సంఖ్య పెరగకపోవడంతో ఉన్న వారితోనే అదనపు విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల గత ఐదేళ్ళలో విశ్రాంతి అనేది, వీక్లీఆఫ్‌లు కూడా పోలీసులకు తెలియదంటే ఆశ్చర్యంలేదు. నగరపరిదిలోని స్టేషన్‌లలో పరిస్థితి ఇలానే ఉంటే మండల పరిధిలోని పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికీ అదనపు డ్యూటీల భారం తప్పడంలేదని పోలీసులు ఆవేదన చెందుతున్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుళ్ళుగా చేరి పది సంవత్సరాలపైన ఇరవై, ఇరవై ఐదేళ్ళు కావస్తున్నా పదోన్నతులు మాట మరచిపోయామని వాపోతున్నారు . జిల్లా బైఫర్‌గేషన్‌తో తిరుపతి జిల్లాలో పోలీసులు పదోన్నతులకు దూరమయ్యామనే ఆవేదన వుంది. తిరుపతి జిల్లాగా ఏర్పాటైనా పోలీసులు కుటుంబాలకు, ఆరోగ్యపరంగా ఇబ్బందులు తప్పడంలేదు. తిరుపతి జిల్లా పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహిస్తుండటంతో కనీసం అవసరమైన సంక్షేమం అమలుచేయాలని కోరుతున్నారు. పదవీవిరమణ చేసిన వారిస్థానంలో కొత్త నియామకాలు లేకపోవడంతో పోలీసులు సిబ్బంది కొరతవెంటాడుతోంది. కనీసం పోలీసు స్టేషన్‌లలో సిబ్బందికి సరైన సౌకర్యాలు కూడా కరువయ్యాయి.

కుర్చీలుగానీ, ప్రత్యేకంగా గదులు గానీ లేకపోవడంతో రాత్రి విధులు నిర్వహించే మహిళా పోలీసుల కష్టాలు పై అధికారులకు తెలియకపోవడం బాధాకరమని పోలీసు సంక్షేమ సంఘం నాయకులు పెదవివిరుస్తున్నారు. రాష్ట్ర నూతన డిజిపి హరీష్‌కుమార్‌గుప్త పోలీసుల సంక్షేమాన్ని పట్టించుకుని, స్టేషన్‌లలో అదనపు సిబ్బంది నియమాకం చేయాలని పోలీసువర్గాలు కోరుతున్నాయి.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ సునీత

## హత్య జరిగి ఆరు సంవత్సరాలైనా దొరకని న్యాయం

### నిందితుల కన్న మేమే ఎక్కువ శిక్ష అనుభవిస్తున్నాం

### సాక్షులందరూ చనిపోవడం పై ఆందోళన చెందుతున్నాం : వైఎస్ వివేకా కుమార్తె సునీత

**పులివెందుల,మార్చి 15,ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరు సంవత్సరాలు అవుతున్న న్యాయం జరగలేదు అని నిందితులం దరూ బయట ఉన్నారని అందరూ తమ జీవితాన్ని గడుపుతున్నారని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కూతురు వైఎస్ సునీత అన్నారు. వైఎస్ వివేకా ఆరవ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్ కుటుంబ సమాధుల తోటలో వివేకా సమాధి వద్ద భర్త రాజశేఖర రెడ్డి మరియు కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ సునీత ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైయస్ వివేకానంద రెడ్డి హత్య జరిగితే ఇంతవరకు న్యాయం జరగలేదని పెద్ద వ్యక్తి విషయంలోనే ఇలా జరుగుతుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తెలియలేదు అన్నారు. న్యాయం దక్కే వరకు న్యాయపోరాటం అయితే కచ్చితంగా చేస్తామన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

### - మాజీ మంత్రి మేరుగు నాగార్జున



**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందని మాజీ మంత్రివైసిపి నాయకులు మేరుగ నాగార్జున అన్నారు. మంత్రి లోకేష్ అసమర్థ పాలన చేస్తున్నారని ఆరోపించారు. వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ తీసుకువచ్చిన సంస్కరణలకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగంలో విద్యా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారని, యూనివర్శిటీలను రాజకీయం చేస్తున్నారని అన్నారు. విసిలను బెదిరించి రాజీనామా చేయించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం కూడా అరకొర నిధులు ఇచ్చారని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వివరించారు. తమ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం, ఐబి, సిబిఎస్ఇ సిలబస్, బైలింగ్వల్ టెక్స్టుబుక్, డిజిటల్ క్లాస్‌రూముల విధానం, టోఫెల్ శిక్షణ, ట్యాబ్‌ల పంపిణీ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్ అన్నిటికీ మంగళం పాడారని ఎర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న ప్రతిసారీ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల విద్యతో పాటు ఉన్న విద్యను కూడా లోకేష్ వదిలిపెట్టలేదని, విసిలను బెదిరించి రాజీనామా చేయించారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. వైయస్సార్సీపీ హయాంలో ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం, ఐబీ, సీబీఎస్‌సీ సిలబస్, బైలింగ్వల్ టెక్స్ట్ బుక్స్, డిజిటల్ క్లాస్ రూమ్‌ల విధానం, టోఫెల్ శిక్షణ, ట్యాబ్‌ల పంపిణీ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్టు ఇలా ప్రతి దాన్నీ పనికట్టుకుని నాశనం చేయడంలో నారా లోకేష్ ముందంజలో సీఎంగా వైయస్ జగన్ గారు చదువులు ప్రోత్సహించడానికి అమలు చేసిన అమ్మ ఒడి పథకంను కూడా నీరుగారుస్తున్న ఘనుడు నారా లోకేష్. గత ఐదేళ్ల జగన్ విద్యావ్యవస్థలో గొప్ప సంస్కరణలు తీసుకొస్తే వాటిని నామరూపాలు లేకుండా చేస్తున్న ఘనత ఖచ్చితంగా మంత్రి లోకేష్‌దే. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నా, తన పాలనలో ఏనాడూ విద్యావ్యవస్థను పట్టించుకున్న పాపాన పోలేదు.


JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY,ANANTAPUR
ANANTHAPURAMU - 515002 (A.P.) INDIA
XIV CONVOCATION NOTIFICATION
The XIV Convocation of Jawaharlal Nehru Technological University Anantapur, Ananthapuramu is tentatively scheduled in the month of April/May 2025. All UG, PG and Ph.D. Candidates who are qualified for the award of degree during the Academic year 2023-24 are hereby informed to submit the applications through Online only (https://jntuaebranchpayment.in/originaldegree)on or before 15.04.2025. Only Ph.D. Awardees and Gold Medalists will receive the degrees on the dais and others will receive their degrees through registered Post/Courier. Further details can be seen in the web site: www.jntua.ac.in under Examinations section.
Date : 15.03.2025 Sd/- REGISTRAR

# డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

**డాక్టర్ వై.నాగేశ్వర్‌రావు**

దేశంలో రాజుకున్న మరో రాజకీయ రగడ తారస్థాయికి చేరుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన యోచన ప్రకంపనలు సృష్టిస్తోంది. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అభ్యంతరాలు, ఆందోళనలు ఓ పక్క. అబ్బే అలాంటిదేం లేదనే కేంద్ర పెద్దలు ప్రకటనలు మరోపక్క. తమిళనాట అఖిలపక్షం భేటీతో ఈ చర్చ మరింత వేడెక్కింది. మార్చి 22న చెన్నైలో జరగబోయే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధుల సమావేశం మరింత దుమారం లేపింది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్విభజన ప్రక్రియ చుట్టూ అల్లుకున్న వివాదమే ఇదంతా. వివిధ రాజకీయపార్టీల అధినేతలు కూడా దీనిపై తమ అభిప్రాయాలు కుండబద్దలు కొడుతున్నారు. జనాభా నియంత్రణ పాటించడమే దక్షిణాదికి శాపమా? 2026 తర్వాత జరగబోయే జనాభా లెక్కలే ప్రాతిపదికగా తీసుకుంటే జరిగే నష్టం పూడ్చేదెవరు? దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం ఏమైపోవాలి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం దొరకట్లేదు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వాదనలు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు అనే విభజన చర్చకు దారితీస్తున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముందస్తు జాగ్రత్త కోసం దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలు కదులుతున్నాయి. జనాభా ప్రతిపాదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యతగ్గిపోతుందని, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గిపోతే కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించి దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం చేసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పోరును ముమ్మరం చేస్తున్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చాలా అన్యాయం జరుగుతుందని ఆయన ఆరోపిస్తున్నారు. అందుకే ఆయా రాష్ట్రాలను ఏకతాటిపైకి తీసుకురావడం కోసం స్వయంగా రంగంలోకి దిగారు. మార్చి 22న చెన్నైలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని కోరుతూ 6 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలకు ఆహ్వానం పంపారు.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. మార్చి 5న చెన్నైలోని తమిళనాడు సచివాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో 58 పార్టీలు పాల్గొన్నాయి. అందులో వివిధ తీర్మానాలు ఆమోదించారు. డీలిమిటేషన్ వల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాలను ఏకతాటిపైకి తీసుకురావడం ద్వారా ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. అందుకే స్టాలిన్ వివిధ రాష్ట్రాల సీఎంలకు,ముఖ్య రాజకీయ నేతలకు తమ మంత్రుల ద్వారా ఆహ్వానం పంపుతున్నారు.



స్వయంగా లేఖలు అందజేయిస్తున్నారు.బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ సిఎం పినరయి విజయన్, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఏపీ మాజీ సీఎం జగన్మోహన రెడ్డి, ఒడిశా మాజీ సిఎం నవీన్ పట్నాయక్, తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్‌కు స్టాలిన్ స్వయంగా లేఖలు రాశారు. వీటిని తమ మంత్రులకు ఇచ్చి ఆయా రాష్ట్రాల సీఎంలను నేరుగా ఆహ్వానించమని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు మార్చి 22న నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని వారందరినీ కోరాలని సూచించారు.ఈ క్రమంలో తమిళనాడు పరిశ్రమల మంత్రి డీఆర్‌పీ రాజానేతృత్వంలోని బృందంమార్చి 11న ఒడిశాకు వెళ్లి బిజు జనతాదళ్ నేత,మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు లేఖను అందించింది.మార్చి 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించింది. తమిళనాడు అటవీమంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా నేతృత్వంలోని బృందం బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను,ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్‌ను కలిసింది. గురువారం రోజు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ, డీఎంకే నాయకురాలు కనిమొళి నేతృత్వంలోని బృందం కలిసి లేఖ అందించారు.2026తర్వాత చేపట్టే జనగణన వరకునియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎంస్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమరాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్యకార్యాచరణ కమిటీలో (జేఏపీ) చేరేందుకు అంగీకారం తెలపాలని స్టాలిన్ లేఖలో కోరారు.దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టే కార్యాచరణ చేపడతామని స్పష్టంచేశారు. అది నియోజకవర్గాల పునర్విభజన కాదని దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని ఆయన ఆరోపించారు.దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదని,దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని సీఎం ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు రేవంత్‌తెలిపారు. చెన్నైలో నిర్వహించే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై తమిళనాడు సిఎం ఎం.కె.స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయనను ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు. గురువారం రోజు సాయంత్రం బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను హైదరాబాద్‌లో తమిళనాడు మున్సిపల్ పరిపాలన మంత్రి కె.ఎన్.నెహ్రూ, ఎంపీ ఎన్.ఆర్.ఇళంగో కలిశారు.స్టాలిన్ ఆహ్వానలేఖను అందించారు.తమిళనాడు సమాచార, సాంకేతిక మంత్రి పీ.టీ.ఆర్ పళనివేల్ రాజన్ నేతృత్వంలోని బృందం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి ఆహ్వానించనుంది. డీఎంకే నాయకురాలు కనిమొళి నేతృత్వంలోని బృందం బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానించనుంది. అయితే ఈ సమావేశానికి ఏపీ సిఎం చంద్రబాబునాయుడు హాజరయ్యే అవకాశంలేదు. స్టాలిన్ చేపట్టిన పోరాటానికి మద్దతు పలుకుతున్నట్లు కెటిఆర్ ప్రకటించారు. తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున బిఆర్‌ఎస్ పార్టీ తరఫున ఎవరైనా కీలక నేతలు వెళ్లనున్నారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతున్నది అని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి స్పందించిన తీరుపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దక్షిణాదిలో ఒక్కసీటు కూడా తగ్గదుఅని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారని బిజెపి ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నందున ఇప్పటి నుంచే ప్రజల దృష్టి మళ్లించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని దురాలోచనతోనే తమిళనాడు సిఎం డీలిమిటేషన్ తెరమీదికి తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.2026లో రాజ్యాంగ సవరణ తరువాత డీలిమిటేషన్‌పై చట్టంరూపొందుతుందని,కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు పునర్విభజనపై ఎలాంటి ప్రకటన, దానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించలేదనేదన్నారు. దీనిపైన పార్లమెంటులో చర్చ జరుగుతున్న సమయంలో అభిప్రాయాలను కాంగ్రెస్ పార్టీ చెప్పవచ్చు కదా అన్నారు. ●

స్టాలిన్ ఏర్పాటుచేసిన సమావేశానికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.దక్షిణాది ఉత్తరాది అని విభజించాలనే కుట్ర కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదని, దేశ సమైక్యతకు సమగ్రతకు భంగం కలిగేలా కాంగ్రెస్, ఆ పార్టీ ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్న తీరుఅభ్యంతరకరమని పేర్కొన్నారు. అయితే 1971 ప్రకారం డీలిమిటేషన్ అభ్యంతరంలేదని సిఎం స్టాలిన్ స్పష్టంచేస్తున్నారు. కాగా. 1971 తర్వాత దక్షిణాది కంటే ఉత్తర భారతదేశంలోనే జనాభా ఎక్కువగా పెరిగింది. యూపీని ఉదాహరణగా తీసుకుంటే 8 కోట్ల నుంచి 24 కోట్లకు జనాభా పెరిగింది. ప్రస్తుతమున్న జనాభా లెక్కలప్రకారం ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలసంఖ్య 80 నుంచి 143సీట్లకు అదనంగా పెరుగుతుంది. బీహార్‌లో లోక్‌సభ స్థానాలు 40నుంచి 79కి పెరుగుతాయి. ఈ రెండు రాష్ట్రాల నుంచే 222 ఎంపీలు పార్లమెంటులో ప్రాతినిధ్యంవహించే పరిస్థితి వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు కేవలం 12మాత్రమే పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 42గా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 54కి పెరుగుతుంది. 1973 తర్వాత దేశంలో జనాభా భారీగా పెరిగినా మళ్లీ డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా సీట్ల సంఖ్యను పెంచలేదు. ఎందుకంటే 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఈప్రక్రియను 25 సం॥పాటు నిలిపివేస్తూ సంచలన నిర్ణయంతీసుకుంది. ఆ నిర్ణయం కోసం ఏకంగా 42వ రాజ్యాంగసవరణ కూడాచేశారు.ఆతర్వాత 2001లో అప్పటికి అధికారంలో ఉన్న ఎన్డీఏ నేతృత్వంలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ సర్కారు ఈ డీలిమిటేషన్ ప్రక్రియను మరో 25 ఏళ్లు పొడగించారు. దీంతో 1976లో ఆగిపోయిన డీలిమిటేషన్ ప్రక్రియ 50 ఏళ్ల పాటు వాయిదా పడింది. దీంతో 2026 వరకు దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు అవకాశం లేకుండా పోయింది.

---

రాష్ట్రం

హర్యానా

# ఇక 'ట్రిపుల్' ఇంజిన్లు!

**ఎ.వి.వి ప్రసాద్**

పట్టాలపైకి ట్రిపుల్ ఇంజిన్లు వస్తున్నాయి. మెజారిటీ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ఇప్పుడు 'డబుల్' దాటి 'ట్రిపుల్' ఇంజిన్ దిశగా దూసుకుపోతున్నట్లు కనిపిస్తోంది. హర్యానాలో గతవారం జరిగిన స్థానిక ఎన్నికలే అందుకు ఉదాహరణ. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించిన ఆరు నెలలలోపునే డబుల్ నుంచి ట్రిపుల్ ఇంజన్ 'స్థాయి'కి బిజెపి చేరింది. కార్పొరేషన్ ఎన్నికల్లో పది నగరాలకు గాను తొమ్మిది చోట్ల బిజెపి అఖండ విజయం సాధించింది. పదవ సీటులో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించడంతో ఆ సీటు కూడా తమదేనని ఫలితాలు వెలువడిన వెంటనే అమిత్ షా ప్రకటించడాన్ని బట్టి ఆ రాష్ట్రంలో రెండు, మూడవ ఇంజిన్లు పూర్తిగా బిజెపి గుప్పెటలోకి చేరాయనిపిస్తుంది. ఆ పది సీట్లలో ఏడు బిజెపి సిట్టింగ్ స్థానాలే కావడం మరో విశేషం. మాజీ సిఎం భూపిందర్ సింగ్ హుడా ఇలాఖాలోని రోహ్‌తక్‌లో కూడా కాంగ్రెస్ ఓటమి చవి చూడడాన్ని బట్టి ఇక ఆ పార్టీకి రాష్ట్రంలో తేరుకొనే అవకాశమే లేదని తేలిపోయింది. రోహ్‌తక్‌తోపాటు మరో కీలక నగరమైన గురుగ్రామ్‌పై కూడా భూపిందర్‌కే పట్టు ఎక్కువగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో అది కూడా చేజారిపోయింది. బిజెపి మేయర్ అభ్యర్థులు అంబాలా,గురుగ్రామ్, సోనిపట్, రోహ్‌తక్, కర్నాల్, పానిపట్, హిస్సార్, యమునానగర్‌లో ఘనవిజయం సాధించారు. ఒక్క మానేసర్‌లో మాత్రం ఇంద్రజిత్ యాదవ్ అనే స్వతంత్ర అభ్యర్థిని విజయం వరించింది. బిజెపి అభ్యర్థులు గెలిచినప్రతిచోటా భారీ మెజారిటీని సాధించడం కూడా మరోవిశేషం. అంబాలలో బిజెపి నాయకురాలు శైలజా సచ్‌దేవ్‌సమీప కాంగ్రెస్ అభ్యర్థి అమీషాచావ్లాపై దాదాపు 21 వేల ఓట్ల ఆధిక్యతను సాధించారు. అలాగే గురుగ్రామ్‌లో బిజెపి అభ్యర్థి రాజ్‌రాణి 1.79 లక్షల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. పార్టీకి అత్యంత ముఖ్యమైన విజయం ఫరీదాబాద్ నుంచి లభించింది. అక్కడ ప్రవీణ్‌బాత్రా జోషి జాతీయ రికార్డును సైతం అధిగమిస్తూ 3.16 లక్షల ఓట్ల ఆధిక్యతను సాధించడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో ఎవరికి ఆధిక్యత లభించినా ఓట్ల తేడా స్వల్పంగానే ఉంటుంది. దానికి ప్రధాన కారణం స్థానిక సమస్యలపై ఎన్నికలు జరగడం. మేయర్లు కార్పొరేటర్లు ప్రజలతో ఎక్కువ సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో పోలింగ్‌వేళ దాని ప్రభావం తప్పక కనిపిస్తూంటుంది. కానీ హర్యానాలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికలలో కనిపించే వ్యత్యాసం ఓటర్ల నుంచి వ్యక్తమై నట్లు కనిపిస్తుంది. గత అక్టోబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైనా రోహ్‌తక్, ఝుజ్జర్ జిల్లాలపై తన పట్టును ప్రదర్శించింది. ఎనిమిది సీట్లలో ఆ పార్టీ ఏడు చోట్ల ఘన విజయం సాధించింది.



కమలం

అయితే తర్వాత కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ మరింత బలహీనపడినట్లుగా తాజా ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. తొలిసారి మునిసిపల్ ఎన్నికలు జరిగిన మానేసర్‌లో స్వతంత్ర అభ్యర్థి ఇంద్రజిత్ యాదవ్ విజయం సాధించినా, ఆధిక్యతమాత్రం దాదాపు రెండు వేలకోట్లు మాత్రమే లభించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే కార్పొరేషన్‌లో కూడా కనిపించాయనే అభిప్రాయం అందుకనే వ్యక్తమవుతోంది. మార్చి 2వ తేదీన కొన్ని కార్పొరేషన్లలోను, తొమ్మిదవ తేదీన మరికొన్ని కార్పొరేషన్లలోను ఎన్నికలు జరిగాయి. అయితే ఎక్కడ కూడా కాంగ్రెస్ గట్టి పోటీని ఇవ్వలేకపోయిందని ఆయా కార్పొరేషన్లలో అభ్యర్థులకు లభించిన ఓట్ల శాతం చూస్తే అర్థమవుతుంది. ఎన్నికల ప్రచార కాంగ్రెస్ సర్వశక్తులను సమీకరించి పోరాడింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు సచిన్ పైలట్, హుడా వంటి వారు విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 60 శాతం ఓటింగ్ నమోదు కాగా, స్థానిక ఎన్నికల్లో 41శాతం మాత్రమే రికార్డు అయింది.

కాంగ్రెస్ ఇంతగా బలహీనపడడానికి సంస్థాగత, సైద్ధాంతిక సమస్యలను ఎక్కువగా ఎదుర్కొనడమే అని పిస్తుంది. కాంగ్రెస్ ఓట్ల వాటా బిజెపి కంటే 0.85 శాతం పాయింట్లు మాత్రమే తక్కువ ఉన్నప్పటికీ ఆపార్టీ ఓటమికి రెండు అంశాలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. జాట్ వ్యతిరేక సమీకరణ కాంగ్రెస్ తిరోగమనానికి చాలా వరకు కారణమనే అభిప్రాయం చాలా మంది నుంచి వ్యక్తమవుతోంది. 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే, బిజెపి తన ఎనిమిది అదనపు సీట్లలో ఆరుచోట్ల పట్టును నిలుపుకొనగలిగింది. గత సంవత్సరం నుంచి వరుసగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలో బిజెపి తన పట్టును పెంచుకుంటూ వెళ్తున్నట్లే కనిపిస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్ గతంలో బిజెపి నినాదమైతే, ట్రిపుల్ ఇంజిన్ తాజా నినాదంగా కనిపిస్తోంది. 15రాష్ట్రాల్లో బిజెపి స్వయంగా అధికారంలో ఉండగా, మరో ఐదుచోట్ల భాగస్వామ్యపక్షాలతో కలిసి అధికారం చెలాయిస్తోంది. హర్యానాలో ప్రస్తుతం ట్రిపుల్ ఇంజిన్ అంటే స్థానిక అధికారం కూడా సాధించడంతో, అదే విధానం మిగిలిన రాష్ట్రాలలోకూడా కొనసాగించాలనే పట్టుదలతో కనిపిస్తోంది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఏప్రిల్‌లో జరుగనుండడంతో హర్యానా ఫలితమే అక్కడా లభించాలనే దిశగా బిజెపి కదులుతున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ రెండు రోజుల క్రితం ప్రకటన చేస్తూ అక్కడ కూడా ట్రిపుల్ ఇంజిన్ తథ్యమని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన తర్వాత ఆప్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు బిజెపిలో చేరడాన్ని బట్టి ఆపార్టీ పావులను ఏ విధంగా కదుపుతున్నదో అర్థమవుతుంది. దక్షిణాదిలో తగినంత బలం లేకపోవడంతో ట్రిపుల్ ఇంజిన్‌ను ఉత్తరాదిలోనే ఎక్కువ నడపాలనే ఉద్దేశ్యంతో బిజెపి ఉన్నట్లు కనిపిస్తోంది. మరో నాలుగు రాష్ట్రాలలో కూడా వచ్చే అయిదారు నెలల్లో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి.ఎన్ని చోట్ల ట్రిపుల్ ఇంజిన్ నడుస్తుందో చూడాలి. ●

---

దేశం

ఇరాక్

# సెంట్‌కామ్ ఆపరేషన్!

**గన్ని మోహన్**

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా చెలామణి అవుతున్న ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ సిరియా (ఐసిస్) మరో బలమైన దెబ్బ తగిలింది. ఆ సంస్థ గ్లోబల్ లీడర్‌గా వెలుగొందుతున్న అబ్దుల్లా మక్కీ ముస్లిల్ రుఫాయిని అంతం చేసినట్లు ఇరాక్, అమెరికా సంకీర్ణ సేనలు ప్రకటించాయి. అబూ ఖదీజాగా పేరుపడిన ఈ గ్లోబల్ టెర్రరిస్టు ఐక్యరాజ్యసమితి తన నిషేధిత జాబితాలో కూడా ఉంచింది. ఇరాక్‌లోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద నాయకుడిగా అబూఖదీజాకు పేరుంది. అమెరికాపై ఉగ్రదాడులు జరిగిన తర్వాత ఐసిస్, అల్‌ఖైదా వంటి ఉగ్రసంస్థలను నిర్మూలించేందుకు అమెరికానడుం బిగించిన సంగతి తెలిసిందే. అల్‌ఖైదా అగ్ర నాయకత్వాన్ని అంతంచేసిన అమెరికా ఇప్పుడు అదే దారిలో ఐసిస్‌పైనా ఫోకస్‌పెంచింది ఇరాక్, సిరియాలు స్థావరంగా చేసుకుని గ్లోబల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ చీఫ్‌లను చాకచక్యంగా మట్టుపెట్టిన అమెరికా ఇప్పుడు గ్లోబల్ వ్యవహారాలు పర్యవేక్షించే నంబర్‌టూ నాయకుడిగా చెలామణి అయిన అబూ ఖదీజాను మట్టుబెట్టామని ప్రకటించింది. ఇరాక్ ప్రధానమంత్రి మహ్మద్ షియా అల్‌సుదాని ఈమేరకు మీడియా సమావేశం పెట్టిమరీ ప్రకటించారు. ఇరాక్, సిరియాలను స్థావరంగా చేసుకుని ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇస్లామిక్ రాజ్యస్థాపన కోసం శ్వేత జాతి దురహంకారాన్ని అణిచివేస్తామన్న నినాదంతో ఐసిస్ తన కార్యకలాపాలు ఒక దశలో ముమ్మరం చేసింది. అందుకు తగినట్లుగానే ఇస్లామిక్‌స్టేట్ కఠినమైన ఇస్లామిక్ నిబంధనలను సిరియా, ఇరాక్‌లలో కొన్ని మిలియన్ల జనాభాపై అమలు చేసింది. మధ్యప్రాచ్యం, పాశ్చాత్య ప్రాంతం, ఆసియా దేశాల్లో మళ్లీ విస్తృతంచేసే లక్ష్యంతోనే అబూఖదీజా తన కార్యకలాపాలను ముమ్మరం చేసినట్లు సమాచారం.ఐసిస్ మొదటి నేత అబూబాకర్ అల్ బాగ్దాది ఇరాక్, సిరియాల్లో 2014 ప్రాంతంలో నాలుగో వంతుభూభాగం ఆక్రమించి ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించుకున్నాడు. అమెరికా ప్రత్యేక దళాలు 2019లో వాయవ్య సిరియాలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అంతం అయ్యేంతవరకూ తానే ఇస్లామిక్ రాజ్యఅధిపతిగా చెలామణి అయ్యాడు. ఆ తర్వాత అతని గ్రూప్ మొత్తం సంకీర్ణ సేనల చేతుల్లో ధ్వంసమైన తర్వాత ఆగ్రూపు కార్యకలాపాలు కొంతమేర చల్లబడ్డాయి. మళ్లీ అబూ ఖదీజాతో ఊపందుకున్నట్లు సమాచారం. ప్రపంచ వ్యాప్తంగా ఐసిస్ మిలిటెంట్లు, సానుభూతిపరులతో సంప్రదింపులు, వారికి ఆర్థికసాయం, నిధుల సమీకరణ వంటి కార్యకలాపాలను ఈ అబూఖదీజా నిర్వహించేవాడని ఇరాక్ చెపుతోంది.



అబూఖదీజా

అమెరికా సెంట్రల్ కమాండ్ అంటే సెంట్‌కామ్ అబూఖదీజా ఐసిస్‌లో చురుకుగా మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించినట్లు గుర్తించడంతో అతనిపై ఇరాక్ దళాల సాయంతో తన నిఘా నెట్‌వర్క్ మొత్తం కేంద్రీకరించింది. అందుకు తగినట్లుగానే ఐసిస్ 2024 మొదటి అర్థసంవత్సరంలో సుమారు 153 సార్లుదాడులు నిర్వహించినట్లు కూడా తేలింది. అయితే ఇవి కేవలం ఇరాక్, సిరియాలకే పరిమితం కావడం ఆపై ఇతర దేశాలకు విస్తరించకపోవడం కొంత ఉపశమనం కల్పించింది. అబూఖదీజాతోపాటు అతడికి సహాయకుడుగా ఉన్న మరొక మిలిటెంట్ కూడా తమదాడిలో అంతమైనట్లు ఇరాక్, సెంట్‌కామ్ స్వయంగా ప్రకటించాయి. మిలిటరీదళాల దాడి ఎదురైతే ఆత్మాహుతితో చనిపోవాలనుకుని ఈ ఇద్దరూ కూడా ఆత్మాహుతి దుస్తులు ధరించారు. 2023 లోనే అబూఖదీజా విదేశీ కార్యకలా పాలు నిర్వహించడంలోచురుకుగా ఉన్నట్లు గుర్తించారు. ఐసిస్ నియంత్రణలోని సిరియా ప్రాంతాలకు గవర్నర్‌గా కొనసాగుతున్నట్లు కూడా కనిపెట్టారు.2017లోనే ఇరాక్‌లో ఐసిస్ ప్రాదేశికంగా ఓటమి చవిచూసినా ఆ గ్రూపులోని అవశేషాలు ఇంకా చురుకుగానే ఉన్నాయి. ఇరాకీ భద్రతా దళాలపై అప్పుడప్పుడూ దాడులుచేస్తున్నాయి.దీనితో అప్రమతమైనసంకీర్ణ సేనలు అబూఖదీజాను టార్గెట్‌చేసాయి.ఇరాకీప్రభుత్వం, కుర్దిష్ ప్రాంతీయ ప్రభుత్వ నిఘా సమాచారం సమన్వయంతో అబూఖదీజాను అంతం చేసారు. నిజానికి 2017నాటికి ఐసిస్ ఇరాక్‌లోను,2019 నాటికి సిరియాలో కూడా అత్యధికశాతం విచ్ఛిన్నం అయినట్లే చెప్పాలి.కానీ ఈ గ్రూపు అవశేషాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలు, సరిహద్దుప్రాంతాల్లో చురుకుగా కొనసాగుతున్నాయి. తరచూ చేస్తున్న దాడులే ఇందుకు నిదర్శనం. దాడి పూర్తయిన తర్వాత సెంట్‌కామ్ దళాలు, ఇరాక్ సైనిక అధికారులు ఆప్రాంతానికి వెళ్లారు. గతంలో జరిగిన దాడిలో అబూఖదీజా నుంచి రక్తనమూనాలు సేకరించి డిఎన్‌ఎపరీక్షలు సిద్ధం చేసారు. ఆ నమూనాలతోసేకరించిన శాంపిల్స్ మ్యాచ్ కావడంతో మరణించింది అబూఖదీజాయే అని అమెరికా సెంట్‌కామ్ దళపతులు ప్రకటించారు. దీనితో వాయవ్య సిరియాలో బలంగా ఉన్న ఐసిస్‌కు పెద్ద విఘాతమే కలిగిందని చెప్పవచ్చు.సిరియాను కేంద్రంగా చేసుకుని ఐసిస్‌ను దశదిశలా విస్తరించాలని కసరత్తులుచేసిన అబూబాకర్ అల్‌బాగ్దాది తాను దాక్కున్న బంకర్‌లోనే 2019లో హతం అయ్యాడు. అమెరికా ప్రత్యేక జాగిలాలు ముందుగావెళ్లి బాగ్దాదీని చుట్టుముట్టాయి. అదే అదునుగా సంకీర్ణసేనలు ఆనాడుచేసిన ఉపరితలదాడులతో బాగ్దాదీ అంతమయ్యాడని అటు ఇరాక్,ఇటు సిరియాలు కూడా ప్రకటించాయి. రానురాను సిరియాలో వెల్లువెత్తిన అంతర్యుద్ధంలో అధ్యక్షుడు రష్యాకుపారిపోయి తలదాచుకోవడం అక్కడ శాంతియుత ప్రభుత్వ ఏర్పాటుకు ప్రణాళికలు అమలులోకి రావడం జరిగాయి. అదే క్రమంలో ఇరాక్‌లో కూడా అమెరికా సైనిక మద్దతుతో ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు నినాదంతో ఆ దేశం ఉగ్రమూలాలనుంచి బయటపడే కసరత్తులు చేస్తోంది. అందులో భాగంగానే నేడు ఈ అబూఖదీజా అంతం అనిచెప్పాలి. మొత్తంగా చూస్తే ఇరాక్,సిరియాలకు ఇకపై ఐసిస్ ముప్పుగణనీయంగా తగ్గిందనే చెప్పుకోవచ్చు. ●

---

# సుంకాల సమరంలో సామాన్యులే సమిధలా?

**బి. లలితానంద ప్రసాద్**

యుద్ధం అనేది మరో రూపంలో వ్యాపార కొనసాగింపు బెట్రాండ్ బ్రెస్ట్ తన మదర్ కరేజ్ అండ్ హర్ చిల్డ్రెన్ నాటకంలో అన్నమాటలు. హిట్లర్ అప్పట్లో(1939) పోలండ్‌ని ఆక్రమించిన సందర్భం నాటివి. అయినా ఇప్పటికీ ఏదోరూపంలో ప్రపంచమంతటా వర్తిస్తాయి. రెండోసారి ట్రంప్ హయాంలో మరింతగా, సాధారణ యుద్ధాలు అవి జరిగే ప్రాంతాలకు అందులో పాల్గొన్న దేశాలకు సహజంగా పరిమితం అవుతాయి. అయితే అసలు యుద్ధంకన్నా ప్రమాదభరితమైనవి ఇప్పుడు ట్రంప్ తలపెట్టిన విశ్వవ్యాప్త టారిఫ్( సుంకాల) యుద్ధం. దీని ప్రభావాలు, పర్యవసానాలు, విపరిణామాల నుండి యావత్ మానవాళి తప్పించుకోలేదు. ఇప్పటికే వివిధ రూపాల ప్రకటితం అవుతున్న ప్రకంపనలు ముందుముందు మరింత తీవ్ర రూపం దాల్చవచ్చు. వీటి దుష్ప్రభావాలు పడనిప్రాంతం, రంగం, దేశం ఉండకపోవచ్చు. కేవలం మోతాదుల్లో తేడాఉండొచ్చు. ఇందులో పైకి మీడియా ద్వారా నిత్యం తెలియవచ్చు.గణాంక వివరాలు, దామాషా, గుణకాలు, విభజనలు, మిగులు/తగులు, స్టాక్ మార్కెట్లు, క్రిప్టో లాంటి వాటికి మించి అనేకానేకం తెరవెనుక ఉన్నాయి. అంకెల వెనుక ఉన్నఆస్తిని అవగాహన చేసుకుని ఆలింగనం చేసుకోవాలి. అవి విశ్వవ్యాప్త బడుగు వర్గాల సామాన్య ప్రజానీకానికి చెందినవి. ప్రపంచ ఆర్థిక, వాణిజ్య సంపదల పిరమిడ్కి భూమిక వారే. మనకు దాని శిఖరం కనిపించినంతగా దాన్ని అంతగా స్థిరంగా నిలిపే భూమిక పట్టదు. ఈ అట్టడుగు 90 శాతం మాత్రమే ఆ శిఖర పదిశాతాన్ని అక్కడ అనాదిగా కూర్చోపెడుతున్న విషయం విస్మరించరాదు. భౌగోళిక, నైసర్గిక స్థితిగతుల రీత్యా ప్రపంచంలో ఏఒక్క దేశం పూర్తిగా స్వావలంబనతో మనలేదు. ఏదో రీతిలో మానవాళి మనుగడ అంతా పరస్పర ఆధారం అన్నది తరతరాల నుండి కొనసాగుతూనే ఉంది. ఇక ముందు తప్పనిసరి. ఇందుకు ఇతోధికంగా నాగరికత, సాంకేతిక విప్లవ పరిజ్ఞానం, రవాణాలతోపాటు వాణిజ్యం కీలకపాత్ర వహించాయి. వహిస్తున్నాయి.అలాంటి వాణిజ్యంపై పడే విధానాల తాలూకు క్రీనీడలు బహురూపాల్లో జన జీవన సరళిని కాటిన్యం గావిస్తున్నాయి. బ్రతుకు బాటను బీటలుగా మారుస్తున్నాయి. జీవనాన్నిదుర్భరం చేస్తున్నాయి. అవాంఛనీయ విధానాలతో పట్టాలు తప్పిన జీవన వాహనాలని పట్టాలెక్కించడం ఎంతైనా కష్టం. ఈ ఉపద్రవంనుండి మానవాళిని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉంది. మరీ ముఖ్యంగా ఇందుకు కారకులైన వారిపైన అధికంగా ఉంది. వాణిజ్యం లేకుండా ఏ దేశం మనలేదు. ఈ వాణిజ్యంలో సుంకాలు తప్పనిసరి. అయితే అవి ఇరుదేశాలలోని అత్యధిక ప్రజల ప్రయోజనాలు శాశ్వత ప్రాతిపదికన కాపాడగలిగే విధంగా ఉండాలి. ఒకరినొకరు ఇప్పటిలాగా హరించుకునేలా ఉండరాదు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ అంచనాల ప్రకారం70శాతం అంతర్జాతీయ వాణిజ్యం ప్రపంచ సరఫరా గొలుసుల విలువల పైనే ఆధారపడి ఉంది. వీటిలో ముడి పదార్థాలు, విడిభాగాలు, తుది ఉత్పత్తులు ప్రపంచం నాలుగు చెరగుల భిన్న రీతిలో ప్రతిదినం సరిహద్దులు దాటుతుంటాయి. దీన్నిబట్టి విదేశీ వాణిజ్య ప్రాధాన్యత ఎంతటిదో తెలుస్తుంది. ఒక్కోసారి దేశీయ పరిశ్రమల్ని విదేశీ పోటీలు నుండి కాపాడటానికి, దేశీయ వ్యవసాయ రంగంలాంటి వాటిని విదేశీ పోటీనుండి రక్షించడానికి కొన్ని దేశాలు అదనపు సుంకాలు విధిస్తాయి. ఇది ప్రపంచీకరణ పూర్తిస్థాయిలో ఉన్నా ఇంతకాలంయాంటీ డంపింగ్ డ్యూటీల పేరుతో అన్నిదేశాలు అమలుపరిచాయి. అలాగే వివిధ రూపాల్లో ఎగుమతులు ప్రోత్సాహకాలు ఇస్తుంటాయి. విదేశీ ద్రవ్యమారక నిల్వలు పెంచుకోవడానికి, ఎగుమతుల పెంపుకై ద్వైపాక్షిక ఒప్పందాలు ఏర్పరచుకుం టారు. ఇవి,ఇలాంటివి పరస్పర దేశ ప్రజలందరి,పరిశ్రమల ప్రయోజనాల రీత్యా ఆనవాయితీగా వస్తున్నవి. వాటన్నిటిని ఉన్నఫలంగా తలకిందులు మార్పులు చేయాలి అంటేఎట్లా? ఇంతవరకు ఓ సంప్రదాయంగా కొనసాగుతున్న సమస్తాన్ని ఉన్నఫలంగా మార్చడం అంటే ఈ ప్రక్రియలో అంతర్జాతీయ



గాలైన ఆర్థిక వ్యవస్థలు అన్నిటిని అస్తవ్యస్తం చేయడమే. అందునా అమెరికాకి తమ ఎగుమతులు అధిక శాతం గల మెక్సికో 78శాతం,ఇండియా 18శాతం,థాయిలాండ్ 17 శాతం, సౌత్ కొరియా 16శాతం లాంటి వాటిపై అధిక ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఈ దేశాలతో పాటు అన్ని దేశాలలోనూ వీటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుసంధించబడి సర్వమానవాళి బ్రతుకు భారం అవుతుంది. జీవనం గడవడం దుర్భరం అవుతుంది.ఆయా బడుగు దేశాలతో పాటు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ అల్పాదాయ వర్గం, సామాన్య ప్రజానీకం వందలాది కోట్ల మంది ఉంటారు. వారందరికీ నిత్యావసరాలు ఉంటాయి. అత్యవసరాలు ఉంటాయి. మొదటివి ఆహారపదార్థాలు లాంటివి. ఆహారం పండించడానికి కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, రసాయనాలు దేశీయంగా లభించకపోతే దిగుమతులపై ఆధారపడటం తప్పనిసరి. వ్యవసాయఆధార పరిశ్రమల అస్తిత్వం, భవిష్యత్తు పంట పొలాల్లోనే నిర్దిష్ట రూపం దాలుస్తుంది. అలాగే అనారోగ్యంతో రుగ్మతలపాలైన కోట్లాదిమందికి అత్యవసరాలు అయిన దేశీయంగా లభించని మందులు లాంటివి అనేకం ఉంటాయి. వాటిని దిగుమతి చేసుకుతీరాలి. ఇక సమస్తరంగాలకు, వాటి కార్యకలాపాలకు ఊపిరి అయిన ఇంధనం అవసరాలుంటాయి. అవి ఏ కొన్ని దేశాలకు తప్ప అందరికీ దేశీయంగా లభ్యం కావు. ఇవన్నీ లేక వీటిలో ఏ కొన్నింటికైనా ప్రపంచ దేశాల్లో ప్రతి దేశం ఏదోరకంగా ఏదో రూపంలో మరో దేశంపై ఆధారపడక తప్పదు. అసలే ఈ సామాన్యులకు గల అంతంత మాత్రపు కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కొరత రీత్యా ఈ అదనపు సుంకాల భారం మూలిగే నక్కపై తాడి పండు పడినట్లే కాగలదు. వీరికి అదనంగా ప్రతి సంవత్సరం విశ్వవ్యాప్తంగా కోట్లాదిమంది కళాశాలల నుండి యూనివర్సిటీల నుండి బయటకు వచ్చి నిరుద్యోగులుగా మిగిలిపోతున్న దిక్కుతోచని వారు అనేకులు. ఏ వస్తువు, సరుకు, పరికరాలు లాంటివి ఏవైనా వాటి ఉత్పత్తి తయారీ అంతిమ లక్ష్యం వినియోగానికే కదా!. అలాంటి వినియోగదారుడు దైనందిన ఆర్థిక విషవలయంలో చిక్కు కుంటే ఇక ఈ విదేశీ వాణిజ్యం అంతా ఏమైపోవాలి?. ఈ ప్రక్రియల పరంపరలో సమిధలయ్యే సామాన్యుల మాటేమి టి?. ఇక్కడ ఈ కొనుగోలుదారులు లేకపోతే పంపించే ఎగు మతిదారులు అక్కడఏమైపోవాలి?. ఎవరికి ఎక్కడికైనాఎలా పంపుతారు?. ఈప్రశ్నల పరంపరకి బదులు ఎవరిస్తారు? తయారీ రంగంలో అనేక పారిశ్రామిక ఉత్పత్తులు అంచ లంచలుగా తయారవుతాయి.ఒక ఉత్పత్తి మరోదానికి ముడి సరుకు కాగలదు. మచ్చుకి ఆటోమొబైల్ రంగంలో ఒక వాహన తయారీలో కొన్ని వందల భాగాలుంటాయి. అవి విడివిడిగా తయారవుతాయి. విభిన్న ప్రాంతాలలో, అలాగే కంప్యూటర్లు, ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా. మరీ ముఖ్యంగా మనిషికి ముఖ్య అవసరాలైన మందులు అంతే. వాటి తయారీలో వివిధ దశలుంటాయి. ప్రతి దశలోనితుది ఉత్పత్తి అనంతరం దానికి తొలి ముడి పదార్థం కాగలదు. ఇవి ఇలాంటి వాటిలో అన్ని విభాగాలు విభిన్న దశలలో ఎక్కడికక్కడ అత్యధిక సుంకాలు పోటాపోటీగా పరస్పర దేశాలు విధించుకుంటూ పోతే అంతిమ ఉత్పత్తి ఉత్పాదక వ్యయం తడిసి మోపెడవుతుంది. తిరిగి తిరిగి అదంతా కొనుగోలుదారుడే భరించాల్సిందే. ఈ పెను భారం అసలే అంతంతమాత్రం ఆదాయంతో బతుకు భారమైన సామాన్య జనం ఈ అదనపు బరువును ఎలా భరించగలరు? ధరలు పెరగడంతో పర్యవసానంగా కొనుగోళ్లు మందగిస్తాయి. దాంతో ఉత్పత్తి తగ్గిస్తారు. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అమ్మకపు ధర పెరగాలి. దీనితో ద్రవ్యోల్బణంపెరుగుతుంది. పెరిగిన సుంకాల కారణంగా వినిమయ దారులు కొనలేరనే భయంతో దిగుమతిదారులు వీటికి దూరంగా ఉండే ప్రమాదం ఉంది. అప్పుడు రెండు రకాల ఉపద్రవాలు. ఒకటి వినియోగదారునికి కావలసినవి అందవు. అటుప్రభుత్వానికి అంతిమంగా అంతకుముందు వచ్చు ఆదాయం కూడా వారు ఆశించిన విధంగా రాదు. పైగా ఎగుమతిదారు ప్రత్యామ్నాయ దిగుమతి దారుల కోసం అన్వేషిస్తారు. ఈ దిగుమతుల కొరతతో దేశీయ పరిశ్రమలు కుంటూబడవచ్చు. ఈ బహుముఖ విపరిణామాలు రీత్యా పోటాపోటీగా పరస్పరం పెంచుతున్న ఈ ప్రతీకార సుంకాల విషయంలో అన్ని దేశాలు సంయమనం పాటించాలి. పూర్వాపరాలు ఏకపక్షంగా కాక

# 214 మంది పాక్ సైనికులను చంపేశాం

## బలూచ్ లిబరేషన్ ఆర్మీ కీలక ప్రకటన



**ఇస్లామాబాద్, మార్చి 15:** పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు మంగళవారం ప్రయాణికుల రైలును హైజాక్ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) కీలక ప్రకటన చేసింది. తమ రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగియడంతో తమ చెరలో ఉన్న 214 మంది పాక్ సైన్యాన్ని చంపేశామని పేర్కొంది. ఆపరేషన్ ముగిసిందంటూ పాక్ ప్రభుత్వం చేసిన ప్రకటనను కూడా బిఎల్‌ఎ ఖండించింది.

'మా రాజకీయ ఖైదీల విడుదలకు పాకిస్థాన్ సైన్యానికి 48 గంటల సమయం ఇచ్చాం. మా చెరలో బందీలుగా ఉన్న వారిని రక్షించుకునేందుకు సైన్యానికి మేము ఇచ్చిన చివరి అవకాశం. కానీ, పాక్ తన మొండితనాన్ని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శించింది. ఫలితంగా శత్రు సైన్యానికి చెందిన 214 మందిని మేం హతమార్చాం. బిఎల్‌ఎ ఎప్పుడూ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తుంది. అయితే ఇస్లామాబాద్ సైన్యం తమ సిబ్బందిని కాపాడుకునేందుకు బదులుగా మాతో పోరాడాలని ప్రయత్నించింది. ఫలితంగా బందీలను కోల్పోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోగిల్లోని బందీలను రక్షించేందుకు పాకిస్థాన్‌లోని ఎస్‌ఎస్‌జి కమాండోలు రాగానే మా యోధులు వారిని చుట్టుముట్టి భీకర దాడి చేశారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ దాడుల్లో పలువురు బందీలను ఉరితీయగా ఎస్‌ఎస్‌జి కమాండోలు భారీ ప్రాణనష్టాన్ని చవిచూశారు. మా వాళ్లు చివరి బుల్లెట్ వరకు పోరాడారు.

చనిపోయిన తిరుగుబాటుదారుల మృతదేహాలను చూపించి విజయం సాధించామని ఇస్లామాబాద్ ప్రభుత్వం వాస్తవాలను కూడా కప్పిపుచ్చుతోంది. సైన్యం, ఇంటెలిజెన్స్ బృందం ఉన్నప్పటికీ బందీలను రక్షించుకోవడంలో శత్రు సైన్యం విఫలమైంది. యుద్ధ సూత్రాలకు కట్టుబడి మేం విడుదల చేసిన వారిని కాపాడినట్లు ప్రకటించుకుంది. ఈ యుద్ధం ఇంకా ముగియలేదు. బలూచ్ యోధులు వివిధ ప్రాంతాల్లో మెరుపుదాడులతో ఆక్రమిత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో బలూచ్ విజయం సాధించింది' అని మిలిటెంట్ సంస్థ పేర్కొంది. ఇక, హైజాక్ సమయంలో మరణించిన బిఎల్‌ఎలకు మిలిటెంట్ సంస్థ నివాళులర్పించింది.

పాక్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలూచ్ వేర్పాటువాదులు హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది బందీలు మరణించగా దాదాపు 33 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టి మిగతా ప్రయాణికులు అందరినీ సురక్షితంగా విడిపించామని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. బలూచ్ మిలిటెంట్లు చంపిన 26 మందిల్లో 18 మంది సైనికులని పాక్ ఆర్మీ కూడా పేర్కొంది. ఇక, ఈ ఆపరేషన్ ముగిసినట్లు ప్రకటన విడుదల చేసింది. అయితే, బలూచ్ మిలిటెంట్లు ఇందుకు విరుద్ధంగా పేర్కొనడం గమనార్హం.



# నన్ను ఏడురోజులు జైల్లో పెట్టారు..

### ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జరిపిన ఆందోళనలో అప్పటి అసోం ప్రభుత్వం నన్నెంతో వేధించింది..

### నాటి రోజుల్ని గుర్తు చేసుకొన్న అమిత్‌షా

**గౌహతి, మార్చి 15:** అస్సాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాను కూడా నిర్బంధాలను ఎదుర్కొన్నానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు నిర్వహించిన ఆందోళన కారణంగా తనని జైల్లో పెట్టారని, తనపట్ల కఠినంగా వ్యవహరించారని పేర్కొన్నారు. డెర్గావ్‌లోని లచిత్ బర్ఫుకాన్ పోలీస్ అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా తన విద్యార్థి జీవితాన్ని అమిత్ షా గుర్తుచేసుకున్నారు. అస్సాంలో హితేశ్వర్ సైకియా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధాని ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా విద్యార్థులంతా కలిసి ఆందోళన నిర్వహించాం. అప్పట్లో నన్ను 7 రోజుల పాటు జైల్లో పెట్టారు. నా పట్ల కఠినంగా వ్యవహరించారు. నాపై భౌతికంగా దాడి చేశారు కూడా అని అమిత్ షా అన్నారు. సైకియా అస్సాం కు కాంగ్రెస్ తరఫున రెండు పర్యాయాల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అస్సాంలో శాంతికి ఏ మాత్రం కృషి చేయలేదని అమిత్‌షా దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన 10ఏళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని చెప్పారు. 10వేల మంది యువత ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. ఈ పోలీస్ అకాడమీకి లచినత్ బర్ఫుకన్ అని పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. మొఘలుల సామ్రాజ్యాకాంక్షను, వారి దాష్టీకాలను ఎదుర్కొన్నవారిలో లచిత్‌బర్ఫుకన్ ఒకరు. ఆయన చరిత్ర కేవలం అస్సాంకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా తెలియాల్సిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు.

## హోలీ పండుగ తెచ్చిన ఘర్షణలు

# బీర్‌భుమ్‌జిల్లాలో టిఎంసి వర్సెస్ బిజెపి



**కోల్‌కత్తా, మార్చి 15:** బెంగాల్‌లోని భీర్‌భుమ్ జిల్లాలో హోలి పండుగ బిజెపి, టిఎంసిలమధ్య మరోసారి హింసను రాజేసింది. సైంథియా పోలీస్‌స్టేషన్‌ప్రాంతంలో ఈఘర్షణలు జరగడంతో పోలీసులు 21 మందిని అరెస్టు చేసారు. ఈ ఉద్రిక్తతలు మరింతపెరగకుండా ఉండేందుకు రాష్ట్రప్రభుత్వం ఇంటర్నెట్‌సేవలను ఈనెల 17వ తేదీవరకూ సస్పెండ్‌చేసింది. సైంథియా పట్టణం, మరోఐదు పంచాయతీల పరిధిలో ఇంటర్నెట్‌సేవలు రెండురోజులపాటు బంద్ చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఘర్షణ సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఆప్రాంతానికి వెళ్లారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. రెండువైపులా కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. వారందరికీ ఆసుపత్రుల్లో చికిత్స అందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతానికి అదనపు పోలీస్ బలగాలను కూడా పంపించామని ఎస్పీ వెల్లడించారు. బిజెపి నేత అమిత్ మాలవియ మాట్లాడుతూ హిందువులు అనైపూర్‌గ్రామంలో హోలీ నిర్వహించుకుంటున్నారని, వీరిని టిఎంసి పంచాయతీసభ్యుడు ఆధ్వర్యంలో అడ్డుకుని దాడులుచేసారని ఆరోపించారు. హిందువుల జైశ్రీరాం అన్న నినాదాలుచేయడంతో ముందు వారిని ప్రశ్నించారని, ఇలా చేయడానికి మీకెంత ధైర్యం అంటూ వారిని అడ్డగించి దాడులుచేసారన్నారు. పోలీసులు అక్కడ ఉన్నప్పటికీ టిఎంసి కార్య కర్తలు ఎక్కడా అడ్డూ అదుపూ లేకుండా దౌర్జ న్యాలకు దిగారని అన్నారు. అయితే ఈప్రాం తంలో మరింత ఉద్రిక్తతలు చెలరేగకుండా బీర్‌భుమ్ జిల్లాలోని సైంథియాల్ పరిసర ఐదు పంచాయితీల్లో ఇంటర్నెట్ బంద్ చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఇంటర్నెట్ ఎందుకు బంద్‌చేసారని మాలవీయ ప్రశ్నించారు. మమతా ప్రభుత్వం ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, ఆమె హయాంలో బెంగాల్ బంగ్లాదేశ్‌లా మారిపోయిందని ఆమె కులమతపరమైన ఓటుబ్యాంకు రాజకీయాలకోసం బెంగాల్ సంస్కృతికి మచ్చ రానీయబోమని, రానున్న ఎన్నికల్లో ఆమె గద్దెదిగిపోతుందని అన్నారు. వాయిస్‌కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు మినహా డేటా మొత్తం బంద్ అవుతుందని హెచ్చరించారు. సైంథియా, హటోరా గ్రామ్‌పంచాయతీ, మల్‌పల్సా జిపి, హరిసారా జిపి, దరియాపూర్ జిపి, ఫూలూర్‌జిపిల్లో ఈ ఇంటర్నెట్‌ను బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. 17వ తేదీ ఉదయం ఎనిమిది గంటలవరకూ ఈ ఇంటర్నెట్ బంద్‌లో ఉంటుందన్నారు.




# పాలస్తీనాకు మద్దతు తెలిపిందని భారత్ విద్యార్థిని వీసా రద్దు

**కొలంబియా, మార్చి 15:** పాలస్తీనాకు మద్దతుగా కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు అమెరికాలో పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినసంగతి తెలిసిందే. ఈనిరసనలకు భారత్‌కు చెందిన ఒక విద్యార్థిని మద్దతు తెలిపినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఈక్రమంలో ఆమె వీసాను రద్దుచేయగా ఆమె స్వీయబహిష్కరణకు గురయినట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. భారత్‌కు చెందిన రంజనీ శ్రీనివాసన్ ఎఫ్1 విద్యార్థి వీసాపై అమెరికాలోఉన్నారు. ఇటీవలినిరసనలకు ఆమె మద్దతిచ్చినట్లు అక్కడి అధికారులు ఆరోపించారు. దీనితో ఆమె వీసాను రద్దు చేస్తున్నట్లు యుఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ మార్చి 5న ప్రకటించింది. అయితే సిబిపి హోమ్ అనే యాప్‌ను ఉపయోగించి ఆమె మార్చి 11న స్వీయ బహిష్కరణకు గురయినట్లు డిహెచ్‌ఎస్ తెలిపింది. అందుకు సంబంధించిన విడియో కూడా విడుదల చేసింది. డిహెచ్‌ఎస్ సెక్రటరీ క్రిస్టీనోయెమ్ ఒక ప్రకటన విడుదలచేస్తూ అమెరికాలో నివసించడానికి, చదువుకోడానికి వీసా మంజూరుచేస్తాం. కానీ ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా నిరసనలు తెలిపినపుడు వాటిని రద్దుచేస్తాం. అలాంటివారు ఈదేశంలో ఉండకూడదు. మిలిటెంట్ సంస్థలకు మద్దతుగా నిరసనలు తెలిపిన కొలంబియా యూనివర్సిటీ విద్యార్థిని ఒకరు స్వీయ బహిష్కరణకోసం సిబిపి హోంయాప్ ఉపయోగించినందుకు సంతోషిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇక డిహెచ్‌ఎస్ ఇటీవలే ఈసీబిపి హోమ్ యాప్‌ను ప్రారంభించింది. ఈ యాప్ లోని టూల్‌ను ఉపయోగించి స్వచ్ఛందంగా దేశాన్ని వీడేఅవకాశం కల్పిస్తుంది. ఇదిలా ఉంటే ఎఫ్-1 విద్యార్థి వీసా ముగిసినా అమెరికాలోనే ఉంటున్న పాలస్తీనాకు చెందిన మరో విద్యార్థిని లెకా కోర్దియాను అక్కడి అధికారులు అరెస్టు చేసారు. హాజరు సరిగా లేకపోవడంతో లెకా వీసాను 2022 జనవరి 26వ తేదీ రద్దు చేసినట్లు వెల్లడించింది.

## డొనాల్డ్ ట్రంప్ ముఖానికి

# రిపోర్టర్ మైక్ తగిలింది!



**వాషింగ్టన్, మార్చి 15:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విలేకరులతో మాట్లాడుతుండగా.. ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ రిపోర్టర్ అత్యుత్సాహం కారణంగా ఆయన ముఖానికి మైక్ తగిలింది. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జాయింట్ బేస్ ఆండ్రూస్ విమానాశ్రయంలో గాజా పరిస్థితులపై విలేకరులు అడుగుతున్న ప్రశ్నలకు ట్రంప్ బదులిస్తున్నారు. ఆ సమయంలో ఓ రిపోర్టర్ తన బూమ్ మైక్రోఫోన్‌ను ప్రమాదవశాత్తూ అధ్యక్షుడి ముఖానికి తగిలించారు. దీంతో ఆయన కొంచెం ఇబ్బంది పడ్డారు. దీంతో ట్రంప్ తన కనుబొమ్మలతో ఆ రిపోర్టర్ వైపు హెచ్చరికగా చూశారు. ఆ వెంటనే 'ఆమె ఈరోజు టెలివిజన్‌లో హాట్‌టాపిక్‌గా మారబోతోంది' అని చమత్కరించారు. ఇక, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.




# 'తమిళం మధురమైన భాష, దేశానికి, ప్రపంచానికి అందిన ఆస్తుల్లో అదొకటి'

### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్!


**చెన్నై, మార్చి 15:** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యావిధానం అమలు విషయంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళం మధురమైన భాషని అన్నారు. శనివారం ఆయన తమిళనాడులోని శ్రీపెరుంబుదూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రూ.1,112 కోట్లతో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తమిళం చాలా మధురమైన భాష. మనమంతా తమిళ సంస్కృతిని గౌరవిస్తున్నాం. దేశానికి ఈ ప్రపంచానికి అందిన ఆస్తుల్లో అదొకటి. ఆ విషయంలో మనమంతా గర్వపడాలి. అలాగే అన్ని భారతీయ భాషలను ఆస్వాదిద్దాం. మన ప్రధాని అదే స్ఫూర్తితో పని చేస్తున్నారు. ప్రతిభాషకు ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉండేలా చూసుకోవాలి. మొత్తంగా మనదేశాన్ని ఐక్యంగా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చుకోవడం, ప్రపంచం మన శక్తిని గుర్తించేలా చూసుకోవడం వంటి లక్ష్యాలను కలిగి ఉండాలి అని మంత్రి అన్నారు. జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# మిసైల్ ఆపరేషన్‌తో ఐసిస్ అబూఖదీజా హతం



**బాగ్దాద్, మార్చి 15:** ఉగ్రవాదుల ఏరివేతలో అమెరికా మంచి ఫలితాలను రాబడుతోంది. ఇస్లామిక్‌స్టేట్ గ్లోబల్ ఆపరేషన్స్ చీఫ్ అబ్దుల్లా మక్కీ ముస్లిహ్ అల్ రిఫాయి అలియాస్ అబూ ఖదీజాను శనివారం మట్టుపెట్టింది. ఇరాకీ నిఘాతోపాటు భద్రతా దళాల సంయుక్త సహకారంతో ఇరాక్‌లోజరిపిన ఆపరేషన్‌లో ఆతడిని క్షిపణి ప్రయోగించి హతమార్చింది. ఇందుకు సంబంధించిన విడియోదృశ్యాలను అమెరికా సెంట్రల్ కమాండ్ విడుదచేసింది. ఈనెల 13న జరిగిన ఈసీక్రెట్ ఆపరేషన్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. అబూ ఖదీజా కారులో వెళుతుండగా అమెరికా దళాలు క్షిపణిని ప్రయోగించాయి. ఆతడితోపాటు మరో ఐసిస్ ఉగ్రవాది సహాయకుడుగా ఉన్న వ్యక్తిచనిపోయినట్లుసెంట్‌కామ్ తెలిపింది. దాడి తర్వాత మృతదేహాలను స్వాధీనంచేసుకున్నారు. ఇద్దరి శరీరాలకు ఆత్మాహుతి బాంబులు అమర్చి ఉన్నాయని మరిన్ని ఆత్యాధునిక ఆయుధాలు ఉన్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. గతంలో ఓ ఆపరేషన్‌నుంచి అబూఖదీజా తృటిలో తప్పించుకోగా అప్పట్లో డిఎన్‌ఎ నమూనాను సేకరించారు. వీటి ఆధారంగా తాజా డిఎన్‌ఎ పరీక్షలు నిర్వహించి ఖదీజా మృతిని ధృవీకరించారు. ఇరాక్‌ప్రధాని ముందు ఆతడి మరణవార్తను ధృవీకరించిన తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈవార్తను వెల్లడించారు. మా యుద్ధ యోధులు ఆతనికోసం వెంటాడి విజయం సాధించారని, ఆతడి దుర్భర జీవితంముగిసిందని మా బలంతోనే శాంతిని సాధించామని ట్రంప్ వ్యాఖ్యలుచేసారు. అబూఖదీజా ఐసిస్‌ముఠాలో రెండో అత్యంత శక్తివంతమైన నాయకుడిగా ఉన్నాడు. ఈ సంస్థ గ్లోబల్ ఆపరేషన్స్ పర్యవేక్షిస్తున్న ఆతడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రమాదకర ఉగ్రవాదుల్లో ఒకడిగా ఉన్నారు. 2023లో ఆతడిపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది. ఐసిస్‌కు వ్యతి రేకంగా అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ భద్రతా దళం కొన్నేళ్లుగా కీలకమిలిటరీ ఆపరేషన్లు చేస్తోంది. 2017 నాటికి ఇరాక్, 2019 నాటికి సిరియాలో ఈసంస్థ కార్యకలాపాలు చాలా వరకూ నిర్వీర్యం అయ్యాయి. అయితే ఈరెం డుదేశాల గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ ఈగ్రూప్ నాయకులు నక్కి ఉండి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

# రైతుల ఆత్మహత్యలపై ఆందోళన కలుగుతోంది: శరద్‌పవార్



**బారామతి, మార్చి 15:** మహారాష్ట్రలోని మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యల పట్ల ఎన్సీపీ శరద్‌వర్గం నేత శరద్‌పవార్ ఆందోళన వ్యక్తం చేసారు. రైతాంగాన్ని ఆదుకోవడంకోసం కేంద్రం ఒక స్పష్టమైన విధానంతో ముందుకురావాలని ఆయన కోరారు. రాష్ట్ర పునరావాసశాఖ విడుదలచేసిన గణాంకాల ప్రకారం గత ఏడాది మొత్తం 2635 మందిరైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తేలింది. ఈ డేటాను పరికించిన శరద్‌పవార్ రైతు ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తంచేసారు. విభిన్న ప్రాంతాలనుంచి మేం మరికొంత డేటాను సేకరిస్తామని కేంద్రం రైతులను ఆదుకునేందుకు ఒక స్పష్టమైన ప్రణాళికతో రావాలనికోరారు. ఎన్సీపీనేత జయంత్ పాటిల్ అజిపవార్‌వర్గంలోకి వెళ్లడంపై ఆయన మాట్లాడుతూ పాటిల్ ఇప్పటికే మీడియాకు ప్రకటన ఇచ్చారన్నారు. ఎన్‌సీపి ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న పాటిల్ అంతకుముందే పార్టీని వీడతారని తనకు తెలుసునని అన్నారు. ముందురోజు తనను కలిసారని తన ప్రకటనను తప్పుగాఅర్థంచేసుకున్నారని చెప్పారని అన్నారు. కేంద్ర మాజీ వ్యవసాయ మంత్రి అయిన శరద్‌పవార్ మహారాష్ట్ర వ్యవసాయ రంగాన్ని ఆదుకోడానికి కేంద్రమే ముందుకురావాలని వ్యవసాయంలో విప్లవాలను తెచ్చేందుకు కృత్రిమ మేధను వినియోగించాలని, చెరకు సాగులో ఎఐ వినియోగం అనివార్యం అవుతున్నదన్నారు. చెరకు నాణ్యతను పెంచేందుకు ఎఐ టెక్నాలజీ ఎంతైనా అవసరం అవుతుందన్నారు. భీడ జిల్లాలో సర్పంచ్‌ను హత్యచేయడాన్ని కూడా ఆయన తీవ్రనిరసన తెలిపారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న భీడ్ జిల్లాలో ఇలాంటి సంఘటనలు చోటుచేసు కోవడం శాంతిభద్రతల సమస్యను పెంచుతోందన్నారు.



# అమెరికాలోని దక్షిణాఫ్రికా రాయబారి ఇబ్రహీం రసూల్ బహిష్కరణ

### అమెరికా విదేశాంగ మంత్రి రూబియో

**వాషింగ్టన్, మార్చి 15:** దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా వివిధ దేశాలకు చెందిన రాయబారులపైనా బహిష్కరణ వేటు వేస్తున్నారు. యూఎస్‌లోని దక్షిణాఫ్రికాకు చెందిన రాయబారి ఇబ్రహీం రసూల్‌పై వేటు వేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. దక్షిణాఫ్రికా రాయబారి ఇబ్రహీం రసూల్ ఈ గొప్ప దేశంలో ఉండేందుకు ఆహ్వానించదగిన వ్యక్తి కాదు. అధ్యక్షుడు ట్రంప్‌ను ద్వేషించే వ్యక్తి. ఆయన ఒక జాతి విద్వేష రాజకీయ నాయకుడు. దీనిపై ఆయనతో చర్చించాల్సింది ఏమీ లేదు. అని రూబియో పేర్కొన్నారు. రసూల్ ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొని ట్రంప్ పరిపాలనకు వ్యతిరేకంగా విమర్శలు చేశారు. దీని కారణంగానే బహిష్కరిస్తున్నట్లు రూబియో సూత్రప్రాయంగా పేర్కొన్నారు. ఈ బహిష్కరణపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇబ్రహీం రసూల్ 2010 నుంచి 2015 వరకు అమెరికాలో దక్షిణాఫ్రికా రాయబారిగా పనిచేశారు. ఆ తర్వాత ఈ యేడాదిలో తిరిగి ప దవిని చేపట్టారు. ఇదలా ఉండగా తుర్క్‌మెనిస్థాన్‌లో పాకిస్థాన్ రాయబారిగా వ్యవహరిసునతన్న ఎసాన్‌కు యూఎస్‌లోకి అనుమతి నిరాకరించింది.

# మహిళా ఎస్ఐపై కానిస్టేబుల్ అత్యాచారం, ఆపై బ్లాక్‌మెయిల్

### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎస్ఐ




**డెహ్రాడూన్, మార్చి 15:** తాను పనిచేస్తున్న పోలీస్ శాఖలోనే తనకు అవమానం జరిగిందని, ఒక కానిస్టేబుల్ తనపై అత్యాచారంచేసి తనను బ్లాక్‌మెయిల్‌చేస్తున్నాడని ఒక మహిళా ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదులుచేసింది. డెహ్రాడూన్ పోలీస్ శాఖలోపనిచేస్తున్న మహిళా ఎస్ఐ పటేల్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. కానిస్టేబుల్ అస్లామ్‌పై తీవ్రస్థాయి అభియోగాలతో కేసు నమోదు చేసారు. ఇటీవలే ఒక కొండప్రాంత పోలీస్‌స్టేషన్‌నుంచి డెహ్రాడూన్‌కు బదలీపై వచ్చింది. తన డ్యూటీ లొకేషన్‌కు దూరంగా ఉండటంతో తాను నగరంలోని ఒక హోటల్‌లో బసచేసేందుకు నిర్ణయించుకన్నానని తన సహచరుడు కానిస్టేబుల్ తనకు రూమ్ బుక్ చేసాడని తెలిపింది. హోటల్ గదిలోకి తాను వెళ్లిన వెనువెంటనే కానిస్టేబుల్ బలవంతంగా తనపై అత్యాచారం చేసాడని తెలిపింది. తనను లైంగికంగా హింసించడమే కాకుండా ఈ సంఘటనను విడియో చిత్రించి తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తెలిపింది. ఎవరికి చెప్పినా, ఎవరికి ఫిర్యాదులు చేసినా విడియోను వైరల్ చేస్తానని తెలిపింది. ఈసంఘటనతో ఎంతో మానసికంగా కృంగిపోయానని శెలవుపై ఇంటికి వెళ్లిపోవాలనుకుంటున్నట్లు ఆమె చెప్పింది. మానసిక వత్తిడితో తాను ఒటికిసైతం వెళ్లలేకపోతున్నట్లు తెలిపింది. ఆతడి బ్లాక్‌మెయిలింగ్‌ను తట్టుకోలేక ఫిర్యాదుచేసినట్లు చెప్పింది. బిఎన్‌ఎస్‌లోని 115(2), 126(1), 308, 351(2), 351(3), 352, 64,77, 78 సెక్షన్లకింద కానిస్టేబుల్‌పై కేసునమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. ఎస్ఎస్‌పి అజయ్‌సింగ్‌మాట్లాడుతూ బాధితురాలికి వైద్యపరీక్షలు జరుగుతున్నాయని మేజిస్ట్రేట్‌ముందు ఆమె వాంగ్మూలం నమోదు చేస్తామన్నారు. ఈ కేసు పర్యవేక్షణను ఆప్రాంత రూరల్ ఎస్పీకి అప్పగించామన్నారు. ఆరోపణలు రుజువు కాగానే సంబంధిత కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్‌పీ హెచ్చరించారు.

# జమ్ముకాశ్మీర్‌లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి!

## బడ్జెట్‌లో వరాలు కురిపించిన సిఎం ఓమర్ అబ్దుల్లా



**జమ్ము, మార్చి 15:** జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా తన బడ్జెట్‌లో మహిళలపై వరాలు కురిపించారు. 200 యూనిట్లవరకూ ఉచిత విద్యుత్ పంపిణీచేస్తామని, అంత్యోదయ అన్న యోజన కుటుంబాలకు ఈ సౌకర్యం వర్తింప చేస్తామని ఏప్రిల్ ఒకట వతేదీనుంచి జమ్ము కాశ్మీర్‌లో మహిళలు ప్రభుత్వ నిర్వహణలోని ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత ప్రయాణాల్లో ఈబస్సుల్లో కూడా ఉచిత ప్రయాణ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి ఎఎవై కుటుంబాలకు నెలనెలా పదికిల్లో ఉచిత బియ్యం అందిస్తామని, అంత్యోదయ అన్నయోజన కేటగిరిలో ఉన్న బాలికలకు వివాహ వేడుకలకు సాయం కూడా అందుతుందని ప్రస్తుతం ఇస్తున్న రూ.50 వేలను రూ.75 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజారవాణాను మరింత అభివృద్ధి చేసేందుకు శ్రీనగర్, జమ్ము ప్రాంతాల్లో 200కిపైగా ఈబస్సులను ప్రవేశపె డుతున్నట్లు ఓమర్ ప్రకటించారు. జమ్ము కాశ్మీర్‌లో అధికరణం రద్దు తర్వాత జరిగిన ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌ఎన్సీ ప్రభుత్వం తన మొట్టమొదటి బడ్జెట్‌నుప్రవేశపెట్టింది. 2011 జనాభా లెక్కలప్రకారం జమ్ముక కాశ్మీర్‌లో మహిళా జనాభా 59 లక్షలమందివరకూ ఉన్నా రు. మహిళల్లో అక్షరాస్యత శాతం కూడా పెరుగుతోంది. చెప్పుకోదగిన సంఖ్యలో మహిళలు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ప్రయా ణాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఓమర్ అబ్దుల్లా ప్రకటించిన ఉచిత రవాణా పథకంపై మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.



# ఆయుధాలతో లొంగిపోండి ప్రాణాలకు గ్యారంటీ

### ఉక్రెయిన్‌సేనలకు పుతిన్ వార్నింగ్

**మాస్కో, మార్చి 15:** ఉక్రెయిన్‌తో యుద్ధంలో కాల్పుల విరమణ తాత్కాలిక ఒప్పందంకోసం ఒకవైపు చర్చలు జరుగుతుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌మాత్రం సంచలన వ్యాఖ్యలుచేసి ఈ దౌత్యపరమైన సంప్రదింపులను సందిగ్ధంలోకి నెట్టేసారు. కర్స్క్ ప్రాంతాన్ని స్వాధీనంచేసుకున్న ఉక్రెయిన్‌సేనలు ఆయుధాలతో సహా లొంగిపోతే వారు ప్రాణాలతో ఉంటారని హెచ్చరించారు. క్యీవ్‌సేనలపై కనికరం చూపాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేసిన విజ్ఞప్తివేళ పుతిన్ ఈ వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. మానవతా అంశాలను పరిగణనలోనికితీసుకోవాలన్న ట్రంప్ పిలుపునాకు అర్థం అయిందని ఆయన సూచన మేరకు ఒక విషయం స్పష్టంగా చెపుతున్నానని, ఒకవేళ వారు ఆయుధాలు విడిచి లొంగిపోతే వారి ప్రాణాలకు గ్యారంటీ ఇస్తానని, రష్యా ఫెడరేషన్‌తోపాటు అంతర్జాతీయ చట్టాలప్రకారం వారిపై చర్యలు తీసుకుంటాం అని పుతిన్ చెప్పారు. అధ్యక్షుడి వ్యాఖ్యలు రష్యా టెలివిజన్ ప్రసారం చేసింది. పశ్చిమరష్యాలోని కర్స్క్‌లో కొంతభాగం ఉక్రెయిన్‌సేనలు తమ అధీనంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అక్కడ ఉక్రెయిన్ బలగాలు పౌరులపై నేరాలకు పాల్పడుతున్నారని పుతిన్ ఆరోపించారు. దీన్ని ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది.

అక్కడ తమ సైన్యం పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని తెలిపింది. 30రోజుల తాత్కాలిక కాల్పుల విరమణకు పుతిన్ సూత్ర ప్రాయంగా అంగీకరించారు. అమెరికా అధ్యక్షుడే స్వయంగా ఈ అంశం వెల్లడించారు. రష్యా నుంచి మంచి సంకేతాలు వచ్చాయని, మాస్కోతో చర్చలు ఫలప్రదం అయ్యాయని అన్నారు. యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఉక్రెయిన్‌ను కనికరిం చాలని పుతిన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈపరిణామాలక్రమంలో పుతిన్ మళ్లీ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశం అయింది. కాల్పుల విరమణను తిరస్కరించేందుకు రష్యా సిద్ధంగా ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇప్పటికే ఆరోపించారు.

# ఇద్దరు కుమారుల్ని చంపి ఫ్యాన్‌కు ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య

## రమణయ్యపేటలో విషాద సంఘటన

**కాకినాడ రూరల్, మార్చి 15(ప్రభాత వార్త):** కంటికి రెప్పల కాపాడవలసిన కన్న తండ్రే కాలయముడై అత్యంత పాశవికంగా అంతమొందించి తాను కూడా ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మ హత్య కు పాల్పడ్డాడు. ఈ సంఘటన రమణయ్యపేట గ్రామం తోట సుబ్బారావు నగర్ లో చోటుచేసుకుంది. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓ ఎన్ జి సి లో ఉద్యోగం చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కు చెందిన వానపల్లి చంద్ర కిషోర్ (37) భార్య పిల్లలతో ఓ అపార్ట్మెంట్లో నివసిస్తున్నారు. పిల్లలు జోషి (7) నిఖిల్ (6) భార్యతో కలిసి ఓఎన్జీసీ కార్యాలయం వద్ద హోళీ పండుగ వేడుకలలో పాల్గొన్నారు. అక్కడ భార్యను ఉండమని చెప్పి పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చి పిల్లలకు కళ్ళకు గంతలు కట్టి కాళ్ళు చేతులు తాళ్లతో కట్టేసి బకెట్ నీటిలో మంచి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చాడు. తరువాత బెడ్రూంలో ఫ్యానుకు చున్నీతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతసేపటికి భర్త,పిల్లలు రాకపోవడంతో భార్య ఫోన్ చేసినప్పటికీ సమాధానం రాలేదు. ఓ ఎన్ జి సి సిబ్బందితో కలిసి భార్య ఫ్లాట్ కు వచ్చి బలవంతంగా కిటికీ తలుపులు తెరిచి చూడగా చంద్ర కిషోర్ బెడ్రూంలో ఉరి వేసుకుని, పిల్లలు బాత్రూంలో విగత జీవులుగా పడి ఉన్నారు. భర్త పిల్లలు ను చూసి భార్య తనూజ స్పృహ తప్పి పడి పోయింది. సర్పవరం ఎస్ ఐ శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేశారు. సివి పెద్దిరాజు విచారణ చేపట్టారు. బెడ్రూంలో సూసైడ్ నోట్ ను పోలీసులు కనుగొన్నారు. పిల్లలు సరిగ్గా చదవడం లేదని మనస్తాపం చెంది అంతమొందించానని నోట్ లో ఉన్నట్లు తెలిసింది.



స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)జి.జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ,ఎంఎల్ఏ వసంత కృష్ణప్రసాద్

# మనిషి చేసే చిన్న తప్పు.. తన మనుగడకే పెద్ద ముప్పు

## - రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సిసిఎల్ఎ)జి.జయలక్ష్మి

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** మనిషి చేసే చిన్న తప్పు.. తన మనుగడకే పెద్ద ముప్పు అని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను వినియోగించకుండా మనం చేసే ఓ చిరు ప్రయత్నం భావి తరాలకు బంగారు భవిష్యత్తుకు నాంది అని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమం నిర్వహిస్తోంది.ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో కీలకంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలం, జూపూడిలో జరిగింది. ఈ కార్యక్రమంలో సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి హాజరయ్యారు. తొలుత చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీ, విక్రయాల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటి స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా మనం ఈరోజు చేసుకునే సంకల్పం భావితరాలకు, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. మనం ఒకరికి చెడుచేస్తే మనకూ చెడు జరుగుతుందని నమ్ముతాం.. మరి విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తూ చేసే చెడు తప్పకుండా మనకు చెడు చేస్తుందన్నారు. మైక్రో ప్లాస్టిక్స్ రక్తంలో చేరి కేన్సర్ వంటి రోగాలకు కారణమవుతున్నాయని అధ్యయనాల్లో వెల్లడైందని.. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ నిషేధం అనే ఓ బృహత్తర కార్యక్రమం విజయవంతంగా అమలుచేయడంలో మహిళలతో పాటు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అగ్రికల్చర్ సైంటిస్ట్ అయిన కలెక్టర్ లక్ష్మీశ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం దుష్పరిణామాలను చాలా బాగా వివరించారని పేర్కొన్నారు. వీటి భావాన్ని సరైన విధంగా అర్థం చేసుకుంటూ మంచి ఆలోచనతో పర్యావరణ హిత సమాజం దిశగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. మన ప్రవర్తనలో మార్పు రావాలి: కలెక్టర్ లక్ష్మీ శకలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ప్రతినెలా మూడో శనివారం ఒక ఇతివృత్తంతో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రధాన అంశంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, పారిశ్రామిక యూనిట్లు, పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్‌యార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు.. ఇలా ప్రతిచోటా స్వచ్ఛతా పరిమళాలు వెల్లివిరియాలని.. స్వచ్ఛత ఔన్నత్యాన్ని చాటిచెప్పడంతో పాటు సింగిల్ యూజి ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు వంటివి నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ అనేది భూమిలో కనీసం 400 ఏళ్లపాటు అలానే ఉండిపోయి ఆపై మైక్రో ప్లాస్టిక్స్‌గా మారి వివిధ మార్గాల ద్వారా మన శరీరంలో చేరి ఆరోగ్యాన్ని ఛిద్రం చేస్తుందన్నారు. అందువల్ల క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు వంటి వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. ఉదాహరణకు చికెన్ దుకాణానికి వెళ్లినప్పుడు పాలిథిన్ సంచుల్లో కాకుండా మనమే బాక్సు తీసుకెళ్లి చికెన్ తెచ్చుకునే క్రమశిక్షణ ఓ పెద్ద మార్పునకు దోహదం చేస్తుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా మన ప్రవర్తనలో మార్పు రావాలని పేర్కొన్నారు. ఉద్యమంగా ముందుకుతీసుకెళ్దాం: శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్రలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చరమగీతం పాడేందుకు ఓ ఉద్యమంలా ముందుకుతీసుకెళ్దామని.. మరో మంచి కార్యక్రమం జూపూడి నుంచి ప్రారంభం కావడం ఆనందంగా ఉందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గతంలో ప్లాస్టిక్ భూతం లేదని.. ఇప్పుడు అది మనల్ని మట్టుపెట్టేస్తోందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ వినియోగంపై గట్టి నియంత్రణకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కృషిచేయనున్నట్లు తెలిపారు. మనం ఇప్పుడు మేలుకోకుంటే మన భావితరాలకు పెద్ద ముప్పు తప్పదని హెచ్చరించారు.

# గవర్నర్ నజీర్‌ను కలిసిన వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మాజీమంత్రి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ ఎన్.సునీత రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం విజయవాడ రాజ్ భవన్‌కు వెళ్లిన సునీత రెడ్డి . తన తండ్రి హత్య కేసుపై గవర్నర్ కు ఫిర్యాదు చేశారు. వివేకాను అతి కిరాతంగా హత్య చేశారని, ఈ కేసులో తనకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసేలా చూడాలని కోరారు. హత్య జరిగిన నాటి నుంచి నేటి వరకూ జరిగిన పరిణామాలను గవర్నర్‌కు వివరించారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి హత్య కేసులో సాక్షులంతా ఒక్కొక్కరిగా అనుమానాస్పద స్థితిలో మృతిచెందుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. హత్య జరిగి ఆరేళ్లు గడిచిపోయాయని, అయినా కేసు మాత్రం కొలిక్కి రాలేదంటూ సునీత రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత సమయం గడిచినా సీబీఐ కోర్టులో కనీసం ట్రయల్ కూడా ప్రారంభం కాలేదని విమర్శించారు. ఈ కేసును సీబీఐ తిరిగి దర్యాప్తు చేపట్టాలని కోరుకుంటున్నట్టు చెప్పారు సునీత. అయితే కేసు దర్యాప్తును అడ్డుకునేందుకు కొన్ని శక్తులు పని చేస్తున్నాయని ఆరోపించారు. వివేకాను చంపిన నిందితుల్లో ఒక్కరు మినహా అందరూ బెయిల్ పై బయటే తిరుగుతున్నారని, సాక్షులు మాత్రం చనిపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షులను వాగ్మూలం వెనక్కి తీసుకోవాలంటూ నిందితులు హెచ్చరిస్తున్నారని సునీత చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా తమ కుటుంబానికి న్యాయం జరగడం లేదని, నిందితులకు కఠిన శిక్ష పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలోని వేద విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం: ప్రొఫెసర్ డివిఆర్ శేషాద్రి

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలోని, పల్నాడు జిల్లాలోని మాదిపాడు గ్రామంలో గల వేద వేదాంత గురుకుల మహావిద్యాలయం నిర్వహిస్తున్నారు. మహా విద్యాలయంలో వేద విద్యనభ్య సించదలచిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ధర్మాధికారి ప్రొఫెసర్ డీవీఆర్ శేషాద్రి ప్రకటించారు. శనివారం తాడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు.వేద విద్యను అభ్యసించదలచిన వారు 99630 57025 నంబరు ద్వారా వాట్సాప్ సందేశం పంపాల న్నారు. ఈ వేద పరిశోధన ఈ క్యాంపస్‌లో కీలక భాగంగా కొనసాగుతుందన్నారు.ఈ సంస్థ సమర్థవంతమైన భాగస్వామ్యాలతో మరింత అభివృద్ధి చెందుతూ వచ్చిందన్నారు.పాఠశాలల్లో వివిధ శాఖల బోధన అందుబాటులో ఉంటుందని అన్నారు. కృష్ణ యజుర్వేదం - తైత్తిరీయ శాఖ, శుక్ల యజుర్వేదం కాణ్వ శాఖ, ఋగ్వేదం శాకల శాఖ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కృష్ణ యజుర్వేద స్మార్థం అభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన అందించబడుతుంది అన్నారు. ఏడాదికి కనీసం ఇద్దరు ఘనపాఠులు, ముగ్గురు క్రమపాఠులు ఉత్తీర్ణులుగా తయారవుతారు అని తెలిపారు. ఒక వేద విద్య పూర్తి చేయడానికి పన్నెండు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ పరీక్షలు శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించబడతాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు శృంగేరి జగద్గురువుల ధర్మపత్రము అందుకోవడంతో పాటుగా ప్రత్యేక ఆర్థిక పురస్కారాన్ని కూడా పొందుతారు. వేద విద్యను సదాచారంతో బోధించే అంకితభావం గల, అధిక పాండిత్యం కలిగిన ఉపాధ్యాయులు ఎంపిక చేయబడతారు. వారికి ఆర్థికంగా సముచిత పారితోషికం, వేద ఆచారాలకు అనుగుణంగా జీవించే ఉత్తమ వాతావరణం అందించబడు తుందన్నారు. వేద విద్యా వికాసానికి విస్తృత ప్రణాళి1993లో శృంగేరి శారదా పీఠం ఆశీస్సులతో స్థాపించబడిన ఈ గురుకుల మహావిద్యాలయం, వేద జ్ఞానం, సనాతన ధర్మ పరిరక్షణ, అభ్యసన ధ్యేయంగా పనిచేస్తోందని ప్రొఫెసర్ శేషాద్రి తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు ప్రకటించారు.గిరిజన విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ, గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ధార్మిక విలువలతో కూడిన ఆధునిక విద్యను అందించడంతో పాటు, ప్రపంచ స్థాయిలో అవకాశాలను అందించేందుకు అవసరమైన మెళకువలు నేర్పనున్నారు. పర్యావరణ పరిరక్షణకు హరిత వనంఇదే సందర్భంలో, మహావిద్యాలయ ప్రాంగణంలో ఔషధ వృక్షాలను నాటనున్నట్లు ప్రకటించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల్లేకుండా పూర్తిగా సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని అనుసరించనున్నారు.వేద విద్యార్థులకు ప్రత్యేక వసతులువిద్యార్థులకు వసతి, ఆహారం, విద్యా సదుపాయాలు పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. శారదా పీఠం నిర్వహించే నిశ్చిత పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసిన వారు, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ పొందనున్నారు. అదనంగా, ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ప్రామాణిక డిగ్రీలను అభ్యసించేందుకు అవకాశం కల్పించనున్నారు.వేద విద్యార్థులకు తగిన ఆర్థిక మద్దతు, ఉపకార వేతనాలు అందించబడతాయి. వేద అధ్యాపకులకు ఆధునిక సదుపాయాలువేద విద్యాభ్యాసం చేసిన వేద అధ్యాపకులకు తగిన పారితోషికం, ఆధునిక వసతులు, కుటుంబ అనుకూల వాతావరణాన్ని కల్పించనున్నారు.

# పిజి విద్యార్థులకు శాపంగా మారిన జిఓ రద్దు చేయాలి

## -ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈరోజు ఏఐఎస్ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలోనే లెనిన్ సెంటర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చినటువంటి హామీలో భాగంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు, వైసీపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతులలో జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం వర్తింపజేస్తుందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకోవడం జరిగిందన్నారు, తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో కిటకిటలాడుతున్న యూనివర్సిటీలలో రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీలో విద్యార్థులు లేనటువంటి దౌర్భాగ్యమైనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో బాగుపరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష హ యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత నెల రోజులపాటు పశు వైద్య విద్యార్థులు స్టైఫండ్ 7000 నుంచి 23 వేలకు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నారని తక్షణమే పశు వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించి స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు.

# ముస్లిం మైనార్టీ కాంట్రాక్టర్లకు నాలుగు శాతం రిజర్వేషన్

## కర్ణాటక కాంగ్రెస్ రిజర్వేషన్లపై మండిపడుతున్న బిజెపి



**బెంగళూరు, మార్చి 15:** కర్ణాటక కేబినెట్ నిర్ణయాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నవేళ కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ ప్రాజెక్టుల్లో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పించడంపై బిజెపి విరుచుకుపడుతోంది.ముస్లిం వర్గాలను సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ ముస్లిం లీగ్ అంటూ బిజెపి విమర్శలు గుప్పిస్తోంది. విమర్శలు ఎన్ని వచ్చినా ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం కేటాయింపునకు డిప్యూటి సిఎం శివకుమార్ మద్దతు పలికారు. ఈ కోటా ఉద్యోగాలు, విద్యలో కాదని, ఇది కాంట్రాక్టర్ల కోసమని, ఒక కోటి రూపాయల విలువైన ప్రభుత్వ ప్రాజెక్టులకు బిడ్డింగ్ వేసేందుకు ఉద్దేశించింది మాత్రమేనన్నారు. నాలుగు శాతం ముస్లింలకు మాత్రమే అనే దానిని డికె శివకుమార్ ఖండించారు. ఇది ముస్లింలకు మాత్రమే కాకుండా అన్ని మైనార్టీ వెనుకబడిన తరగతులకు కూడా వర్తిస్తుందని హుబ్బళిలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సీఎం, ఆర్థిక మంత్రి అయిన సిద్ధరామయ్య ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు రిజర్వేషన్లుప్రకటించారు. కర్ణాటక పారదర్శకత ప్రజాసేకరణ చట్టానికి సవరణ ద్వారా ఈ రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీఎస్టీ ఇతర వెనుకబడిన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్ల తరహాలోనే ముస్లింలకు కాంట్రాక్టుపనుల్లో నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పించాలని మైనార్టీ నాయకులు అభ్యర్థించారు. దీనిపై కూలంకషంగా చర్చించిన తర్వాత కేబినెట్ సమావేశంలో బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపారు. అయితే ఈ నాలుగుశాతం రిజర్వేషన్ ముస్లింలు ఒక్కరికే కాదని అందరు మైనార్టీలకు కల్పిస్తామని అన్నారు. ఎస్సీఎస్టీలకు కేటగిరి వన్, కేటగిరి2ఎ, కేటగిరి2బి కాంట్రాక్టర్లు రెండుకోట్ల రూపాయల పరిధివరకూ పనులుచేపట్టేందుకు వెసులుబాటు కల్పించారు. బడ్జెట్‌లో ఈ రిజర్వేషన్లను ప్రకటించిన ముఖ్యమంత్రి 42,018 కోట్ల రూపాయలు ఎస్సీఎస్టీ సంక్షేమానికి వినియోగిస్తున్నట్లుప్రకటించారు.

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ రాజకీయాలు?

**డీలిమిటేషన్‌పై నిర్ణయమే జరగలేదు**

**ఆరు గ్యారంటీలు, సమస్యలపై చర్చించే దమ్ముందా?**

**హైదరాబాద్ డ్రగ్స్‌కు అడ్డాగా మారినా చర్యలేవి?**

**కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్**



శనివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**కరీంనగర్, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని కేంద్రాన్ని బదనాం చేయడమంటే సూర్యుడిపై ఉమ్మేసినట్లేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం గైడ్ లైన్స్ రూపొందించలేదన్నారు. ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. నిర్ణయమే తీసుకోనప్పుడు దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తమిళ నాడులో డీఎంకే, కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అసెంబ్లీలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ నిర్ణయం కాంగ్రెస్, బిఆర్ఎస్ డ్రామాలో భాగమేన న్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ రెండు పార్టీలకు దిక్కుతోచడం లేదన్నారు. అందుకే అసెంబ్లీలో సస్పెన్షన్ పేరుతో బిఆర్ఎస్‌కు మరో ఆయుధాన్ని కాంగ్రెస్ అందిం చిందన్నారు. శనివారం కరీంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో బండి సం జయ్ మాట్లాడారు. కాం గ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే పార్టీల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. రాజాసింగ్ వ్యా ఖ్యలను నేను వినలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే రహస్య భేటీలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు ఏమిచ్చిందో ముందు సమాధానం చెప్పమనండి. అసలు మీరు ప్రజలకు చేస్తోందే మిటి? స్మార్ట్ సిటీ నిధులను కేంద్రం మంజూరు చేస్తే రాష్ట్ర వాటా ఇవ్వడం లేదు. కేంద్రం వివిధ పథకాలకు నిధులిస్తే మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని దించేశారు. మళ్లీ కాంగ్రెస్ అదేపాట పాడుతోందన్నారు. 6 గ్యారంటీలపై చర్చను దారి మళ్లించడానికి, పాలనపై దారి మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే 6 గ్యారంటీలపై అఖిలపక్షం నిర్వ హించాలి. అసెంబ్లీలో ఆ హామీలపై చర్చించా లన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో తట్టుకోలేక దెబ్బతీయడానికి ఈ రెండు పార్టీలు కలిసి ఎత్తుగడలు వేస్తున్నా యన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణ డ్రగ్స్‌కు అడ్డాగా మారాయి. వాటిపై చర్యల్లేవు. డ్రగ్స్‌తో పిల్లలు అల్లాడుతున్నారు. చిన్న పిల్లలతో డ్రగ్స్ దందా చేయిస్తుంటే ఏం చేస్తున్నారు. డ్రగ్స్ కేసుపై కనీసం విచారణ లేదు. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్ పాత్ర ఉందని తెలిసినా ఎందుకు అరెస్ట్ చేయ లేదని ప్రశ్నించారు. నిరంతరం అబద్దాలతో ఒకవైపు కేంద్రాన్ని బదనాం చేస్తూ,ఇంకోవైపు హైదరాబాద్ సెంట్రల్ వర్శిటీ వద్దనున్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముతూ దోచుకోవాలని చూస్తున్నారనీ తెలిపారు.ప్రజలంతా గమనిస్తున్నారు, తగిన గుణ పాఠం చెప్పే రోజులు

# సచివాలయం ప్రాంగణంలో డ్రోన్ల ఎగరవేత.. ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** కట్టుదిట్టమైన భద్రత ఉండే సచివాల యంపై డ్రోన్లు ఎగురవేసిన ఉదంతం కలకలంరేపింది. ఈ నెల 11న రాత్రి వేళ ఇద్దరు వ్యక్తులు సచివాలయ ఆగ్నేయ ద్వారం వద్ద రెండు డ్రోన్లను ఎగురవేశారు. ఈ డ్రోన్లు సచివాలయం లోపల మైదానం ప్రాంతంలో చక్కర్లు కొడుతున్న సమ యంలో అక్కడ భద్రత నిర్వహిస్తున్న ఎస్‌పిఎఫ్ సిబ్బంది వెంటనే దీనిపై పైఅధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు దీనిపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై రంగంలో దిగిన సైఫాబాద్ పోలీసులు డ్రోన్లు ఎగురవేసిన యాటల వంశీ (ఇతను డ్రోన్ కెమెరా ఆపరేటర్)తోపాటు అతని వెంటనున్న ఎస్.నాగరాజు లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రెండు డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# అమెరికాలో తెలుగు సంబురాలు.. తెలంగాణ సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 15:** అమెరికాలోని ప్రముఖ తెలుగు సంఘం నాట్స్ ప్రతి రెండేళ్లకోసారి అంగరంగ వైభవంగా నిర్వహించే తెలుగు సంబరాలకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఫ్లోరిడాలోని టంపా వేదికగా జూలై 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న 8వ నాట్స్ అమెరికా తెలుగు సంబరాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ నాట్స్ బృందం ఆహ్వాన పత్రికను అందించింది. అమెరికాలో తెలుగువారంతా కలిసి ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ అమెరికా తెలుగు సంబరాలని ఈ సంబరాల్లో పాలుపంచుకుంటే తమకు ఎంతో సంతోషంగా ఉంటుందని నాట్స్ బృందం సభ్యులు రేవంత్‌రెడ్డిని కోరారు. సంబరాల్లో నిర్వహించే కార్యక్రమాల గురించి నాట్స్ బృందం రేవంత్‌రెడ్డికి వివరించారు. సిఎంను కలిసిన బృందంలో అమెరికా తెలుగు సంబరాల కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ బోర్డ్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని,అధ్యక్షులు మదన్ పాములపాటి తదితరులు ఉన్నారు.

# ఎబిసిడి తెలియకుండా కేంద్రంపై యుద్ధమా?

## దక్షిణాదిలో మునుపటిలా ప్రజలను రెచ్చగొడితే ఊరుకోరు



**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 15, ప్రభాతవార్త:** ఎబిసిడి తెలియకుండా కేంద్రంపై యుద్ధం చేయాలంటే ఎలా?దక్షిణ భారతదేశంలో గతంలో లాగా ప్రజలను రెచ్చగొడితే ప్రజలు ఊరుకోబోరని ప్రజలు చైతన్యం అయ్యారని,కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేసారు. శనివారం బేగంపేట రైల్వేస్టేషన్ పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా మోడీ నాయకత్వంలో అన్ని భాషలకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని, రాజకీయ దురుద్దేశంతో ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మీ పప్పులు ఉడకబోవన్నారు. డీలిమిటేషన్ ప్రకారం సీట్లు తగ్గుతాయని ఎలా భావిస్తారని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు ఎన్నికల్లో భాగంగానే ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు డీఎంకే స్టాలిన్ పాల్పడుతున్నారని మండి పడ్డారు. తమిళ భాషలో తీసిన సినిమాలు హిందీ లో ఉత్తర భారతదేశంలో ప్రదర్శిస్తూ వందల వేల కోట్లు సంపాదిస్తున్నారని అ న్నారు. అత్యధికంగా తెలుగు, తమిళ సినిమాలను ఉత్తరాదిలోనూ ఆదరిస్తున్నారని అన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ లాంటి అనేకమంది ప్రజలు తెలంగాణ అభి వృద్ధిలో పాలుపంచుకుంటున్నారని అన్నారు. స్టాలిన్ ఐదు సంవత్సరాలుగా సిఎంగా ఏం చేసారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిలదీసారు. ఏం చేయలేదు కాబట్టే భాష పేరుతో డీలిమిటేషన్ పేరుతో తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. గతంలో విధానం ఉన్నట్లు డీలిమిటేషన్ విధానం ఉంటుందన్నారు. ఇంతవరకు జనాభా గణనే పూర్తి కాలేదని, నియమ నిబంధనలు రూపొందించలేదని అన్నారు. తమిళనాడులో త్రిభాష పాలసీ కొత్తది కాదన్నారు. అనేక సంవత్స రాలుగా కాంగ్రెస్ ఉన్నప్పుడు కూడా ఇదే విధానం కొనసాగుతుందని, ఇప్పుడు కూడా ఇదే కొనసాగు తుందన్నారు. దక్షిణ భారతదేశంలో తెలంగాణ, తమిళనాడులో ఏఒక్క వ్యక్తిపైనా బలవంతంగా హిందీ నేర్చుకోవాలని బలవంత పెట్టలేదన్నారు. చైనా, జపాన్ దేశాలు కూడా వారివారి భాషల్లోనే మాట్లాడుతున్నా యన్నారు.

సీఎం స్టాలిన్ భాషపై పూర్తి అవాస్తవాలను మాట్లాడుతున్నారని అన్నారు. ఐదు సంవత్సరాలుగా తమిళ భాష ఏంచేశారో చెప్పాలని నిలదీసారు.

ప్రధాని మోడీ నూతన ఎడ్యుకేషన్ పాలసీ వచ్చాక మాతృభాషలోనే హయ్యర్ విద్యకు అవకాశం కల్పించామన్నారు.

# ద్విభాషా విధానానికే కట్టుబడిన తమిళనాడు

## అసెంబ్లీలో తీర్మానం చేసిన టైమ్‌కు పవన్ పుట్టి ఉండరు!

### డిఎంకె సీనియర్ నాయకుడు ఇళంగోవన్

**చెన్నై, మార్చి 15:** త్రిభాషా విధానం అమలులో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతున్న అంశం తెలి సిందే. ఈ వివాదంపై ప్రముఖ నటుడు ఎపి డిప్యూటీ సిఎం పవన్‌చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీసాయి. త్రిభాషా సూత్రంపై డిఎంకె తీరును పవన్ ఆక్షేపించారు. దక్షిణాదిపై హిందీని రద్దు తున్నారంటూ మాట్లాడుతున్నపుడు తమిళ సిని మాల్ని హిందీలో డబ్బింగ్ ఎందుకు చేస్తున్నా రం టూ ప్రశ్నించారు. పవన్ వ్యాఖ్యలపై డిఎంకె కూడా స్పందించింది. ఆ పార్టీ ప్రతినిది సయ్యద్ హాఫీజుల్లా మాట్లాడుతూ వ్యక్తిగతంగా హిందీ లేదా మరే ఇతర భాషలునేర్చుకోడాన్ని తాము అడ్డు కోవడం లేదన్నారు.ప్రజలపై హిందీ లేదా మరే ఇతర భాషను బలవంతంగారుద్దడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. తమిళనాడులో సుదీర్ఘ కాలంగా హిందీకి బలవంతపు ప్రాధాన్యత ఇవ్వ డాన్ని వ్యతిరేస్తున్నామన్నారు. కేంద్రం మాత్రం ఎన్ఈపీ, పిఎం శ్రీస్కూల్స్ వంటి విధా నాలతో రాష్ట్రప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దుతోం దన్నారు. డిఎం కె సీనియర్ నేత ఇళం గోవన్ మాట్లాడుతూ తమిళనాడులో భాషా విధానం చాలా కాలంగా స్థిరంగా ఉందని,1938 నుంచే తమిళనాడు హిందీకి వ్యతిరేకంగా పోరాడు తోందని, ద్విభాషా విధానమే అమలు చేస్తామని 1968లో రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని కూడా ఆమోదించు కున్నా మని గుర్తు చేసారు. విద్యా నిపుణులు సలహాలు సూచనలతోనే ఈనిర్ణయం తీసుకున్నామని, ఆ బిల్లు పాస్ అయ్యే సమయానికి పవన్‌కళ్యాణ్ పుట్టి ఉండరని, తమిళరాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఉండొచ్చని ఎద్దేవా చేసారు.

**హిందీని కాదు.. నిర్బంధ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం**

**పవన్ విమర్శలకు డిఎంకె ప్రతినిధి స్పందన**

**న్యూఢిల్లీ:** త్రిభాషా సూత్రం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు డిఎంకె ప్రభుత్వం మధ్య పెనువివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ డిఎంకె తీరును ఆక్షేపించారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నప్పుడు తమిళ సినిమాల్నిడబ్బింగ్ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు డిఎంకె అధికార ప్రతినిధి డాక్టర్ సయీద్ హాఫీజుల్లా స్పందిస్తూ పవన్ విమర్శలను తోసిపుచ్చారు. భాషా విధానంపై తమిళనాడు వైఖరిని ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా హిందీ, ఇరత బాషలు నేర్చుకోవడాన్ని మేం ఎన్నడూ అడ్డుకోలేదు. ఆసక్తి ఉన్నవారు నేర్చుకోవడం కోసం ఇప్పటికే మా రాష్ట్రంలో హిందీ ప్రచార సభలను నిర్వహిస్తున్నాం. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్ఇపి, పిఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో మా రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నాం. అని డిఎంకె ప్రతినిధి వెల్లడిం చారు. ఈ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత టిఎకెఎస్ ఎళన్‌గోవన్ మాట్లాడుతూ 1938 నుంచే తమిళులపై హిందీ భాష బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

# నిరంతరంగా నీటి తోడివేత

### 30 హెచ్‌పి మోటారు ద్వారా బురద, మట్టి తొలగింపు
### ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు
### బృందాలవారీగా నాగర్‌కర్నూల్ కలెక్టర్ సమీక్ష


సహాయక చర్యల్లో పాల్గొన్న రెస్క్యూ బృందాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో నిరంతరంగా డీవాటరింగ్, బురదచమట్టి తొలగింపు చర్యలు కొనసాగుతు న్నాయి. ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. అన్వి సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా, 30 హెచ్‌పి సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంక్ ఉపయోగించి నీటితో కూడిన బురద మరియు మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులను అమలు చేస్తున్నట్లు, సహాయక బృందాల ఉన్నతాధికారులు ప్రతిరోజు టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశాన్ని చేరుకొని సహాయక బృందాలకు చేయవలసిన పనిపై మార్గనిర్దేశం చేస్తూ, సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు వేగంగా జరిగేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టన్నెల్‌లో 24 గంటలు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని, గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నట్లు వివరించారు.

టన్నెల్‌లోని నీటిని తొలగించేందుకు డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, ఆధునిక పరికరాలు రోబోట్లను ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు, సహాయక బృందాలు, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, అవసరమైన మార్పులను అమలు చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయడం కోసం భద్రతా నిపుణుల పర్యవేక్షణలో పనులు కొనసాగిస్తూ, సహాయక చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా, ఆక్సిజన్ సరఫరా, వైద్య సేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టన్నెల్ లోపల పనిచేసే బృందాల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుని, అత్యవసర అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం లిక్విడ్ రింగ్ వ్యాక్యూమ్ పంప్, వాక్యూమ్ ట్యాంక్ తో కూడిన మిషన్ పనితీరును జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు పరీక్షిత్ మేహార, సింగరేణి మైండ్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు నిరంజన్, డా.హరీష్, జీఎస్ఐ అధికారులు తప్లియాల్, హైడ్రాధికారులు కడవర్ డ్రాగ్స్ స్క్వాడ్, ర్యాట్ హోల్ మైనర్స్, ఎస్డిఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే అధికారులు అన్వి రోబోటిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది

### పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్



**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు. మీ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల కంటే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులను అన్ని అంశాల్లో మెరుగ్గా తీర్చి దిద్దుతాం అన్నారు. బకాయిల గురించి ఇప్పుడు మీరు మాట్లాడుతున్నారు, అసలు ఆ బకాయిలు పేరుకపోయిందే మీ హయాంలో అని మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో పేరుకపోయిన బకాయిలను దశల వారీగా చెల్లిస్తున్నామని, గుండెపై చేయి వేసుకొని నిజాలు మాట్లాడాలని కోరుతున్నానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ ఉత్సవాల కోసం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పట్లో మీ పార్టీ ఈ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేసింది. తీరా అధికారంలోకి వచ్చాకా మీరేం చేశారన్నారు. 2014 నుంచి 2023 వరకు ఒక్కసారి కూడా కాకతీయ ఉత్సవాలను నిర్వహించలేదని, ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ విషయంలో బిఆర్ఎస్ పార్టీ విఫలమైందన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అనుభవం కలిగిన సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి అసత్యాలు మాట్లాడకుండా రాష్ట్రాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

## సోషల్ మీడియాతో ఇబ్బందులు ఎదుర్కొన్నా: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** సోషల్ మీడియాతో నేను కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నా అని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..సోషల్ మీడియా ఎఫెక్ట్ ను సీఎం సభలో మాట్లాడడం మా అందరికీ చాలా రిలీఫ్‌గా ఉందన్నారు. నా ఫోటో లు మార్ఫింగ్ చేసి..మానసిక ఆవేదనకు గురి చేశారన్నారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులను నన్ను డిమోరల్ అయ్యేలా చేశాయన్నారు. మహిళలు రాజకీయాల్లో ఎదగడమే కష్టం.. అలాంటిది మేము ఈ స్థాయికి వస్తే మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను సోషల్ సర్వీస్‌కు వాడుకున్న నేను.. అంతే ఇబ్బందులకు గురయినట్లు తెలిపారు. సోషల్ మీడియాను బిఆర్ఎస్ అబద్దాలను ప్రచారం చేసేందుకు వినియోగించుకుంటుందని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా కుటుంబాలను బజారుకీడుస్తుందని, బాడీ షేమింగ్, ఫొటోలు మార్ఫింగ్, అననవి అన్నట్లుగా చెప్తున్నారు. గత సంవత్సరం నుంచి ఇది ఎక్కువ అవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అన్న చెల్లెల్లు చేతిలో చెయ్యి వేసుకున్నా.. మరోకరకంగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను మంచికి వాడాలి. కానీ చెడుకు కాదన్న మంత్రి సీతక్క కరోన సమయంలో ఎంతో సర్వీస్ చేశానని దాన్ని కూడా సోషల్ మీడియాలో విమర్శించారన్నారు.

### కారుణ్య నియామకాలు.. 588 మందికి ఉద్యోగాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 15:** పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖల్లో కారుణ్య నియామకాలకు లైన్ క్లియర్ కానుంది. ఈ శాఖలో ఏళ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న వారికి మేలు జరగనుంది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భర్తీ కానున్నాయి. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను ఈ నెల 19లేదా 20న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కారుణ్య అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నారు.
పంచాయతీరాజ్‌శాఖలో 588 కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీరందరికీ 19న లేదా 20న ఉద్యోగ నియామకపత్రాలను సీఎం అందజేయనున్నారు. 2016 నుంచి వీరంతా పంచాయతీరాజ్‌శాఖలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూసున్నారు. ఈ విషయంలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఆర్థికశాఖ నియామకాలకు అనుమతి ఇచ్చింది.

## ఓయులో ధర్నాలు, ఆందోళనలపై నిషేధం

### ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:**వందేళ్లకు పైగా చరిత్ర కలిగి.. ఉద్యమాలకు పుట్టినిల్లుగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇకపై ధర్నాలు, ఆందోళనలపై నిషేధం విధిస్తున్నట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన సర్క్యులర్ నంబర్ ఎంఆర్-155ను జారీ చేశారు. యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ల దగ్గర, కాలేజీలు, స్టడీసెంటర్లు, పరిపాలన భవనం దగ్గర ఇకపై ఎటువంటి ధర్నాలు, ఆందోళనలు చేయవద్దని ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ధర్నాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. విద్యార్థులకు ఎవరికైనా ఎదైనా సమస్య ఉంటే ముందుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని.. ఆ తరువాత అందుకు సంబంధించిన విజ్ఞాపనను రిజిస్ట్రార్‌కి సమర్పించాలని సూచించారు. ధర్నాలు చేసినట్టైయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్నో ఉద్యమాలకు పురుడుపోసుకున్న ఘటనలు చరిత్రలో ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఉస్మానియా యూనివర్సిటీ తన ప్రభావాన్ని చూపించిన విషయం తెలిసిందే.

## బిసి గురుకులాల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ దరఖాస్తు గడువు 31వ తేదీ

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యా సంస్థల సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన పోయిన సీట్లు(బ్యాక్ లాగ్) భర్తీకి దరఖాస్తు గడువును పొడిగించారు. దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని 6, 7, 8, 9వ తరగతుల (ఇంగ్లీష్ మీడియం)లో మొత్తం 6,832 బ్యాక్ లాగ్ సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20(ఆదివారం)న ఉదయం 10 గంటల నుంచి నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని సొసైటీ కార్యదర్శి తెలిపారు. ప్రవేశ పరీక్షకు అర్హతగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం బిసి గురుకుల అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎప్‌సెట్‌కు 1.20 లక్షలు దాటిన దరఖాస్తులు

### ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు గడువు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025 దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. మొదటి రోజు 5010 దరఖాస్తులు వచ్చాయి. శనివారం సాయంత్రం వరకు 1,20.333 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌కి 85702 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 34,541 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 90 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఎప్ సెట్-2025 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయగా.. దరఖాస్తులను మార్చి 1 నుంచి స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఏప్రిల్ 4 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదిల్లో నిర్వహించనుండగా.. ఇంజనీరింగ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు.

# 56వేల మందికి నియామకపత్రాలు ఇచ్చిన సర్కారు

### శాసనమండలిలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలిలో ముగిసిన చర్చ

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో శనివారం చర్చ ముగిసింది. ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగించాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. గురువారం ప్రారంభమైన చర్చ.. శనివారంతో ముగిసింది. బిజెపి సభ్యుడు ఏవిఎన్ రెడ్డి చర్చలో పాల్గొంటూ ఏడాది కాలంలోనే 56వేల ఉద్యోగాలను భర్తీ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఏకకాలంలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడం రైతులకు చేయూతనివ్వడమేనన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఒక ఉచిత బస్సు పథకం తప్ప మిగిలిన ఏ పథకం అమలు కాలేదన్నారు. ఉచిత పథకాలు ఎవరికోసం అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. టిజెఎస్ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ఉద్యోగ ఖాళీలను ఎప్పటి కప్పుడు భర్తీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్, రైతు కమిషన్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెడితే ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని సూచించారు. రహమత్ అలీఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పేరుతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. ఎంఐఎం పక్ష నాయకుడు ఎఫెండీ మాట్లాడుతూ రైతులకు చేయూతనివ్వడానికి రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12వేలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే 56వేల మందికి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. దేశంలో బిసిలకు 27 శాతం రిజర్వేషన్లను అమలు చేసింది ఆనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. మండల్ కమిషన్ సిఫారసుల మేరకు బిసిలకు 27 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ నిర్ణయం తీసుకున్నారని.. అప్పుడు ఉన్న బిజెపి నేతలు దీనిని వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుంటే.. బిజెపి అడ్డుపడటానికి ప్రయత్నిస్తోందన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అహంకార పూరితంగా వ్యవహరిస్తోంది: పల్లా

### ఆ భాష మీపై మాట్లాడితే ఊరుకుంటారా? మంత్రి పొన్నం

**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ వర్సెస్ బిఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చ సాగింది. గవర్నర్ ప్రసంగానికి దన్యవాదాలు తెలిపేప్రసంగంలో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగానికి దశ, దిశ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అహంకార పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. హామీలపై ప్రశ్నిస్తే జర్నలిస్టులపై కేసులు పెడుతున్నారన్నారు. మహిళా జర్నలిస్టు రేవతి, తన్విలను వెంటనే విడుదల చేయాలన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా జర్నలిస్టులు పెట్టిన వీడియోను సభ ముందు పెడితే వాళ్ల తప్పు మాట్లాడారా? కరెక్టు మాట్లాడారా అన్నది అందరికి తెలుస్తుందన్నారు. తమకు జర్నలిస్టులు అంటే గౌరవం ఉందన్నారు. అదే భాష మీమీద మాట్లాడితే ఊరుకుంటారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీకి ఎప్పుడు సొంత పేపర్, ఛానల్ లేదన్నారు. జర్నలిస్టులు మంచి రాయాలి, చెడురాయలన్నారు. పల్లా వారికి మద్దతు పలకడం సమజసం అకాదన్నారు.



## 400 ఎకరాల సెంట్రల్ వర్సిటీ భూమి విక్రయం దారుణం

### ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్



**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే తెలంగాణ ప్రభుత్వ హేయమైన నిర్ణయాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీ ఈస్ట్ క్యాంపస్‌లో ఉన్న ఈ 400 ఎకరాల భూమిలో వర్సిటీలోని ఎంతో ఆదరణ పొందిన మష్రూమ్‌రాక్ వంటి ప్రదేశాలను ఉన్నాయి, ఈ స్థలం మన జాతీయ పక్షి అయిన నెమలులు, జింకలు, అనేక రకాల పక్షులు మరియు చాలా అరుదైన వృక్ష మరియు జీవ సంపదకు నిలయంగా ఉందన్నారు. అంతటి విశేష పర్యావరణ, అకడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగిన ఇటువంటి స్థలాన్ని ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు స్వార్థ ప్రయోజనాలకు ధారాదత్తం చెయ్యాలనుకుంటున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి విద్య మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని సూచిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ శేరిలింగంపల్లి మండలంలోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల ఈ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్థలాన్ని 10,000 కోట్లు (అంచనా విలువ)కు మార్చి 8 నుండి 15 తారీఖు మధ్య వేలం వేయబోతున్నట్లు పత్రికా ముఖంగా ప్రకటించిందన్నారు. అయితే ఈ స్థలం న్యాయంగా సెంట్రల్ యూనివర్సిటీకి చెందుతుందని, వర్సిటీ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నంబర్.25 కింద 2300 ఎకరాల స్థలాన్ని పరిశోధన విద్యారంగ అభివృద్ధికి కేటాయించిందన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ స్థలాన్ని మళ్ళీ వర్సిటీకి కేటాయించాలని, భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలని, లేకపోతే బిజెపి ఉద్యమిస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

### ఎమ్మెల్యే రాంచంద్రనాయక్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం అని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ అన్నారు. శనివారం గవర్నర్ ప్రసంగానికి దన్యవాదలు తెలిపే సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా బిఆర్ఎస్ నేతలు పాలన సాగించారన్నారు. ప్రశ్నించే వారిని పది సంవత్సరాల పాటు తొక్కిపెట్టారన్నారు. పది సంవత్సరాల పాలన నమ్మక ద్రోహానికి చిరునామా అన్నారు. ప్రాజెక్టులు కట్టారు, అప్పుడే అవి కూలిపోయాయి. కాళేశ్వరంతో అవినీతి తప్ప ఒరిగింది ఏమీలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను మేలు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంట్ను ప్రభుత్వం తమ ప్రభుత్వం అన్నారు.

## టి సేఫ్‌కు ఏడాది పూర్తి.. 35వేలకుపైగా రాకపోకల పర్యవేక్షణ

### ట్రావెల్ అగ్రిగేటర్లతో అనుసంధానం

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** తెలంగాణలో క్యాబ్‌లతో పాటు ఇతర వాహనాలలో ప్రయాణాలు సాగించే వారికి భద్రత కల్పించేందుకు ఉద్దేశించి పోలీసు శాఖ రూపొందించిన టీ..సేఫ్ యాప్‌కు ఏడాది పూర్తయ్యింది. గత ఏడాది అందుబాటులోకి తెచ్చిన ఈ యాప్ సంవత్సర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల మంది ప్రయాణీకుల రాకపోకలను పర్యవేక్షించి రికార్డు సాధించింది. ఈ యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లో డౌన్ లోడ్ చేసుకున్న ప్రయాణీకులు ప్రయాణ సమయంలో యాక్టివేట్ చే సుకుంటే గమ్యస్థానం ప్రయాణాలు ముగించే వరకు రియల్ టైంలో పర్యవేక్షిస్తుంది. ప్రయాణ సమయంలో అలర్ట్‌లు పంపిస్తుంది. వాటికి స్పందించకుంటే వెంటనే డ యల్ 100కు అత్యవసర సందేశం పంపుతుంది. తద్వారా సమీపంలోని పోలీసు, గస్తీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకునేలా యాప్ దోహ దం చేస్తుంది. ఒక రకంగా చె ప్పాలంటే ప్రయాణాలు సాగించే వారు ఎలాంటి ఆపదలో వున్నా వారికి సహకరిస్తుంది. స్మార్ట్ ఫోన్లతో పాటు ఇంటర్నెట్ సదుపాయం లేని ఫీచర్ ఫోన్లలోనూ ఈ యా ప్ సేవలను ప్రయాణీకులు పొందవచ్చు. గత ఏడాది మార్చి 12వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి ఈ యాప్‌ను ఆవిష్కరించారు.
ఈ యాప్ ఏడాది పూర్తి చేసుకోవడంతో పాటు మంచి ఫలితాలను ఇవ్వడంతో రాబోయే రోజుల్లో ఓలా, ఉబర్, ర్యాపిడో, మనయాత్రి, సేఫ్‌గాడి, అభిబస్ తదితర ట్రావెల్ అగ్రిగేటర్ల యాప్‌లతో టి.సేఫ్ యా ప్‌ను అనుసంధానం చేసేందుకు పోలీసు శాఖ కసరత్తులు చేస్తోంది. కాగా ఈ యాప్ తెలంగాణ వ్యాప్తంగా 43 వేలకు పైగా అండ్రాయిడ్ ఫోన్లలో డౌన్ లోడ్ అయ్యిం ది. ఒక ఏడాదిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 35 వేలకు పైగా ప్రయాణాలను ఈ యాపఖ పర్యవేక్షించింది. దీంతో పాటు 36,470 డీవియేషన్లను కనిపెట్టి ము ందుజాగ్రత్త చర్యలను చేబట్టింది.
ఇదే సమయంలో 23 వేలకు పైగా ఎస్ఓఎస్ (అత్యవసర) సందేశాలను డయల్ 100కు పంపింది. దీనిద్వారా సగటున ఎనిమిది ని మిషాలలోపు ఆయా ప్రాంతాల గస్తీ పోలీసులు ప్రయాణీకులను చేరుకోగలిగారు. యాప్‌కు గూగుల్ ప్లే స్టోర్‌లో 269 రివ్యూలతో 4.8 రేటింగ్ దక్కింది.

## విధ్వంస, విచ్ఛిన్నకర, భాషా సంస్కృతిని నియంత్రించాలి : సిపిఐ పక్ష నేత సాంబశివరావు


**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** రాజకీయ నాయకులు ఎన్నైనా భరిస్తారనే వాదన ఉందని, అయితే వారి పట్ల విధ్వంస, విచ్చిన్నకర, భాషా సంస్కృతిని వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, అటువంటి భాషను నియంత్రించాలని సిపిఐ పక్ష నేత కె సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రిప్లై ఇచ్చారు. అనంతరం దీనిపై సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులపై నీచంగా, బూతులు మాట్లాడే సంస్కృతి రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఉద్భవించిందన్నారు. పక్క నున్న ఆంధ్రప్రదేశ్ నుండి ఇటువంటి విచ్చిన్నకర, విధ్వంసకర పదాల సంస్కృతి రావడంనశోచనీయమని చెప్పారు. అసలు ఈ సంస్కృతిని మార్చాలని ఇందుకు వీటిని నియంత్రించేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి 42 శాతం నిధులు కేటాయించాలి

### ఎస్సీ, ఎస్టీల లాగే బిసిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి
### బిసి మేధావుల విస్తృత సమావేశంలో వక్తల డిమాండ్




**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 42 శాతం నిధులు కేటాయించాలని ఎస్సీ,ఎస్టీల లాగానే బిసిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని బిసి మేధావులు, నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బేగంపేటలోని హరిత ప్లాజా లో బీసీ సంఘాలు బీసీ మేధావుల విస్తృత స్థాయి సమావేశాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, టీపీసీసీ ప్రచార కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రొఫెసర్ మురళి మనోహర్, డి.ఎస్.పి అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, ఈసందర్భంగా పదేళ్లుగా రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు చేస్తున్న కేటాయింపులపై రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం రాష్ట్రంలో బిసిలకు జరుగుతున్న అన్యాయంపై చిరంజీవులు రాసిన గణాంకాలతో కూడిన బుక్‌లెన్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం జనాభా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటా యించాలని, కాంట్రా క్టులలో 42 బీసీల కేటాయించాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగానే బీసీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి, బీసీల సంక్షేమానికే వినియో గించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ గత ఏడాది బడ్జెట్లో 20వేల కోట్ల కేటాయించి, అందులో 9200 కోట్లే ఖర్చు చేశారని ఆరోపించారు. కాన్షిరాం బాటలో రాహుల్ గాంధీ ముందుకు సాగుతున్నారని, కానీ రాష్ట్రంలో ప్రాక్టికల్ గా కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. కులగన విషయంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంద మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ న్నారు. తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీ చట్టాన్ని తయారు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు నిధుల కేటాయింపుపై ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కేంద్రంలో చాతుర్వర్ణ బడ్జెట్ ఉంటుందని, రాష్ట్రంలో కుల బడ్జెట్ ఉంటుందని డి.ఎస్.పి అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ విమర్శించారు. రాహుల్ గాంధీ కులదన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారని, అందులో భాగంగా మొదటగా మధుయాష్కి గౌడ్‌ను తెలంగాణ సీఎం చేస్తే బాగుండేదని పేర్కొన్నారు. రాజ్యాధికారం ద్వారానే సమస్యల పరిష్కారం అవుతుందని ప్రొఫెసర్ మురళి మనోహర్ అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ ఉద్యమాల ఫలితంగా అన్ని పార్టీలు బీసీల జపం చేస్తున్నాయన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్న బీసీ ఉద్యమాలకు మద్దతు తెలపాలన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ విటల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐఏఎస్ చెల్లెటి ప్రభాకర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, వివిధ బిసి సంఘాలు,కులసంఘాల నాయకులు పాల్గొన్నారు


కోకాపేట్‌లో గ్యాస్ లీకై ప్రమాదం జరిగిన భవనం ఇదే

## కోకాపేట్‌లోని జిఎఆర్ భవనంలో లీకైన గ్యాస్

### తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలైన ఆరుగురు కార్మికులు.. ఒకరి పరిస్థితి విషమం

**హైదరాబాద్ (నార్సింగి), మార్చి 15, ప్రభాతవార్త:** కోకాపేట్‌లోని జిఎఆర్ బహుళ అంతస్థు భవనంలో ఉన్న రెస్టారెంట్ కిచెన్‌లో గ్యాస్ లీకై ఆరుగురు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ రమణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట్‌లో జిఎఆర్ భవనం ఉంది. దానిలోని రెస్టారెంట్‌లో కిచెన్ కోసం గ్యాస్ కనెక్షన్ ఇస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వచ్చాయి. అక్కడ పని చేస్తున్న రెస్టారెంట్ ఓనర్ రాకేష్, ఐదుగురు కార్మికులు రిజ్వాన్, అన్వర్ మాలిక్, శివ, ఫరూఖ్ మాలిక్, కె.రాజులకు అవి అంటుకొని వారంతా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. ఆరుగురిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కాంటినెంటల్ ఆసుపత్రి సిబ్బంది ఈ గ్యాస్ లీకై చికిత్స కోసం వచ్చిన వారి వివరాలను నార్సింగి పోలీసులకు తెలిపారు. నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద ఘటనా స్థలంను పరిశీలించారు. అక్కడ గ్యాస్ లీకైన ఆధారాలు పరిశీలించారు. పైప్‌లో నుంచి లీకైన గ్యాస్ వలన కార్మికులు మాత్రమే గాయాలపాలయ్యారని, ఇతర ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పోలీసులు తెలిపారు. ఒకరు మాత్రం 50.శాతం గాయాలపాలయ్యారని, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఏసీపీ రమణాగౌడ్ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రమణాగౌడ్ వివరించారు.

**అజాగ్రత్తనే ప్రమాదానికి కారణం**

రెస్టారెంట్‌లో కిచెన్ ఏర్పాటు చేసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకుండా పనులు చేయడం వల్లనే ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రమాదం జరిగిందని, అక్కడ ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలు, రెస్టారెంట్ నిర్వాహకుల అజాగ్రత్తలు కప్పిపుచ్చుకునేందుకే పోలీసులకు సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో..

# ముగిసిన భారత్ పోరు

## క్వార్టర్ ఫైనల్‌కే కూలిన ఆశలు

### లక్ష్యసేన్, గోపీచంద్, గాయత్రీ, త్రిసా ఔట్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక టోర్నీ అయిన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత్ ఆశలు క్వార్టర్ ఫైనల్‌లోనే అడియాశల



య్యాయి. స్టార్ షట్లర్లంతా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించినా, పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరిన లక్ష్యసేన్‌తో పాటు మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ పోరాటం కూడా ముగిసిపోయింది. దీంతో ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి వరుసగా 24వ ఏడాది భారత క్రీడాకారులు టైటిల్ లేకుండానే తిరిగి రానున్నారు. భారత్ నుంచి ఐదు విభా గాల్లో కలిపి మొత్తం 17 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగగా ఒక్కరు కూడా క్వార్టర్ ఫైనల్ దాటి ముందు కెళ్లలేకపోయారు. సంచలన విజయాలతో ఆశలు రేకెత్తించిన లక్ష్య సేన్, పుల్లెల గాయత్రి-త్రిసా జాలీ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ఆగిపోయింది. చివరిగా బర్మింగ్‌హామ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 10-21, 16-21తో ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. ప్రీక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొనా థన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను ఓడించిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు. మరోపక్క మహిళల డబుల్స్‌లో 2022, 2023లలో సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-త్రెసా జాలీ (భారత్) జోడీ ఈసారి క్వార్టర్ ఫైనల్లో 14-21, 10-21తో రెండో సీడ్ లియు షెంగ్షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-త్రెసా జోడీ 15-21, 21-18, 21-18తో ఎనిమిదో సీడ్ కిమ్ హైజియోంగ్-కాంగ్ హీయోంగ్ (కొరియా) జంటను ఓడించిది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన లక్ష్య సేన్‌కు 7,975 డాలర్లు (రూ.6 లక్షల 93 వేలు), గాయత్రి-త్రెసాలకు 9,062 డాలర్లు (రూ.7 లక్షల 87 వేలు) ప్రైజ్ మనీగా లభించాయి. కాగా గతంలో భారత్ నుంచి ప్రకాశ్ పదుకొనే (1980లో), పుల్లెల గోపీచంద్ (2001లో) మాత్రమే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్స్ సాధించారు. అలాగే 2015లో సైనా నెహ్వాల్, 2022లో లక్ష్య సేన్ ఫైనల్ చేరుకున్నా రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు. ఈ సారి క్వార్టర్

ఆట



ఛాంపియన్స్ ట్రోఫీ విజయం:

# కెప్టెన్‌గా రోహిత్ కొనసాగింపు

**న్యూఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రమోషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత జట్టును విజేతగా నిలబెట్టడంతో ఇంకొన్నాళ్లు రోహిత్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజయా నంతరం అతడు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడని జోరుగా ప్రచారం జరిగింది. కానీ ఈ ఊహాగానాలకు రోహిత్ చెక్ పెట్టాడు. తాను వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం లేదని, వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరాడు. మరోవైపు గతేడాది ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో దారుణంగా విఫలమైన రోహిత్ ఆఖరి టెస్ట్ తుది జట్టు నుంచి స్వయంగా తప్పుకున్నాడు. దాంతో రోహిత్ టెస్ట్ కెరీర్ ముగిసిందని, ఇంగ్లండ్ పర్యటనకు అతను దూరంగా ఉంటాడని కూడా ప్రచారం జరిగింది. జస్‌ప్రీత్ బుమ్రానే టీమిం డియా టెస్ట్ టీమ్ నడిపిస్తాడని అంతా భావిం చారు. కానీ ఛాంపియన్స్ ట్రోఫీ విజయం నేప థ్యంలో రోహిత్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతుండటం కూడా ఇందుకు కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రోహిత్ శర్మ మెరు గ్గా రాణించాడు. దాంతో ఇంకొన్నాళ్లు రోహిత్‌నే టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగించాలని సెలెక్టర్లు నిర్ణయించారట.

# రిచ్ లీగ్‌కు కెప్టెన్స్ ఫైనల్

## ఐదు టీమ్‌లకు కొత్త సారథులు

## టైటిల్ పోరులో 10 జట్లు

### మరో వారంలో ఐపిఎల్ ప్రారంభం



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగ్‌లో రెండవది అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025వ సీజనుకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 22న క్యాష్ రిచ్ లీగ్ 18వ ఎడిషన్‌కు తెరలేవనుంది. ఎప్పటిలాగే ఈ ఏడాదీ ఐపీఎల్‌లో పది ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది ఫ్రాంచైజీలు తమ సారథులను ఖరారు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కటే బ్యాలెన్స్ ఉండేది. అయితే ఇప్పుడు ఆ ఫ్రాంచైజీ కూడా తమ కొత్త కెప్టెన్‌గా అక్షర్ పటేల్ పేరును తాజాగా ప్రకటించింది. కేఎల్ రాహుల్, ఫాఫ్ డుప్లెసిస్ వంటి అనుభవజ్ఞులు జట్టులో ఉన్నప్పటికీ క్యాపిటల్స్ యాజమాన్యం మాత్రం అక్షర్‌కే పట్టం కట్టింది. ఐపీఎల్ వేలానికి ముందు జట్టు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లలో అక్షర్‌ను ఢిల్లీ రిషభ్ పంత్‌ను వదిలేసి మరీ టాప్ రిటెన్షన్ కింద రూ.16.50 కోట్లతో రిటైన్ చేసుకున్నప్పుడే ఈ సీజన్‌లో అతడు సారథిగా ఉంటాడన్న వార్తలు వచ్చాయి. 2019 సీజన్ నుంచి ఢిల్లీకి ఆడుతున్న అక్షర్ 6 సీజన్లలో 82 మ్యాచ్‌లు ఆడి 967 పరుగులు చేయడమే గాక 62 వికెట్లు పడగొట్టాడు. దీంతో అన్ని జట్లు కెప్టెన్ల విషయంలో ఒక స్పష్టత వచ్చినట్లయింది. అయితే ఈసారి ఈ పది జట్ల కెప్టెన్ల విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ జట్లను నడిపించే కెప్టెన్లలో ఒక్క జట్టుకు మినహా మిగిలిన టీమ్‌లన్నింటికీ అంటే 10లో 9 జట్లను నడిపించేది భారతీయ క్రికెటర్లే కావడం విశేషం. ఒక్క సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ మినహా మిగిలిన జట్ల కెప్టెన్లు భారతీయులే. కాగా ఈ సీజన్‌లో ఫ్రాంచైజీలు ఐదు జట్లను కొత్త కెప్టెన్లతో బరిలోకి దిగుతున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లకు సంబంధించిన ఫ్రాంచైజీ యాజమాన్యాలు ఈ ఎడిషన్‌కు కొత్త కెప్టెన్లను నియమించాయి. ఢిల్లీకి అక్షర్ పటేల్, లక్నోకు రిషబ్ పంత్, బెంగుళూరుకి రజత్ పాటిదార్, పంజాబ్‌కు శ్రేయస్ అయ్యర్, కోల్‌కతాకు అజింక్య రహానే సారథులుగా వ్యవహరించనున్నారు. వీరందరూ ఆయా జట్లకు కొత్తగా కెప్టెన్లుగా నియమితులయ్యారు. ఇక మరో 5 ఫ్రాంచైజీ యాజమాన్యాలు తమ టీమ్‌లకు పాత కెప్టెన్లనే కొనసాగిస్తున్నాయి. వాటిలో చెన్నై సూపర్ కింగ్స్‌కు రితురాజ్ గైక్వాడ్, ముంబయి ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా, గుజరాత్ టైటాన్స్‌కు శుభ్‌మాన్ గిల్, రాజస్థాన్ రాయల్స్‌కు సంజు సామ్సన్, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు పాట్ కమ్మిన్స్‌లతోనే నడిపించాలని ఫ్రాంచైజీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకైక విదేశీ కెప్టెన్‌గా పాట్ కమ్మిన్స్ వ్యవహరిస్తాడు. కెప్టెన్సీ పరంగా పాట్ కమ్మిన్స్ అత్యంత సీనియర్‌గా కనిపిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా అతనికి చాలా అనుభవం ఉంది. పాట్ కమిన్స్ ప్రస్తుతం గాయంతో బాధపడుతున్నాడు. అతను ఐపీఎల్‌కు ఫిట్‌గా ఉంటాడని ఆ ఫ్రాంచైజీ యాజమాన్యం భావిస్తోంది. చీలమండ గాయంతో బాధపడుతున్న తర్వాత, పాట్ కమ్మిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ వంటి పెద్ద టోర్నమెంట్లలో కూడా ఆడలేకపోయాడు. అయితే, ఇప్పుడు అతని స్థానం బలంగా ఉంది. అతను మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా ఉండటానికి సిద్ధమయ్యాడు.

మహిళల టి20 సిరీస్‌లో..

# శ్రీలంక తొలి విజయం



**న్యూఢిల్లీ:** మహిళల టీ 20లో శ్రీలంక చేతిలో స్వంతగడ్డ మీద న్యూజిలాండ్ ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. పరిమిత ఓవర్ల సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న శ్రీలంక మహిళల జట్టు తొలి ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో హ్యాట్రిక్ కొట్టింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటైంది. లంక బౌలర్లు మల్కి మదారా 3, కవిష దిల్హారి, ఇనోషి ప్రియదర్శిని తలో 2, సుగంధిక కుమారి, చమారి ఆటపట్టు చెరో వికెట్ తీసి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఎమ్మా మెక్లియోడ్ (44), కెప్టెన్ సూజీ బేట్స్ (21), జెస్ కెర్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జార్జియా ప్లిమ్మర్ 2, బ్రూక్ హ్యాలిడే 4, ఇజ్జి షార్ప్ 0, మ్యాడీ గ్రీన్ 5, పోల్లి ఇంగ్లిస్ 4, రోస్‌మేరీ 0, ఎడెన్ కార్సన్ 7 పరుగులు చేశారు. లంక బౌలర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం ఓపెనర్ చమారీ ఆటపట్టు (48 బంతుల్లో 64 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగడంతో శ్రీలంక 14.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నిలాక్షి డిసిల్వతో (12 నాట్) కలిసి ఆటపట్టు లంకను విజయతీరాలకు చేర్చింది. లంక ఇన్నింగ్స్‌లో విష్మి గౌతమ్ 7, హర్షిత సమరవిక్రమ 2, కవిశ దిల్హారి 12 పరుగులు చేసి ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జెస్ కెర్ 2 వికెట్లు పడగొట్టింది. ఈ గెలుపుతో శ్రీలంక మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక రెండో టీ20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా ఈ నెల 16న జరుగనుంది.

ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# టైటిల్ పోరుకు వెస్టిండీస్

## నేడు భారత్‌తో తుది పోరు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్-2025లో వెస్టిండీస్ ఫైనల్‌కు దూసుకువచ్చింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన రెండో సెమీ ఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. రాయ్పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంకపై కేవలం 6 పరుగుల స్వల్ప తేడాతో వెస్టిండీస్ గెలిచింది. టాస్ గెలిచిన శ్రీలంక తొలుత బ్యాటింగ్‌కు వెస్టిండీస్‌ను ఆహ్వానించింది. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లలో విండీస్ జట్టు 5 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ఓపెనర్లలో డ్వేన్ స్మిత్ (0) విఫలం కాగా, విలియం పెర్కిన్స్ (24) ఫర్వాలేదనిపించాడు. వన్‌డౌన్ బ్యాటర్ లెండిల్ సిమ్మన్స్ (12 బంతుల్లో 17) వేగంగా ఆడగా, కెప్టెన్ బ్రియన్ లారా దంచి కొట్టాడు. శ్రీలంక బౌలర్లలో నువాన్ ప్రదీప్, జీవన్ మెండిస్, అసేల గుణరత్నె ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో శ్రీలంక ఓపెనర్లలో ఉపుల్ తరంగ (30) రాణించగా, కెప్టెన్ కుమార్ సంగక్కర (17), వన్డౌన్‌లో వచ్చిన లాహిరు తిరిమన్నె (9) పూర్తిగా నిరాశపరిచారు. ఇలాంటి తరుణంలో అసేల గుణరత్నె ఒంటరి పోరాటం చేశాడు. 42 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్స్‌సాయంతో 66 పరుగులు సాధించాడు. అతడికి తోడుగా ఇసురు ఉడానా (10 బంతుల్లో 21), దిల్‌రువాన్ పెరీరా (6 బంతుల్లో 11) రాణించారు. కానీ విండీస్ బౌలర్ల విజృంభణ కారణంగా శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 173 పరుగుల వద్ద నిలిచింది. ఫలితంగా 6 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొంది వెస్టిండీస్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. కాగా ఈ నెల 16వ తేదీన జరిగే టైటిల్ మ్యాచ్‌లో ఇండియాతో వెస్టిండీస్ తలపడనుంది.

# వాణిజ్యం

# గోల్డ్ బాండ్స్ ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్..

**న్యూఢిల్లీ, మార్చి 15:** ముందుచూపుతో ఎనిమిదేళ్ల క్రితం సావరిన్ గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసినవారికి జాక్‌పాట్. 2016-17 సిరీస్ 4 బాండ్లకు సంబంధించిన రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. మార్చి 17న మెచ్యూర్ తేదీగా నిర్ణయించింది. దీంతో అప్పట్లో పెట్టుబడులు పెట్టిన వారు దాదాపు మూడింతలు లాభం పొందనున్నారు. దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబరులో ఆర్‌బిఐ ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8యేళ్లు. 2017లో మార్చిలో జారీ చేసిన నాలుగో విడత బాండ్లకు మెచ్యూరిటీ ధరను తాజాగా ఆర్‌బిఐ ప్రకటించింది. అప్పట్లో గ్రాము రూ.2,943 చొప్పున బాండ్లు జారీ చేయగా, తాజా ధరను రూ.8,624గా పేర్కొంది. అంటే అప్పట్లో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు దాదాపు రూ.3 లక్షలు లభిస్తుంది. దీనికి గోల్డ్ బాండ్లపై ఇచ్చే వడ్డీ అదనం. యేటా 2.50 శాతం నామ మాత్ర వడ్డీని బాండ్ల కొనుగోలుపై ఆర్‌బిఐ చెల్లిస్తుంది. గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం 999 స్వచ్ఛత కలిగిన బంగారానికి ఇండియా బులియన్ అండ్ జ్యుయెల్లర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. అలా గ్రాముధరకు రూ.8,624గా నిర్ణయించారు. దీంతో పాటు 2019-20 సిరీస్4కు సంబంధించిన ప్రీ మెచ్యూర్ రిడెంప్షన్ విండోను కూడా మార్చి 17న ఆర్‌బిఐ నిర్ణయించింది. దీనికిగానూ గ్రాము ధరను రూ.8,634గా నిర్ణయించారు. ఇందుకు రిడెంప్షన్‌కు ముందు వారం చివరి మూడు పనిదినాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతర్జాతీయంగా ఔన్సు 3వేల డాలర్లు, దేశీయంగా బంగారం ధర ఆల్‌టైమ్‌గరిష్టాలకు చేరినవేళ సావరిన్‌గోల్డ్‌బాండ్లు రిడెంప్షన్‌కు రావడంతో నిజంగా ఇన్వెస్టర్లకు జాన్‌పాట్ అనే చెప్పాలి.




# ట్రంప్ ప్రభుత్వానికి ఓపెన్ ఎఐ వార్నింగ్

**వాషింగ్టన్, మార్చి 15:** కృత్రిమ మేధ ఆధిపత్యం కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీ తీవ్రతరం అవుతున్న తరుణంలో సామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఎఐ అమెరికా ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. కాపీరైట్ సంస్కరణల్లో నిబంధనల కారణంగా అమెరికన్ కంపెనీలు చాలా వెనుకబడిపోతాయని, చైనీస్ డెవలపర్లు కాపీరైట్ డేటా వినియోగానికి అపరిమిత అవకాశాలు కనుగొంటున్నారని ఓపెన్‌ఎఐ తెలిపింది. ఈ వ్యత్యాసం ఎఐరేసులో చైనాను ముందుంచేందుకు వీలు కల్పిస్తుందని వాదించింది. ఇటీవల యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్)కు ఇచ్చిన ప్రకటనలో ఈ మేరకు వివరాలు వెల్లడించింది. 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్సీ) డెవలపర్లకు కాపీరైట్ డేటా వినియోగానికి అపరిమిత అవకాశం ఉంది. అమెరికా కంపెనీలకు అలాంటి అవకాశం లేకపోతే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోటీ ముగిసిందనే చెప్పవచ్చు. నిజమైన ఐపీ క్రియేటర్లకు రక్షణల విషయంలో పెద్దగా ప్రయోజనం లేకపోగా, కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంపై ఆధిపత్యం కోల్పోయే ప్రమాదం ఉంది. డేటా సంరక్షణ కోసం యునైటెడ్ స్టేట్స్ ప్రస్తుత విధానం కాపీరైట్ కంటెంట్ వినియోగాన్ని పరిమితం చేస్తుంది. అయితే చైనా అటువంటి డేటాను కృత్రిమ మేధ శిక్షణ కోసం స్వేచ్ఛగా ఉపయోగిస్తోంది. ఇది చైనా ఎఐ సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా ఈ పోటీలో ముందుంచుతుంది' అని ఓపెన్‌ఎఐ తెలిపింది. ఇటీవల ముగిసిన పబ్లిక్ కామెంట్ పీరియడ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఐ యాక్షన్ ప్లాన్‌పై 'ఫ్రీడమ్- ఫోకస్డ్'కు సంబంధించి ఓపెన్‌ఎఐ సిఫార్సులను అందించింది. ఎఐ పరిశ్రమలో 'నేర్చుకునే స్వేచ్ఛ'ను ప్రోత్సహించడానికి తన కాపీరైట్ వ్యూహాన్ని మార్చడం ద్వారా అమెరికా మరింత ముందంజలో ఉంటుందని తెలిపింది.




# ఇక ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, మార్చి 15:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) చందాదారులు ఇప్పటి దాకా తమ పొదుపులను సంప్రదాయ పద్ధతుల విత్‌డ్రా చేసుకునే వారు. కానీ పెరిగిన టెక్నాలజీ నేపథ్యంలో ఓ ఐదేళ్లుగా ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాలకు కార్యాలయాల చుట్టూ తిరగే అవకాశం లేకుండా సభ్యుడే నేరుగా ఆన్‌లైన్ ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పీఎఫ్ విత్‌డ్రా కోసం యజమానులపై ఆధారపడకుండా ఎప్పుడైనా ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ముఖ్యంగా ఐటీ మౌలిక సదుపాయాలను గణనీయంగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఈసదుపాయాలు సభ్యులకు అందుబాటులోకి రానున్నాయి. పీఎఫ్ ఉపసంహరణలను సరళీకృతం చేయడం, వాటిని మీ బ్యాంక్ ఖాతా నుంచి నగదు ఉపసంహరించుకున్నంత సులభం పీఎఫ్ విత్‌డ్రా ఫెసిలిటీను సభ్యులకు అందించడమే లక్ష్యంగా ఈ కొత్త అప్‌డేట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈపీఎఫ్ఓ తన పీఎఫ్ ఖాతాలను ఏటీఎం అనుకూల వ్యవస్థతో అనుసంధానించాలని యోచిస్తోంది. అందువల్ల చందాదారులు తమ రిజిస్టర్డ్ యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) లేదా లింక్డ్ బ్యాంక్ సొమ్ము జమయ్యే విధంగా విత్‌డ్రా ప్రాసెస్‌ను సవరించారు. అయితే పీఎఫ్ విత్‌డ్రాతో పాటు వివిధ సేవలను వేగంగా అందించేందుకు ఈపీఎఫ్ఓ కీలక చర్యలు తీసుకుంటుంది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ ఇటీవల ఈపీఎఫ్ఓ 3.0 వెర్షన్‌ను ప్రకటించారు. ఈపీఎఫ్ఓ 3.0 ద్వారా ఏటీఎంల ద్వారా కూడా నేరుగా పీఎఫ్ ఖాతాల నుంచి నిధుల ఉప సంహారణకు వీలు ఉంటుంది. ఈపీఎఫ్ఓ 3.0లో పీఎఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి పీఎఫ్ ఖాతాల ద్వారా తమ నిధులను యాక్సెస్ చేసుకోవచ్చు. అయితే విత్ డ్రా సమయంలో మాత్రం రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేస్తే విత్‌డ్రా చేసుకునే సదుపాయం ఉండనుంది. ఏటీఎం యాక్సెస్‌తో పాటు, ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా కూడా పీఎఫ్ క్లెయిమ్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, భీమ్ వంటి ప్రసిద్ధ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నేరుగా పీఎఫ్ ఖాతాల నుంచి మన బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. ఈపీఎఫ్ఓ 3.0 మీకు ఒక ప్రత్యేకమైన పీఎఫ్ విత్ డ్రా కార్డును అందిస్తుంది. ఇది సాధారణ ఏటీఎం కార్డులా




# భారత్‌కు టెస్లా రెండు మోడళ్లు!.. సర్టిఫికేషన్‌కు దరఖాస్తు

**వాషింగ్టన్, మార్చి 15:** టెస్లా భారతదేశంలో తన కార్ల విక్రయాలను ప్రారంభించడానికి సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని సన్నాహాలు చేస్తున్న సంస్థ. తాజాగా భారతదేశంలో రెండు ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల కోసం సర్టిఫికేషన్ అండ్ హోమోలోగేషన్ ప్రక్రియను ప్రారంభించింది. దేశంలో కార్లను విక్రయించే ముందు సర్టిఫికేషన్ అండ్ హోమోలోగేషన్ ప్రక్రియ తప్పనిసరి. సంబంధించిన వివరాలు ప్రస్తుతానికి అందుబాటులో లేదు. ప్రస్తుతం అమెరికాలో టెస్లా చౌకైన కారు మోడల్3 ధర ఫ్యాక్టరీ స్థాయిలో దాదాపు 35వేల డాలర్లు. భారతదేశంలో దిగుమతి సుంకాలను 15-20 శాతానికి తగ్గించడంతో పాటు, రోడ్ ట్యాక్స్ అండ్ ఇన్సూరెన్స్ వంటి అదనపు ఖర్చులతో, ఆన్-రోడ్ ధర 40వేల డాలర్లు, దాదాపు రూ.35-40 లక్షలుగా ఉంటుంది. టెస్లా మోడల్ వై ధరలు రూ.70లక్షల నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 2023లో 82,688 యూనిట్ల నుంచి 2024లో 20శాతం పెరిగి 99,165 యూనిట్లకు చేరుకున్నాయి. టాటామోటార్స్, జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ కంపెనీలు ప్రస్తుతం మార్కెట్ లీడర్లుగా ఉన్నాయి. కాబట్టి టెస్లా ఇండియా మోటార్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ భారతదేశంలో 'మోడల్ వై, మోడల్ 3' కార్ల హోమోలోగేషన్ కోసం రెండు దరఖాస్తులను సమర్పించింది. హోమోలోగేషన్ అనేది ఒక వాహనం రహదారికి యోగ్యమైనదని, భారతదేశంలో తయారు చేసిన లేదా దేశంలోకి దిగుమతి చేసుకున్న అన్ని వాహనాలకు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉందని ధృవీకరించే ప్రక్రియ. కేంద్రమోటారు వాహన నియమాలకు అనుగుణంగా ఉద్గారం, భద్రత, రహదారి యోగ్యత పరంగా వాహనం భారత మార్కెట్ అసరాలకు సరిపోతుందని సంబంధిత శాఖ నిర్ధారించాలి. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద కార్ల మార్కెట్ అయిన భారతదేశంలో అమెరికన్ కంపెనీ టెస్లా అడుగుపెట్ట డానికి ప్రయత్నిస్తూనే ఉంది. దీనికి సంబం ధించిన ద్వైపాక్షికఒప్పందాలు కూడా పూర్తయ్యాయి. కాబట్టి త్వరలో టెస్లా కార్లు ఇండియన్ మార్కెట్లో అమ్మకానికి రానున్నాయి. అయితే టెస్లా తయారీ ప్లాంట్ ఇండియాలో ప్రారంభిస్తారా? లేదా? అనే దానికి





# రికవరీ దిశగా ఇండస్ ఇండ్ బ్యాంకు: ఆర్‌బిఐ

**ముంబై, మార్చి 15:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు ఇండస్ ఇండ్ బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. బ్యాంకుపై వస్తున్న ఊహాజనిత కథనాలకు డిపాజిటర్లు స్పందించవద్దని సూచించింది. బ్యాంకుకు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించడంతో స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిపాజిటర్లు ఆందోళనకు గురికాకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రకటన విడుదల చేసింది. ప్రైవేట్ రంగ ఇండస్ ఇండ్ బ్యాంకులో దాదాపు రూ.2,100 కోట్ల మేర అకౌంటింగ్ తేడాలు వెలుగు చూశాయి. కరెన్సీ డెరివేటివ్స్‌కు సంబంధించిన అవకతవకలను గత యేడాది సెప్టెంబరు-అక్టోబరులో గుర్తించినా, ఇండస్ ఇండ్ బ్యాంకు ఇప్పుడు బహిర్గతం చేసింది. ఫలితంగా ఇండస్ ఇండ్ బ్యాంకు షేరు భారీగా పతనమైన చిన్న ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. ఖాతాల్లో లోపాల కారణంగా మార్చి త్రైమాసికంలో ఇండస్ ఇండ్ బ్యాంకు రూ.1600 కోట్ల నష్టాన్ని చవిచూడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత త్రైమాసికంలోనే పరిష్కార చర్యలను పూర్తి చేయాలని ఇండస్ ఇండ్ బ్యాంకు బోర్డుకు ఆర్‌బిఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.




# మినరల్ టాక్స్ ఎఫెక్ట్..సిమెంట్ ధరలు పైపైకి!

**ముంబై, మార్చి 15:** సిమెంట్ కంపెనీల మధ్య పోటీ కారణంగా గత కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్న ధరలు, రాబోయే రోజుల్లో ప్రియం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఖనిజాలపై పన్ను విధించేందుకు సిద్ధమవుతుండడమే దీనికి కారణం. దీంతో సిమెంట్ ధరలకు రెక్కలు రాబోతున్నాయని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ జెఎం ఫైనాన్షియల్స్ పేర్కొంది. ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని గతేడాది సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్ తయారీలో వినియోగించే సున్నపురాయి మైనింగ్‌పై టన్నుకు రూ.160 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ పన్ను వల్ల సిమెంట్ తయారీ వ్యయం కంపెనీలకు పెరుగుతుంది. దీంతో లాభదాయకత పెంచుకోవాలంటే సిమెంట్ కంపెనీలకు ధరల పెంపు చేపట్టక తప్పని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఒక్కో బ్యాగ్‌పై తమిళనాడులో రూ.8-10 మేర పెరిగే అవకాశం ఉందని కూడా తెలిపింది. ఈ మేర ప్రజలపై భారం పడే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ మిగిలిన రాష్ట్రాలూ ఇదేతరహా పన్ను తీసుకొస్తే, దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 3rd Mile Stone Renigunta Road, Tirupati-517506 Ph No :2238770, Fax:08772238790, RNI NO.64860/96, Editor: *Damerla Sai Baba, * Responsible for Selection of News under the PRB Act, Regd.:No.H/H.T.P/57, Postal Licence/TRP104/2006/2008 Surcharge:Delhi:40 Ps.